



# విశ్వంవాయిస్

అవినీతిపై- అక్షరసమరం...


తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY






SIMULTANEOUSLY PUBLISHED FROM EAST GODAVARI DISTRICT, CERCULATED AT IN WEST GODAVARI, VISAKHAPATNAM, SRIKAKULAM, VIJAYANAGARAM, VIJAYAWADA, HYDERABAD, BANGLORE, CHENNAI, DELHI, MUMBAI, TIRUPATHI, ANANTAPUR, GUNTUR, KADAPA, KHAMMAM, KARIMNAGAR, KURNOOL, NELLORE, NIZAMABAD, ONGOLE

సంపుటి : 9 | సంచిక : 238 | తూర్పుగోదావరి జిల్లా | ఎడిటర్ : కె. సునీల్‌కుమార్ | బుధవారం 20 మే 2026 | పేజీలు : 12 | వెల : 2/-

## తీరం మనదే.. వేటా మనదే..

# రాజీ లేదు

- మత్స్య ఉత్పత్తులకు మార్కెటింగ్ మేనేజర్‌లా వ్యవహరిస్తా : సీఎం చంద్రబాబు
- వేట నిషేధ సమయంలో 1.30 లక్షల కుటుంబాలకు రూ. 262 కోట్ల ఆర్థిక సాయం
- మత్స్యకార మహిళల కోసం సీవీడ్ సాగు, 60% సబ్సిడీపై 200 మెకనైజ్డ్ బోట్లు
- మన జలాల్లో గస్తీ పెంచి ఇతర రాష్ట్రాల బోట్లను అడ్డుకుంటామని హామీ
- జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ నిర్మాణం, తీర గ్రామాలకు మెటల్ రోడ్ల ప్రకటన

**కావలి, విశ్వం వాయిస్ న్యూస్ :** "తీరం మనదే.. బోటు మనదే.. వేటా మనదే.. రాజీలేదు. ఎవరైనా వస్తే రానిచ్చే పరిస్థితి లేదు. భయపడేది లేదు. ఎవరికోసమో మన జీవనోపాధి కోల్పోవడమేంటి? మన తీరంపై మనకే హక్కులు. పొరుగు రాష్ట్రాలు రావడానికి లేదు. బోటు చొరబడగానే కలెక్టర్‌కు మెసేజ్ వస్తుంది. మెసేజ్ రాగానే అప్రమత్తమవుతాం.. ఎవరినీ రానివ్వం" అని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. "చేపలు పట్టడమే కాదు, వాటిని అమ్ముకోవడంలోనూ మత్స్యకారులకు అండగా ఉంటాను. మీ ఉత్పత్తులకు మంచి ధర వచ్చేలా, ప్రపంచవ్యాప్తంగా గిరాకీ సృష్టించేలా ఒక మార్కెటింగ్ మేనేజర్‌లా నేను వ్యవహరిస్తాను" అని సీఎం చంద్రబాబు మిగతా .. 2లో..



మత్స్యకారుడి ఇంట్లో గరిటె తిప్పి..

## అక్కడే భోజనం చేసి..

ముఖ్యమంత్రి చంద్రబాబు మంగళవారం ఓ మత్స్యకార కుటుంబం ఇంట్లో సొంత కుటుంబ సభ్యుడిలా గడిపారు. స్వయంగా మార్కెట్‌లో చేపలు కొని, వారింటికి తీసుకెళ్లి, వంట చేస్తుండగా సరదాగా గరిటె తిప్పారు. ఆపై ఆ కుటుంబ సభ్యులతో కలిసి కింద కూర్చుని భోజనం చేసి అందరినీ ఆశ్చర్యపరిచారు. ఈ ఆసక్తికర ఘటన నెల్లూరు జిల్లా కావలిలో మిగతా .. 2లో..



స్విచ్‌లు నొక్కడం తప్ప

## జగన్ చేసిందేమీ లేదు

ఏపీ కాంగ్రెస్ చీఫ్ షర్మిల



**విశ్వం వాయిస్ న్యూస్ :** వైసీపీ అధినేత, తన సోదరుడు జగన్ పై ఏపీ కాంగ్రెస్ చీఫ్ షర్మిల తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వైఎస్సార్ ఆశయాలకు జగన్ తూట్లు పొడిచారని ఆమె ధ్వజమెత్తారు. వైఎస్సార్ పేరు చెప్పుకుని 'ఒక్క ఛాన్స్' అంటూ సీఎం అయిన జగన్, ఐదేళ్ల పాలనలో కేవలం స్విచ్‌లు నొక్కడం తప్ప ప్రజలకు చేసిందేమీ లేదని ఎద్దేవా చేశారు. కేవలం బటన్లు నొక్కితే మళ్లీ మళ్లీ సీఎంలు కాలేరని, కనీసం ఎమ్మెల్యేలు, మిగతా .. 2లో..

## ఆ శునకాల కారుణ్య మరణానికి అనుమతి

సుప్రీం కీలక ఆదేశాలు

**విశ్వం వాయిస్ న్యూస్ :** జనసమ్మర్ద ప్రాంతాల నుంచి వీధి కుక్కలను తరలించాలంటూ గతంలో ఇచ్చిన ఆదేశాలను మార్చాలని కోరుతూ సుప్రీంకోర్టులో పలు పిటిషన్లు దాఖలయ్యాయి. వాటిని పరిశీలించిన అత్యున్నత న్యాయస్థానం ఆ అభ్యర్థనలను తోసిపుచ్చింది. గత ఆదేశాలను మార్చేందుకు తిరస్కరించింది. పాఠశాలలు, ఆసుపత్రులు వంటి బహిరంగ ప్రదేశాల నుంచి తరలించిన శునకాలను తిరిగి ఆ ప్రాంతాల్లో వదిలేయొద్దని స్పష్టం చేసింది. వాటి మిగతా .. 2లో..




## పాస్టర్ కథ

# అంతా డ్రామా..

- అల్లూరి సీతారామరాజు జిల్లాలో అభినయ్ దర్శన్‌పై హత్యాయత్నం జరిగినట్లు కేసు
- సింపతీ కోసం వ్యక్తిగత అభినయ్ దర్శన్ డ్రామా ఆడినట్లు గుర్తించిన పోలీసులు
- తనపై దాడి జరిగిందని, చంపేందుకు ప్రయత్నించారని నమ్మించే ప్రయత్నం చేసిన అభినయ్

**రంపచోడవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** పాస్టర్ అభినయ్ దర్శన్‌పై హత్యాయత్నం కేసులో సంచలన విషయాలు వెలుగు చూశాయి. అతనిపై దాడి జరగలేదని, అదంతా ప్రణాళిక ప్రకారం ఆడిన పెద్ద నాటకంగా పోలీసులు తేల్చారు. సింపతీ కోసం, ఇతర వ్యక్తిగత కారణాలతో అతను ఈ హైడ్రామాకు తెరలేపినట్లు పోలీసులు గుర్తించారు. అల్లూరి సీతారామరాజు జిల్లా చింతపల్లిలో అభినయ్ దర్శన్‌పై హత్యాయత్నం జరిగినట్లు కేసు నమోదైంది. కేసు నమోదు చేసుకున్న మిగతా .. 2లో..

తీవ్ర ఆర్థిక సంక్షోభం

## రాబోతోంది


కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ



**విశ్వం వాయిస్ న్యూస్ :** దేశ ఆర్థిక వ్యవస్థకు సంబంధించి కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ కీలక వ్యాఖ్యలు చేశారు. మున్ముందు చాలా కష్టకాలం రానుందని చెప్పిన ఆయన.. చాలా సంవత్సరాలుగా చూడని తీవ్ర ఆర్థిక సంక్షోభం మిగతా .. 2లో..

విజయ్ ప్రభుత్వం

## ఎప్పుడైనా కూలిపోవచ్చు



డీఎంకే నేత ఎంకే స్టాలిన్

**విశ్వం వాయిస్ న్యూస్ :** రాష్ట్రంలో కొత్తగా కొలువుదీరిన విజయ్ ప్రభుత్వం గురించి తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి, డీఎంకే నేత ఎంకే స్టాలిన్ సంచలన వ్యాఖ్యలు చేశారు. విజయ్ ప్రభుత్వం ఎప్పుడైనా మిగతా .. 2లో..

విశాఖలో వైరల్ అవుతున్న

## గోల్డ్ కలర్ కారు

కారుకు బంగారపు రంగు వేయించడానికి రూ.1 లక్ష ఖర్చయినట్లు వెల్లడి




**విశాఖపట్నం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నంలో గత రెండు రోజులుగా ఓ బంగారు వర్ణపు కారు అందరినీ ఆకట్టుకుంటోంది. విశాఖలోని బీచ్ రోడ్డులో నిలిచిన ఈ కారు ప్రత్యేక ఆకర్షణంగా మారింది. బంగారు రంగుతో ఈ కారు మెరుస్తుండటంతో చాలామంది దానిని చూసేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు. కొంత మంది ఈ కారుతో సెల్ఫీలు దిగుతున్నారు. కారు యజమాని ఈ కారుకు బంగారు రంగు వేయించారు. యజమాని రవి మాట్లాడుతూ, తమకు జ్యువెల్లరీ మిగతా .. 2లో..

ఉక్రెయిన్ ఆక్రమణపై పుతిన్ తర్వాత

## పశ్చాత్తాప పడొచ్చు : జిన్‌పింగ్



**విశ్వం వాయిస్ న్యూస్ :** ఉక్రెయిన్‌తో యుద్ధం ప్రారంభమైనప్పటి నుంచి క్రిమియా సహా 20 శాతం ఉక్రెయిన్ భూభాగం ప్రస్తుతం రష్యా నియంత్రణలో ఉంది. దీనిపై చైనా అధినేత జిన్‌పింగ్ గత వారం అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌తో చర్చించినట్లు అంతర్జాతీయ మీడియా కథనాలు పేర్కొన్నాయి. ఈ క్రమంలోనే ఉక్రెయిన్ ఆక్రమణపై రష్యా అధ్యక్షుడు పుతిన్ తర్వాత పశ్చాత్తాప పడొచ్చని జిన్‌పింగ్ అన్నట్లుగా తెలిపాయి. రష్యా యుద్ధంపై జిన్‌పింగ్ ఎప్పుడూ ఎటువంటి అభిప్రాయాలను బహిరంగంగా వ్యక్తం చేయలేదు. గతంలో బైడెన్‌తో చర్చల సమయంలోనూ ఈ విషయంపై ఎటువంటి చర్చలు జరపలేదు. దీంతో రష్యా- ఉక్రెయిన్ యుద్ధం విషయంలో చైనా తన వైఖరిని మార్చుకుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. అయితే బీజింగ్ శిఖరాగ్ర సమావేశంపై అమెరికా విడుదల చేసిన అధికారిక పత్రంలోనూ రష్యా-ఉక్రెయిన్ యుద్ధంపై చర్చలు జరిపినట్లు వెల్లడించకపోవడం గమనార్హం. ఉక్రెయిన్‌తో యుద్ధంలో రష్యాకు కావాల్సిన సైనిక, ఆయుధ సహాయాన్ని చైనా అందిస్తున్నట్లు గతంలో బైడెన్ నేతృత్వంలోని అమెరికా ప్రభుత్వం పలుమార్లు ఆరోపించింది. అయితే, ఈ ఆరోపణలను చైనా ఖండిస్తూ వచ్చింది.

**పుతిన్ చైనా పర్యటన..**

మరోవైపు, రష్యా అధ్యక్షుడు పుతిన్ రెండు రోజుల అధికారిక మిగతా .. 2లో..

దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్

## శాంతి జ్యుడీషియల్ రిమాండ్ పొడిగింపు



**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో ఏపీ దేవాదాయ శాఖ సస్పెండెడ్ అసిస్టెంట్ కమిషనర్ కే.శాంతికి ఏసీబీ ప్రత్యేక కోర్టులో మరోసారి చుక్కెదురైంది. ఆమె జ్యుడీషియల్ రిమాండ్‌ను కోర్టు జూన్ 2 వరకు పొడిగించింది. జైలు నుంచి బయటకు వచ్చేందుకు శాంతి రెండు సార్లు బెయిల్ పిటిషన్లు దాఖలు చేసినప్పటికీ.. కేసు దర్యాప్తు కీలక దశలో ఉందని, ఆమెకు బెయిల్ ఇస్తే సాక్ష్యాలను తారుమారు చేసే అవకాశం ఉందన్న ఏసీబీ న్యాయవాదుల వాదనతో మిగతా .. 2లో..


## 'నీట్'పై ధర్మేంద్ర ప్రధాన్ ఉన్నతస్థాయి సమీక్ష



**ఢిల్లీ, విశ్వం వాయిస్ న్యూస్ :** మళ్లీ నిర్వహించనున్న నీట్-యూజీ పరీక్షపై కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. కట్టుదిట్టమైన భద్రత, ప్రొటోకాల్‌తో పరీక్షను నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. పరీక్ష నిర్వహణలో సమగ్రత, మిగతా .. 2లో..

ఏడాది వ్యవధిలో రెండోసారి..

## భారత్‌కు రానున్న పుతిన్



**విశ్వం వాయిస్ న్యూస్ :** రష్యా అధ్యక్షుడు పుతిన్ ఈ ఏడాది సెప్టెంబరులో భారత పర్యటనకు రానున్నారు. క్రెమ్లిన్ ప్రతినిధి యూరీ ఉషకొవ్ ఈ విషయాన్ని వెల్లడించారు. ఢిల్లీ వేదికగా సెప్టెంబరు 12-13వ తేదీల్లో జరగనున్న బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సులో పుతిన్ పాల్గొంటారని తెలిపారు. ఏడాది వ్యవధిలో పుతిన్ రెండోసారి భారత్‌లో పర్యటించనున్నారు. భారత్-రష్యా వార్షిక శిఖరాగ్ర సదస్సులో భాగంగా గతేడాది మిగతా .. 2లో..

(మొదటిపేజీ తరువాయి)

# తీరం మనదే.. వేటా మనదే.. రాజీలేదు..

భరోసా ఇచ్చారు. చేపలు మంచి పౌష్టికాహారమని, ప్రోటీన్లు అధికంగా ఉండే ఈ ఆహారానికి ప్రపంచవ్యాప్తంగా డిమాండ్ ఉందని, ఈ అవకాశాన్ని మన మత్స్యకారులకు అందిస్తామని ఆయన స్పష్టం చేశారు. కేవలం వేటకే పరిమితం కాకుండా, ఆధునిక సాంకేతికతతో, కొత్త ఆదాయ మార్గాలతో మత్స్యకారుల జీవితాల్లో వెలుగులు నింపడమే తమ ప్రభుత్వ లక్ష్యమని ఆయన ఉద్ఘాటించారు. నెల్లూరు జిల్లా కావలి నియోజకవర్గం, తుమ్మలపెంట గ్రామంలో మంగళవారం నిర్వహించిన 'మత్స్యకారుల సేవలో' కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా, చేపల వేట నిషేధ కాలానికి గాను 1,30,796 మత్స్యకార కుటుంబాలకు, ఒక్కొక్కరికి రూ. 20,000 చొప్పున మొత్తం రూ. 261.50 కోట్ల ఆర్థిక సాయాన్ని బటన్ నొక్కి వారి ఖాతాల్లోకి జమ చేశారు. సీఎం ప్రసంగిస్తుండగానే లబ్ధిదారుల ఫోన్లకు డబ్బులు జమ అయినట్లు సందేశాలు రావడంతో వారు హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు.

**మత్స్యకారుల హక్కులు, వనరులపై పూర్తి అధికారం**

"ఈ తీరం మనది, ఈ బోటు మనదే, ఇక్కడి సంపద కూడా మనదే. ఈ విషయంలో ఎలాంటి రాజీ లేదు," అని ముఖ్యమంత్రి చంద్రబాబు గట్టిగా చెప్పారు. మన సముద్ర జలాల్లోకి పొరుగు రాష్ట్రాల బోట్లు వస్తే సహించేది లేదని, తీరప్రాంతంలో గస్తీ పెంచి మత్స్యకారుల హక్కులను కాపాడతామని హామీ ఇచ్చారు. రాష్ట్రంలోని రిజర్వాయర్లు, చెరువులు నిండుగా ఉన్నాయని, ఆ నీటి వనరుల్లో చేపల పెంపకం చేసుకునే హక్కును మత్స్యకారులకే కట్టబెట్టామని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఫిష్ సీడ్ అందించాలని మత్స్యశాఖను ఆదేశించినట్లు వెల్లడించారు. మత్స్యకారుల వేటను సులభతరం చేసేందుకు, 60 శాతం సబ్సిడీతో 200 కొత్త మెకనైజ్డ్ బోట్లను మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు.

**మహిళల ఆర్థిక స్వావలంబనకు సీవీడ్ సాగు**

మత్స్యకార పురుషులతో పాటు, మహిళల ఆర్థిక సాధికారతకు కూడా ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ముఖ్యమంత్రి అన్నారు. మత్స్యకార, డ్వాక్రా సంఘాల మహిళలకు అదనపు ఆదాయం కల్పించే లక్ష్యంతో 'సీవీడ్' (సముద్రపు నాచు) సాగును ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వ సంస్థ సీఎస్ఎంసీఆర్ఐ సహకారంతో మహిళలకు సీవీడ్ సాగులో శిక్షణ ఇచ్చే కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. దీని ద్వారా వారి జీవితాల్లో కొత్త వెలుగులు నింపుతామని ఆయన హామీ ఇచ్చారు. సభా వేదిక వద్ద ఏర్పాటు చేసిన సీవీడ్, తీరప్రాంత నిఘా కేంద్రం స్టాళ్లను ఆయన సందర్శించి, అధికారుల పనితీరును అభినందించారు.

**అభివృద్ధి కార్యక్రమాలు, మౌలిక వసతుల కల్పన**

తీరప్రాంత అభివృద్ధిలో మత్స్యకారులను భాగస్వాములను చేస్తామని చంద్రబాబు స్పష్టం చేశారు. రూ. 288 కోట్లతో జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ నిర్మాణం చేపడుతున్నామని, దీని ద్వారా మత్స్యకారులను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని తెలిపారు. ఈ ప్రాంతంలోని 25 మత్స్యకార గ్రామాలను కలుపుతూ మెటల్ రోడ్లు నిర్మిస్తామని, నార్త్ బకింగ్‌హామ్ కెనాల్ పూడికతీతకు రూ. 6.19 కోట్లు మంజూరు చేస్తున్నామని ప్రకటించారు. కావలి ప్రాంతంలో సాగర్ డిఫెన్స్ సంస్థ ఏర్పాటుతో స్థానికులకే ఉపాధి అవకాశాలు లభిస్తాయని చెప్పారు. తుమ్మలపెంట గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతామని హామీ ఇచ్చారు.

**విధ్వంసం నుంచి వికాసం వైపు రాష్ట్రం**

గత ఐదేళ్ల పాలనలో రాష్ట్రం అన్ని రంగాల్లో విధ్వంసానికి గురైందని, మత్స్య రంగం కూడా తీవ్రంగా దెబ్బతిందని చంద్రబాబు ఆరోపించారు. "గొడ్డలి పార్టీ ఫేక్ ప్రచారాలు చేస్తోంది. బాబాయ్ హత్య నుంచి కుట్రల వరకు వారిది విధ్వంసమే. ఆ విధ్వంసాన్ని సరిదిద్దడానికి మాకు 23 నెలలు పట్టింది. ఇప్పుడు రాష్ట్రం బుల్లెట్ స్పీడ్‌తో అభివృద్ధి పథంలో దూసుకెళ్తోంది" అని అన్నారు. రూ. 23 లక్షల కోట్ల పెట్టుబడులతో 24 లక్షల ఉద్యోగాలు సృష్టిస్తున్నామని, రాయలసీమలో డిఫెన్స్, ఏరోస్పేస్ పరిశ్రమలు, తిరుపతి వద్ద రాయల్ ఎన్‌ఫీల్డ్ ప్లాంట్ వస్తున్నాయని వివరించారు.

**బీసీల సంక్షేమమే టీడీపీ డీఎన్ఏ**

టీడీపీ డీఎన్ఏలోనే బీసీలు ఉన్నారని, వారికి దశాబ్దాల అనుబంధం ఉందని ముఖ్యమంత్రి గుర్తుచేశారు. బీసీలకు తమ ప్రభుత్వం అండగా ఉంటుందని, వారి రుణం తీర్చుకుంటామని చెప్పారు. చేనేతలకు, నాయీ బ్రాహ్మణులకు, వడ్డెర్లకు, గీత కార్మికులకు అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరిస్తూ, వారి జీవన ప్రమాణాలు పెంచడమే తమ లక్ష్యమని పునరుద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు ఆనం రామనారాయణ రెడ్డి, అచ్చెన్నాయుడు, ఫరూఖ్, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్యే కావ్యా కృష్ణారెడ్డి, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

## అక్కడే భోజనం చేసి..

చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే, శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కావలి నియోజకవర్గ పర్యటనలో భాగంగా సీఎం చంద్రబాబు తుమ్మలపెంట గ్రామానికి వెళ్లారు. అక్కడ 'మత్స్యకారుల సేవలో' కార్యక్రమంలో పాల్గొన్న అనంతరం స్థానిక చేపల మార్కెట్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా మత్స్యకారులతో మాట్లాడి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అక్కడి మహిళా వ్యాపారుల నుంచి చేపలు కొనుగోలు చేశారు. అనంతరం, మార్కెట్‌లో పరిచయమైన మత్స్యకారుడు తానంగారి బాబు ఆహ్వానం మేరకు సీఎం ఆయన ఇంటికి వెళ్లారు. తాను తెచ్చిన చేపలను వండమని తానంగారి బాబు భార్య వెంకమ్మకు ఇచ్చారు. ఆమె చేపల పులుసు వండుతుండగా, చంద్రబాబు అక్కడే ఉండి ఆసక్తిగా గమనించారు. కొద్దిసేపు ఆయన కూడా గరిటె తిప్పారు. వంట పూర్తయ్యాక, సీఎం చంద్రబాబు వారి కుటుంబ సభ్యులతో కలిసి కిందనే కూర్చుని భోజనం చేశారు. తన చేతులతో వారికి చేపల పులుసు వడ్డించడం విశేషం. తమ ఇంటికి వచ్చి, తమతో కలిసి భోజనం చేసిన ముఖ్యమంత్రికి తానంగారి బాబు కుటుంబం కృతజ్ఞతలు తెలిపింది.

**స్విచ్‌లు నొక్కడం తప్ప**

# జగన్ చేసిందేమీ లేదు

ఎంపీలకు కూడా అపాయింట్‌మెంట్ ఇవ్వని పరిస్థితి నాడు ఉందని మండిపడ్డారు. విజయవాడలో మీడియాతో మాట్లాడుతూ ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు. తండ్రి ఆశయాల పేరిట ఓట్లు వేయించుకుని, అధికారంలోకి వచ్చాక ఆ ఆశయాలనే జగన్ నాశనం చేశారని దుయ్యబట్టారు. గత ప్రభుత్వంలో ప్రజలపై భారాలు మోపిన వైసీపీ నేతలు, ఇప్పుడు ధర్నాలు చేయడం సిగ్గుచేటన్నారు. జగన్ సీఎం అయ్యాక కూడా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి తల ఊపుతూ, అక్రమ పొత్తు పెట్టుకున్నారని షర్మిల తీవ్ర విమర్శలు గుప్పించారు.

# ఆ శునకాల కారుణ్య మరణానికి అనుమతి

సంతానోత్పత్తిని నియంత్రించేందుకు, ప్రజలకు భద్రత కల్పించడంపైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు పలు ఆదేశాలు జారీ చేసింది. రేబిస్ సోకిన, విపరీత ప్రవర్తన కలిగిన కుక్కలకు కారుణ్య మరణం కల్పించేందుకు సుప్రీం అనుమతించింది. పిటిషన్లను తిరస్కరిస్తూ స్పందించిన సుప్రీం ధర్మాసనం.. అవి ప్రజలపై ముఖ్యంగా చిన్నారులపై చేసిన దాడి ఘటనలను విస్మరించలేమని పేర్కొంది. గతంలో ఇచ్చిన ఆదేశాలను పాటించడంలో విఫలమైనందుకు రాష్ట్రాలపై ఆగ్రహం వ్యక్తంచేసింది. కాగా.. దేశంలో కుక్క కాటు ఘటనలు ఆందోళనకర రీతిలో పెరిగిపోతున్న నేపథ్యంలో ప్రజల భద్రత, ఆరోగ్యం దృష్ట్యా సర్వోన్నత న్యాయస్థానం గత ఏడాది కీలక ఆదేశాలు జారీ చేసింది. జనసమ్మర్ద బహిరంగ ప్రదేశాల్లో వీధి శునకాలు సంచరించకుండా చేయాలని స్పష్టం చేసింది. ఆయా సంస్థల ప్రాంగణాల్లోకి అవి చొరబడకుండా కంచెలు నిర్మించాలని తెలిపింది. నిరంతర తనిఖీలు చేపట్టి సమస్య తలెత్తకుండా జాగ్రత్త వహించాలని సూచించింది. ఏ కారణం చేతనైనా మళ్లీ వాటిని పట్టుకొన్నచోటే వదిలివేయొద్దని స్పష్టంగా చెప్పింది. ఈ ఆదేశాల అమలు కోసం ప్రభుత్వాలకు గడువు కూడా ఇచ్చింది.

# విశాఖలో వైరల్ అవుతున్న గోల్డ్ కలర్ కారు

వ్యాపారం ఉందని, అందుకే కారుకు బంగారపు రంగు వేయించినట్లు చెప్పారు. ఈ కారు తెలుగు రంగులో వచ్చిందని, కానీ విశాఖలోనే బంగారపు రంగును వేయించానని చెప్పారు. దీని కోసం రూ.1 లక్ష ఖర్చయిందని, పూర్తవడానికి నెల రోజులు పట్టిందని వెల్లడించారు. బంగారపు రంగు వేయడానికి ప్రత్యేకంగా కారణమేమీ లేదని, సరదాగా వేయించానని అన్నారు. దీనికి ఐదేళ్లు గ్యారెంటీ ఇచ్చినట్లు చెప్పారు.

# తీవ్ర ఆర్థిక సంక్షోభం రాబోతోంది

రాబోతోందన్నారు. అదానీ, అంబానీ వంటి వారిపై ఇది ఎటువంటి ప్రభావం చూపదని.. దేశ యువత, రైతులు, చిన్న వ్యాపారులపై తీవ్ర ప్రభావం చూపిస్తుందన్నారు. రెండు రోజుల పర్యటనలో భాగంగా తన సొంత నియోజకవర్గం రాయ్‌బరేలీకి చేరుకున్న రాహుల్.. అక్కడ మీడియాతో మాట్లాడారు. పొదుపు చర్యలకు పిలుపునిచ్చిన ప్రధాని మోదీ వాటిని పాటించడం లేదని విమర్శించారు. విదేశాలకు వెళ్లవద్దని చెబుతూ.. ప్రపంచ పర్యటనలు చేస్తున్నారన్నారు.

# ఎప్పుడైనా కూలిపోవచ్చు

కూలిపోవచ్చని, ముందస్తు ఎన్నికలకు సిద్ధం కావాలని డీఎంకే పార్టీ నేతలకు పిలుపునిచ్చారు. పార్టీ జిల్లా కార్యదర్శుల సమావేశంలో మాట్లాడుతూ స్టాలిన్ ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ ఓటమి తాత్కాలికమేనని తెలిపారు. ప్రస్తుత ప్రభుత్వం ఎప్పుడైనా కూలిపోవచ్చని అన్నారు. 2029 లోక్‌సభ ఎన్నికలతో పాటు ముందస్తు అసెంబ్లీ ఎన్నికలకు సిద్ధంగా ఉండాలని పార్టీ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఆ ఎన్నికల్లో డీఎంకే కచ్చితంగా విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తంచేశారు. తమిళనాడులో సూర్యుడు (డీఎంకే గుర్తు) ఎప్పటికీ అస్తమించడు అని అన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమికి స్టాలిన్ బాధ్యత వహించారు. ఓటమికి గల కారణాలు విశ్లేషించి, ప్రజల నుంచి ప్రత్యక్ష అభిప్రాయాన్ని సేకరించేందుకు 36 మంది సభ్యులతో కూడిన ఓ కమిటీని ఏర్పాటు చేశారు.

**ఉక్రెయిన్ ఆక్రమణపై పుతిన్ తర్వాత**

# పశ్చాత్తాప పడొచ్చు : జిన్‌పింగ్

పర్యటన కోసం నేడు చైనా రాజధాని బీజింగ్‌కు చేరుకున్నారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చైనా పర్యటన ముగించుకుని వెళ్లిన కొద్ది రోజుల వ్యవధిలోనే పుతిన్ బీజింగ్‌కు వెళ్లడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ పర్యటనలో భాగంగా ఇరుదేశాల అధినేతలు ద్వైపాక్షిక సంబంధాలు, అంతర్జాతీయ సమస్యలపై చర్చలు జరపనున్నట్లు తెలుస్తోంది.

# శాంతి జ్యుడీషియల్ రిమాండ్ పొడిగింపు

ఏకీభవించిన న్యాయస్థానం ఆమె బెయిల్‌ను తిరస్కరించింది. గతంలో జరిగిన ఏసీబీ దాడుల్లో, నిబంధనలకు విరుద్ధంగా సంపాదించిన కోట్లాది రూపాయల విలువైన బినామీ ఆస్తులు, భూముల పత్రాలు, నగదును స్వాధీనం చేసుకున్న సంగతి తెలిసిందే. తాజా రిమాండ్ పొడిగింపుతో ఆమె జైలులోనే మరికొన్ని రోజులు గడపక తప్పడం లేదు. ప్రస్తుతం ఆమె విజయవాడ జిల్లా జైల్లో ఉన్నారు.

# 'నీట్'పై ధర్మేంద్ర ప్రధాన్ ఉన్నతస్థాయి సమీక్ష

పారదర్శకత అవసరాన్ని గుర్తుచేశారు. గత పరీక్షల్లో గుర్తించిన లోపాలను పరిష్కరించాలన్నారు. నీట్ పరీక్షపై కలెక్టర్లు, ఎస్పీలతో సమన్వయ సమావేశాలు జరపాలని ఆదేశించారు. పరీక్షా కేంద్రాల వద్ద అప్రమత్తత, భద్రతపై రాజీపడొద్దన్నారు. నీట్ ప్రశ్నపత్రం లీక్‌పై సీబీఐ విచారణ జరుగుతోందని..ఈ కేసుతో సంబంధం ఉన్న పలువురిని ఇప్పటికే పోలీసులు అరెస్ట్ చేశారని కేంద్రమంత్రి పేర్కొన్నారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. విద్యార్థులు నష్టపోకూడదనే పరీక్ష రద్దు చేసి మళ్లీ నిర్వహిస్తున్నామన్నారు. విద్యార్థుల భవిష్యత్తు బాగుండేలా చూడటమే మొదటి లక్ష్యమన్నారు. 2026 నీట్ పేపర్ లీక్ కావడంతో మే 3న నిర్వహించిన పరీక్షను రద్దు చేసి, మళ్లీ జూన్ 21న ఈ పరీక్షను నిర్వహించనున్నట్లు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ఇటీవల వెల్లడించిన విషయం తెలిసిందే.

**ఏడాది వ్యవధిలో రెండోసారి..**

# భారత్‌కు రానున్న పుతిన్

డిసెంబరులో ఆయన మనదేశానికి వచ్చిన సంగతి తెలిసిందే. రెండుదేశాల సంబంధాల బలోపేతంపై ప్రధాని నరేంద్రమోదీతో చర్చలు జరిపారు. 2026 ఏడాదికి బ్రిక్స్ ఛైర్మన్‌గా భారత్ వ్యవహరిస్తోంది. దీనిలో భాగంగా ఇటీవల జరిగిన బ్రిక్స్ విదేశాంగ మంత్రుల సమావేశానికి రష్యా విదేశాంగమంత్రి సెర్గీ లావ్రోవ్ హాజరైన సంగతి తెలిసిందే. ఆ సందర్భంగా మోదీతో భేటీ అయ్యారు. పశ్చిమాసియా ఉద్రిక్తతలు, రష్యా-ఉక్రెయిన్ యుద్ధం సహా పలు అంశాలపై చర్చలు జరిపారు. మొదట బ్రెజిల్, రష్యా, ఇండియా, చైనాలతో 'బ్రిక్' ఏర్పడింది. అనంతరం దక్షిణాఫ్రికా చేరడంతో బ్రిక్స్‌గా మారింది. ఇప్పుడు ఇరాన్, ఇథియోపియా, ఈజిప్ట్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, ఇండోనేసియా కూడా చేరాయి. ఈ పది దేశాలను కలిపి బ్రిక్స్ ప్లస్‌గా వ్యవహరిస్తున్నారు. సౌదీ అరేబియా, అర్జెంటీనాలు ఇంకా లాంఛనంగా బ్రిక్స్‌లో చేరలేదు. బ్రెజిల్‌లోని రియో డి జనీరో నగరంలో గతేడాది బ్రిక్స్ సదస్సు జరిగింది. కాగా.. పుతిన్ ప్రస్తుతం చైనా పర్యటనలో ఉన్నారు.

# పాస్టర్ కథ అంతా డ్రామా..

పోలీసులు విచారణ చేపట్టగా, విస్తుగొలిపే విషయాలు వెల్లడయ్యాయి. ఇటీవల చింతపల్లి పరిసర ప్రాంతాల్లో తన కారుపై గుర్తుతెలియని దుండగులు దాడి చేశారని, తృటిలో తాను ప్రాణాపాయం నుంచి తప్పించుకున్నానని అభినయ్ దర్శన్ చేసిన ప్రచారం అంతా నాటకమేనని పోలీసులు తేల్చారు. తనను చంపేందుకు ప్రయత్నించారని అతను నమ్మించే ప్రయత్నం చేశాడు. ఈ ఘటన జిల్లా వ్యాప్తంగా కలకలం రేపింది. అల్లూరి జిల్లా ఎస్పీ అమిత్ బర్దర్ క్షేత్రస్థాయిలో లోతుగా దర్యాప్తు చేపట్టారు. విచారణలో అసలు అభినయ్ దర్శన్‌పై దాడి జరగలేదని తేలింది. ఈ నాటకంలో అతడికి మరో ఆరుగురు సహకరించినట్లు పోలీసులు గుర్తించారు. అభినయ్ దర్శన్‌కు సంబంధించిన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాకు సంబంధించిన ఆడియోలు, వీడియో చాట్‌లు, కీలకమైన వైద్యుల నివేదికను పోలీసులు పరిశీలించారు. ఇదంతా ఫేక్ అటాక్ అని తేల్చారు. దాడి జరిగిందంటూ హైడ్రామా సృష్టించిన అభినయ్ దర్శన్, ఇతరులపై పోలీసులు చర్యలు తీసుకోనున్నారు.

# పవన్ కల్యాణ్‌పై నిహారిక ఆసక్తికర వ్యాఖ్యలు




**విశ్వం వాయిస్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్‌పై మెగా డాటర్ కొణిదెల నిహారిక ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఈ మేరకు ఆమె ఓ వీడియోను విడుదల చేశారు. పిఠాపురం నియోజకవర్గం ప్రజలను ఆయన తన సొంత కుటుంబంలా చూసుకుంటున్నారని అన్నారు. పిఠాపురం వెళితే తనకు తన సొంతూరుకు వెళ్ళినట్లుగా అనిపిస్తుందని అన్నారు. తన నియోజకవర్గంలో ప్రమాదవశాత్తు ఒక ఎలక్ట్రిషియన్ విద్యుదాఘాతంతో చనిపోతే నియోజకవర్గంలోని ఎలక్ట్రిషియన్లందరికీ పవన్ కల్యాణ్ సేఫ్టీ కిట్లు అందజేశారని తెలిపారు. మొత్తం 325 మందికి భద్రతా కిట్లను అందజేసినట్లు వెల్లడించారు. ప్రజా సమస్యల పట్ల సకాలంలో స్పందించడంలో ఆయనకు ఎవరూ సాటిరారని అన్నారు.

**ప్రభుత్వం నిర్ణయించిన టార్గెట్‌ను పూర్తి చేసుకుని**

# కాన్వెంట్ విద్యార్థులను ఆకర్షించే దిశగా ప్రయాణం



**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి ఫలించిన ప్రధానోపాధ్యాయుడు వినూత్న కృషి మండలంలో అత్యధిక ఒకటో తరగతి విద్యార్థులను చేర్చుకున్న పాఠశాలగా గుర్తింపు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం.ర్యాలి, ర్యాలి ఫౌండేషన్ పాఠశాలలో విద్యార్థుల చేరికలను పెంచేందుకు ప్రధానోపాధ్యాయుడు చింతా శ్యామ్ కుమార్ వినూత్న కృషి ఫలించి మండలంలో అత్యధిక ఒకటవ తరగతి విద్యార్థులను చేర్చుకున్న పాఠశాలగా ముందంజలో ఉంది. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న "బడి పిలుస్తుంది" కార్యక్రమంలో భాగంగా బడి ఈడు పిల్లలందరినీ పాఠశాలలో చేర్పించాలనే లక్ష్యంతో ప్రధానోపాధ్యాయుడు తన సొంత కారులో మైక్ ఏర్పాటు చేసుకుని గ్రామాల్లో ప్రచారం నిర్వహిస్తూ ప్రభుత్వ పాఠశాలల్లో కల్పిస్తున్న సౌకర్యాలు, నాణ్యమైన విద్య, మెరుగైన ఫలితాల గురించి ప్రజలకు వివరించారు. అంతేకాకుండా ఇంటింటికి వెళ్లి తల్లిదండ్రులను వ్యక్తిగతంగా కలిసి ప్రభుత్వ పాఠశాలల ప్రాధాన్యతను తెలియజేశారు.సొంత ఖర్చులతో ప్రభుత్వ పాఠశాల వసతులు, విద్యార్థుల విజయాలు, పాఠశాల ఫలితాలపై ఆరు ప్రత్యేక గీతాలను రూపొందించి గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం నిర్వహించడం విశేషం. ఈ ప్రచారం ప్రజల్లో మంచి స్పందన తెచ్చి తల్లిదండ్రుల్లో ప్రభుత్వ పాఠశాలలపై విశ్వాసాన్ని పెంచింది.గత విద్యా సంవత్సరంలో విద్యార్థులకు వినూత్న విద్యాభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించి కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా తీర్చిదిద్దారు. "విద్యా బ్యాంక్" కార్యక్రమం ద్వారా విద్యార్థులకు నోట్‌బుక్స్, స్టేషనరీ సామగ్రిని ఉచితంగా పంపిణీ చేశారు. అదేవిధంగా కార్పొరేట్ పాఠశాలల తరహాలో గ్రాడ్యుయేషన్ వేడుకలను నిర్వహించి



విద్యార్థులు, తల్లిదండ్రులను ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమాల ఫలితంగా మండలంలో 8 మంది అత్యధిక ఒకటో తరగతి విద్యార్థులు చేరిన పాఠశాలగా గుర్తింపు పొందింది. విద్యార్థుల చేరికలు పెరగడంతో పాటు ప్రభుత్వ పాఠశాలపై ప్రజల్లో విశ్వాసం మరింత బలపడింది.ఈ కార్యక్రమాలు విద్యాశాఖ అధికారుల పూర్తి సహకారంతో విజయవంతంగా నిర్వహించడం జరిగింది శ్యామ్ తెలియజేశారు. పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తున్న శ్యామ్ ను గ్రామ ప్రజలు, తల్లిదండ్రులు అభినందిస్తున్నారు.

**కొత్తపేటలో స్వచ్ఛందంగా**

# స్వర్ణకారుల బంద్ నిర్వహణ

**తహసిల్దార్, పోలీసులకు వినతిపత్రాల అందజేత**






**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** బంగారం ధరల పెరుగుదలతో దెబ్బతిన్న జీవనోపాధి స్వర్ణకారుల తీవ్ర ఆవేదన డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా స్వర్ణకార సంఘం పిలుపులో భాగంగా కొత్తపేటలో స్వర్ణకారులు మంగళవారం భారీ బంద్ నిర్వహించారు. తమ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని, ప్రత్యేక నిధులు కేటాయించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేతివృత్తుల వారిని ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ ఈ కార్యక్రమం చేపట్టారు. 'శ్రీ కామాక్షి స్వర్ణకార సంఘం - కొత్తపేట' ఆధ్వర్యంలో జరిగిన ఈ బంద్‌కు స్థానిక స్వర్ణకారులు, వ్యాపారులు భారీగా స్పందించి,తమ దుకాణాలను స్వచ్ఛందంగా మూసివేసి నిరసన తెలిపారు.

**కుటుంబ పోషణ భారంగా మారింది: స్వర్ణకార సంఘం నేతలు**

ఈ సందర్భంగా సంఘ ప్రతినిధులు మరియు చేతివృత్తుల వారు మాట్లాడుతూ మార్కెట్‌లో ఇప్పటికే బంగారం ధరలు విపరీతంగా పెరిగిపోవడంతో వ్యాపారాలు పూర్తిగా మందగించాయని, దీనికి తోడు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ బంగారం, వెండి కొనుగోళ్లపై చేసిన వ్యాఖ్యల ప్రభావం తమ వృత్తిపై తీవ్రంగా పడిందని ఆవేదన వ్యక్తం చేశారు.గతంలో ఎన్నడూ లేని విధంగా ఉపాధి కోల్పోయి, కుటుంబ పోషణ కూడా కష్టంగా మారిన పరిస్థితులు నెలకొన్నాయన్నారు.ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి ప్రత్యేక నిధులు, ప్యాకేజీలు ప్రకటించి తమకు అండగా నిలవాలని డిమాండ్ చేశారు.స్వర్ణకారుల హక్కుల సాధన కోసం, వృత్తి మనుగడ కోసం అంతా ఏకమై సంఘటితంగా ముందుకు సాగాలని నాయకులు పిలుపునిచ్చారు. అనంతరం తమ ప్రధాన డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని స్థానిక తహసిల్దార్ కార్యాలయంలోనూ, అలాగే కొత్తపేట పోలీస్ స్టేషన్‌లోనూ అధికారులకు అందజేశారు.ఈ నిరసన కార్యక్రమంలో స్వర్ణకార సంఘం అధ్యక్షులు సుబ్రహ్మణ్యం గారితో పాటు ప్రముఖ నాయకులు వీర మల్ల జేజి, రామోజీ నాగేశ్వరావు, కాకరపర్తి శ్రీనివాసు, పొడగట్లపల్లి బ్రహ్మాజీ, తామరపల్లి బ్రహ్మానందం, దుద్దిపూడి సత్తిబాబు, కరప మణికంత, కాకరపర్తి సుందరం, తామరపల్లి ప్రసాద్ మరియు సంఘ సభ్యులు, స్వర్ణకార కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఎడిటర్ వాయిస్

## విశాఖ తూర్పులో టీడీపీ మార్క్ మార్పు?

విశాఖ తూర్పు నియోజకవర్గం 2009లో ఏర్పాటు అయిన దగ్గర నుంచి వరసబెట్టి టీడీపీ గెలుస్తూ వస్తోంది. ఇప్పటికి నాలుగు సార్లు ఎన్నికలు జరిగితే అన్ని సార్లూ టీడీపీ తరపున గెలిచిన ఏకైక ఎమ్మెల్యేగా వెలగపూడి రామక్రిష్ణబాబు ఉన్నారు. ఆయన ఈసారితో ఏకంగా 20 ఏళ్ళ పాటు ఎమ్మెల్యేగా నియోజకవర్గాన్ని పాలించిన నేతగా రికార్డు క్రియేట్ చేస్తున్నారు. విశాఖ జిల్లా ఏర్పడిన తరువాత స్వాతంత్ర్యం వచ్చి ఇన్నేళ్ళ పాటు ఎన్నికలు జరిగాక వరుసగా నాలుగు సార్లు ఎమ్మెల్యేగా గెలిచిన అతి కొద్ది మంది నేతలలో ఆయన కూడా ఒకరుగా ఉన్నారు. అయితే ఆయనకు సామాజిక సమీకరణల కారణంగా మంత్రి పదవి అయితే దక్కలేదు. మరో వైపు చూస్తే ఆయన తన వారసుడిని వచ్చే ఎన్నికల్లో పోటీ చేయడానికి సిద్ధంగా ఉంచారు.

**ఓపిక తగ్గిందా :** ఇదిలా ఉంటే ఈ మధ్య జరిగిన జిల్లా పార్టీ ఎమ్మెల్యేల సమీక్షా సమావేశంలో అధినేత చంద్రబాబు తూర్పు నియోజకవర్గాన్ని ఉద్దేశించి కొన్ని కీలకమైన కామెంట్స్ చేశారు. అవి ఇపుడు పార్టీలోనూ రాజకీయంగానూ చర్చగా ఉన్నాయని అంటున్నారు. వెలగపూడికి ఓపిక తగ్గింది అంటూ అధినాయకత్వం కామెంట్స్ చేసింది అని ప్రచారం సాగుతోంది. దాంతో పాటుగా తూర్పులో బలంగా ఉన్న సామాజిక వర్గం యాదవులను కూడా కలుపుకుని పోవాలని సూచించినట్లుగా తెలుస్తోంది. దాంతో తూర్పు మీద హైకమాండ్ ఫుల్ ఫోకస్ పెట్టిందని అర్ధం అవుతోంది అని అంటున్నారు.

**ఆయనకు చోటు :** ఈ మధ్య టీడీపీ రాష్ట్ర జాతీయ కమిటీల నియామకంలో తూర్పు నియోజకవర్గం నుంచి వీఎంఆర్డీఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్ కి కీలక పదవి దక్కింది. అక్కడ ఎమ్మెల్యేగా ఉన్న సీనియర్ నేత వెలగపూడికి అయితే ఏ పదవీ ఇవ్వలేదు. ఆయన వారసుడు కుమారుడు అయిన యువ నేతకు కూడా స్థానం కల్పించలేదు. దాంతో తూర్పు లో మార్పు ఖాయమా అన్న చర్చ పెద్ద ఎత్తున సాగుతోంది. ఇక ప్రణవ్ గోపాల్ అయితే మంత్రి నారా లోకేష్ టీం లో ఉన్నారని అంటున్నారు. అందుకే ఆయనకు ఎంతో ప్రతిష్టాత్మకమైన వీఎంఆర్డీఏ చైర్మన్ పదవిని కట్టబెట్టడమే కాకుండా మరోసారి కూడా పొడిగించి కొనసాగిస్తున్నారు అని గుర్తు చేస్తున్నారు. ఇపుడు పార్టీలో కూడా కీలకం చేస్తున్నారు అంటే వచ్చే ఎన్నికల్లో తూర్పు అసెంబ్లీ నుంచి ఆయనని పోటీ చేయిస్తారా అన్న చర్చ సాగుతోంది.

**బీసీల పట్టు :** మరో వైపు తూర్పులో అత్యధిక శాతం బీసీలు ఉన్నారు. వారంతా తమకు ఎమ్మెల్యే సీటు కేటాయించాలని కోరుతున్నారు. యాదవ సామాజిక వర్గం అయితే గాజువాకతో పాటు తూర్పు కూడా ఇవ్వాలని అపుడే సమ న్యాయం అవుతుందని వాదిస్తోంది. దాంతోనే యాదవులను కూడా కలుపుకుని పోవాలని హైకమాండ్ సూచించినట్లుగా వార్తలు వస్తున్నాయి. ఒకవేళ సామాజిక సమీకరణలను పరిగణనలోకి తీసుకుంటే యాదవుల నుంచి కూడా సమర్ధులైన నాయకులు టీడీపీకి ఉన్నారని గుర్తు చేస్తున్నారు.



మొత్తం మీద చూస్తే 2029 లో సీట్లు కనుక పెరగకపోతే మాత్రం టీడీపీలో భారీ మార్పు ఉంటుందని అంటున్నారు. సిట్టింగ్ ఎమ్మెల్యేగా ఉన్న వెలగపూడి హవా సాగుతున్నప్పటికీ పార్టీదే అంతిమ నిర్ణయం కాబట్టి ఏమి జరుగుతుందో చూడాల్సి ఉందని అంటున్నారు.

ఎడిటర్ : కె.సునీల్‌కుమార్




## ఈ ప్రేమకథ నిండా వెన్నుపోట్లే..

### ఇద్దరు ప్రియులతో కలిసి రెండో భర్తను చంపి..

**విశ్వం వాయిస్ న్యూస్ :** సమాజం నివ్వెరపోయే ప్రేమకథ ఒకటి గుజరాత్‌లో వెలుగు చూసింది. ఆ కథ నిండా వెన్నుపోట్లే కనిపిస్తాయి. అనుమానాస్పద మృతిగా మొదలైన ఓ కేసు తీగ లాగితే.. ఈ నేరకథా చిత్రం మొత్తం బయటపడింది. పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం.. గుజరాత్‌కు చెందిన జాగృతికి కొన్నేళ్ల క్రితం సుఖ్‌దేవ్‌గిరితో వివాహం జరిగింది. వారికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. కానీ కొంతకాలానికి సుఖ్‌దేవ్‌గిరి సోదరుడు శాంతిగిరి గోస్వామితో ప్రేమలో పడిన ఆమె.. భర్త, పిల్లలను వదిలేసి మరో గ్రామానికి వెళ్లిపోయింది. అక్కడే శాంతిగిరిని రెండో పెళ్లి చేసుకుంది. అక్కడితో ఆమె మోసం ఆగలేదు. ట్రక్కు డ్రైవర్ అయిన రెండో భర్త ఇంట్లో లేని సమయంలో కాంతిలాల్ అలియాస్ భరత్ సబారియా అనే వ్యక్తితో వివాహేతర సంబంధం కొనసాగించింది. జాగృతి ఇంటిపక్కనే కాంతిలాల్ గది అద్దెకు తీసుకున్నాడు. వీరి బంధానికి రెండో భర్త అడ్డుగా ఉండటంతో.. ప్రియుడితో కలిసి శాంతిగిరిని చంపేందుకు ప్లాన్ వేసింది. ఇందుకోసం యూనస్ అనే వ్యక్తికి రూ.25వేలు సుపారీ ఇచ్చింది. శాంతిగిరిని చంపేందుకు అతడి ఇంటికి వెళ్లిన యూనస్.. భయపడి అతడు నిద్రపోతున్న ఫొటో తీసి పంపి, హత్య చేశానంటూ జాగృతితో నమ్మబలికాడు. ఆ డబ్బులు తీసుకొని జారుకున్నాడు. తెల్లారి చూసేసరికి శాంతిగిరి బతికే ఉండటంతో ఆమె అవాక్కైంది. దీంతో మోసపోయానని గ్రహించిన జాగృతి, ప్రియుడు కాంతిలాల్‌తో కలిసి రెండో భర్తను ఊపిరాడకుండా చేసి హత్య చేసింది. అనంతరం దాన్నొక ప్రమాదంగా చిత్రీకరించేందుకు దీపక్ అనే మరో వ్యక్తి సాయం తీసుకుంది. దీపక్‌తో కూడా ఈ మహిళ ప్రేమాయణం నడిపినట్లు పోలీసులు వెల్లడించారు. అతడు తీసుకొచ్చిన కారులో ముగ్గురూ వెళ్లి.. శాంతిగిరి మృతదేహాన్ని సురేంద్రనగర్ సమీపంలోని కాలువలో పడేశారు. తన భర్త గురించి చుట్టుపక్కలవారు అడిగితే.. కొత్త ఉద్యోగంలో చేరాడని, నంబర్ కూడా మార్చాడని జాగృతి చెప్తూ వచ్చింది. మరోవైపు గతేడాది అక్టోబరులో శాంతిగిరి మృతదేహాన్ని కాలువలో గుర్తించిన పోలీసులు.. తొలుత అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. ఆ తర్వాత లోతుగా దర్యాప్తు చేపట్టగా.. ఈ నేర కుట్ర గురించి తెలిసింది. దీంతో జాగృతి, కాంతిలాల్‌ను అరెస్ట్ చేసి విచారించగా.. హత్య బాగోతం బయటపడింది.

## ఏసీబీ అదుపులో జలమండలి జీఎం కుమార్



**హైదరాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో జలమండలి జీఎం కుమార్‌ను ఏసీబీ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. ఆయనకు సంబంధించి భారీగా ఆస్తులు గుర్తించారు. కుమార్ నివాసంతోపాటు మరో 8 చోట్ల ఏసీబీ దాడులు చేసింది. నిజామాబాద్, సంగారెడ్డి జిల్లాల్లో 18 ఎకరాల వ్యవసాయ భూములు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. హైదరాబాద్‌లో 6 ప్లాట్లు, 3 ఫ్లాట్లు, ఓ ఇంటి పత్రాలు, రూ.1.10 కోట్ల నగదును స్వాధీనం చేసుకున్నారు. కుమార్ నివాసంలో 2.1 కిలోల బంగారం, 9.2 కిలోల వెండి వస్తువులు గుర్తించారు. ఓ కారు, బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. మొత్తం ఆస్తుల విలువ దాదాపు రూ.5.88 కోట్లుగా అధికారులు అంచనా వేస్తున్నారు. మార్కెట్ విలువ మరింత ఎక్కువగా ఉండే అవకాశముంది. కుమార్‌పై అవినీతి నిరోధక చట్టం కింద కేసు నమోదు చేసిన ఏసీబీ.. అదనపు ఆస్తులపై విచారణ కొనసాగుతోందని తెలిపింది.

## వివాహితను వంచించిన ఇన్‌స్పెక్టర్‌పై కేసు

### ఫిర్యాదు చేసేందుకు వచ్చిన మహిళతో సహజీవనం

**ఖమ్మం, విశ్వం వాయిస్ న్యూస్ :** భర్తతో విభేదాలను పరిష్కరించాలని వచ్చిన వివాహితను వంచించి లోబరుచుకున్న ఇన్‌స్పెక్టర్‌పై ఖమ్మం రెండో పట్టణ పోలీస్ స్టేషన్‌లో నాన్ బెయిలబుల్ కేసు నమోదైంది. ఆలస్యంగా వెలుగుచూసిన ఈ ఘటన వివరాలివి.. నగరంలోని వీడీఓస్ కాలనీకి చెందిన వివాహిత(43)కు భర్తతో విభేదాలు ఏర్పడ్డాయి. ఆమెకు ఇద్దరు కుమార్తెలున్నారు. తన సమస్య పరిష్కరించాలంటూ మూడేళ్ల క్రితం ఆమె నగరంలోని మహిళా పోలీస్ స్టేషన్‌ని సంప్రదించారు. అక్కడ ఎస్‌హెచ్‌ఓగా ఇన్‌ఛార్జి విధులు నిర్వహిస్తున్న ఇన్‌స్పెక్టర్ రాజు ఆమెను ప్రలోభాలకు గురిచేశాడు. వివాహం చేసుకుంటానని నమ్మించాడు. కొన్నాళ్లు సహజీవనం చేశాక వివాహం చేసుకునేందుకు తిరస్కరించాడు. దీనిపై బాధితురాలి ఫిర్యాదుతో మే 7న నాన్ బెయిలబుల్ కేసు నమోదు చేశారు. తనను మాయమాటలతో మోసం చేయడంతోపాటు గర్భం దాలిస్తే అబార్షన్ చేయించాడని, ఆర్థికంగానూ మోసగించాడని బాధితురాలు ఆరోపించారు. ఇన్‌స్పెక్టర్ రాజు ఇటీవల వరకు సీసీఎస్ ఠాణాలో విధులు నిర్వహించారు. ఫిర్యాదు రాగానే సెలవులో వెళ్లిపోయారు. ముందస్తు బెయిలు కోసం ప్రయత్నించినట్లు తెలుస్తోంది. ఇన్‌స్పెక్టర్ రాజుపై కేసు నమోదైన నేపథ్యంలో ఐజీ కార్యాలయానికి అటాచ్ చేసినట్లు ఖమ్మం టౌన్ ఏసీపీ రమణమూర్తి తెలిపారు.

## టిప్పర్ లారీలో మంటలు



**విశ్వం వాయిస్ న్యూస్ :** జగిత్యాల బైపాస్ రోడ్‌లో టిప్పర్ లారీలో మంటలు చెలరేగాయి. దీంతో లారీ ముందుభాగం కాలిపోయింది. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలికి చేరుకుని మంటలను ఆర్పివేశారు. షార్ట్ సర్క్యూట్ కారణంగా వాహనంలో మంటలు చెలరేగినట్లు తెలుస్తోంది.

### తిరుమలలో భవనంపై నుంచి పడి

## కార్మికుడి మృతి



**తిరుమల, విశ్వం వాయిస్ న్యూస్ :** మూడంతస్తుల భవనంపై నుంచి పడి కార్మికుడు మృతి చెందిన ఘటన తిరుమలలో చోటు చేసుకుంది. అవధూత దత్తపీఠం వద్ద వాటర్ ట్యాంక్ మరమ్మతులు చేస్తుండగా.. ప్రమాదవశాత్తూ కాలుజారి కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే తిరుపతి రుయా ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడు తమిళనాడులోని తిరుపత్తూర్ వనియంబాడికి చెందిన మణికంఠన్ (35)గా గుర్తించారు. ఘటనపై తిరుమల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## హెచ్‌సీయూలో విద్యార్థి ఆత్మహత్య

**హైదరాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ :** హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ (హెచ్‌సీయూ)లో ఓ విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడు. ఎంఏ ఫస్టియర్ చదువుతున్న విద్యార్థి చెరువులో దూకి బలవన్మరణానికి పాల్పడ్డాడు. మృతుడిని పశ్చిమ బెంగాల్ వాసిగా గుర్తించారు. ఈ విషయంపై గచ్చిబౌలి పీఎస్‌కు యూనివర్సిటీ సెక్యూరిటీ సిబ్బంది సమాచారం ఇచ్చారు. పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. ఈమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

## పట్టాలు తప్పిన ఉజ్జయిని ఎక్స్‌ప్రెస్..

### తప్పిన పెనుప్రమాదం



**విశ్వం వాయిస్ న్యూస్ :** ఉత్తరాఖండ్‌లోని రిషికేశ్‌లో యోగ్ నగరి రైల్వే స్టేషన్ సమీపంలో పెనుప్రమాదం తప్పింది. ఉజ్జయిని ఎక్స్‌ప్రెస్‌కు చెందిన మూడు బోగీలు పట్టాలు తప్పాయి. ఘటనా సమయంలో రైలులో ప్రయాణికులు ఎవరూ లేకపోవడంతో పెనుప్రమాదం తప్పింది. ప్రాథమిక సమాచారం ప్రకారం.. సోమవారం రాత్రి యోగ్ నగరి స్టేషన్‌లో మెయింటెనెన్స్ పనులు జరుగుతున్న సమయంలో ఉజ్జయిని ఎక్స్‌ప్రెస్ అకస్మాత్తుగా ముందుకు కదిలింది. రైలు వేగంగా వెళ్లి లూప్‌లైన్ చివరన గోడను బలంగా ఢీకొట్టి ఆగిపోయింది. సాంకేతిక లోపం కారణంగా బ్రేక్ ఫెయిల్ కావడమే ప్రమాదానికి కారణమని ప్రాథమిక దర్యాప్తులో తేలింది. ఈ ఘటనతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. ప్రమాదంపై రైల్వే శాఖ ఉన్నతస్థాయి విచారణకు ఆదేశించింది.

### మద్యం తాగించి..

## బీటెక్ విద్యార్థినిపై అత్యాచారం

### తోటి విద్యార్థి అరెస్టు.. ఇబ్రహీంపట్నంలో ఘటన

**ఇబ్రహీంపట్నం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఇంజినీరింగ్ చదువుతున్న విద్యార్థినిపై తోటి విద్యార్థి అత్యాచారానికి పాల్పడిన ఘటన హైదరాబాద్‌లోని ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ మహేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్‌కు చెందిన ఉడుతల ఉదయ్ రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం పరిధిలోని ఓ ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ మూడో సంవత్సరం చదువుతున్నాడు. తన క్లాస్‌మేట్ అయిన యువతితో ఈ నెల 14న రాత్రి టీ తాగడానికి కారులో దిల్‌సుఖ్‌నగర్ వెళ్లాడు. అనంతరం ఇబ్రహీంపట్నం తిరిగి వస్తూ మద్యం కొనుగోలు చేశాడు. తర్వాత బీడీఎల్ రోడ్డులో నిర్మానుష్య ప్రదేశంలోకి తీసుకెళ్లిన ఉదయ్.. విద్యార్థినికి సైతం మద్యం తాగించాడు. మత్తులో ఉన్న ఆమెను ఇబ్రహీంపట్నంలోని ఓ గదికి తీసుకెళ్లి అత్యాచారం చేశాడు. ఈ నెల 17న బాధితురాలి ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన పోలీసులు సోమవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

## 700 ఏళ్లుగా వెలుగుతూనే ఉన్న దీపం..




## ఆంజనేయస్వామి విగ్రహం లేని ఏకైక రామాలయం..

### కాకతీయుల నాటి ఈ గుడి ప్రత్యేకత మీకు తెలుసా?

ఆ గ్రామంలో ఓ పురాతన ఆయలం ఉంది. శీతారాములుకొలువై ఉన్న ఈ ఆలయంలో ఉన్న దీపం నిరంతరం వెలుగుతూనే ఉంది. దాన్ని వెలిగించి దాదాపు 700 ఏళ్లు దాటిన ఇంకా ఆ దీపం కొండెక్కలేదు.. ఆ నాటి నుంచి నేటి వరకు చెక్కుచెదరకుండా ప్రకాశిస్తూనే ఉంది. ఇంతకు ఆ ఆలయం ఎక్కడుందనేగా మీ డౌట్.. అది తెలుసుకోవాలంటే ఈ స్టోరీ చదవాల్సిందే. అది రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేటలోని శ్రీ సీతారామాలయం.. ఈ ఆలంలో స్వామి వారి ముందు ఉన్న నందా అనే దీపం సుమారు 700 ఏళ్లుగా ఆరని దివ్య జ్యోతిగా భక్తులను ఆకట్టుకుంటోంది. ఈ దీపం కేవలం ఒక వెలుగు కాదు, శతాబ్దాల విశ్వాసానికి నిలువెత్తు ప్రతీకగా అక్కడి భక్తుల నమ్మకం. ఇదే ఆ గ్రామానికి ఆధ్యాత్మిక గుర్తింపుగా నిలిచింది. వివరాల్లోకి వెళ్తే.. క్రీస్తు పూర్వం.. 1,314వ సంవత్సంలో కాకతీయుల కాలంలో ఈ ఆలయాన్ని నిర్మించినట్టు గుడిలోని శాసనాల ద్వారా తెలుస్తోంది.


**700 ఏళ్లుగా వెలుగుతున్న దీపం**

ఈ ఆలయ ప్రత్యేకత ఏమిటంటే మూల విగ్రహాల ప్రతిష్ఠకు ముందే ఇక్కడ నందా దీపాన్ని ప్రతిష్ఠించారట. అప్పటి నుంచి నేటి వరకు ఈ దీపం ఆరకుండా ప్రకాశిస్తూనే ఉందట. ఆలయానికి వచ్చిన భక్తులు ఈ దీపానికి నూనెను సమర్పిస్తూ దాని జ్వాలను ఆరిపోకుండా చూసుకుంటున్నారట.తరతరాలుగా ఈ సంప్రదాయం కొనసాగుతోందట. గ్రామస్థుల విశ్వాసం ప్రకారం ఈ జ్యోతి వెలుగుతుండటం వల్ల గ్రామంలో ఐశ్వర్యం, పంటలు, శాంతి నిలుస్తాయట. ఇది దైవ అనుగ్రహానికి ప్రత్యక్ష రూపంగా గ్రామస్తులు భావిస్తారు.

**కాకతీయుల కళా వైభవం**

ఈ ఆలయం నిర్మాణం కేవలం భక్తి కట్టడం మాత్రమే కాదు. శిల్పకళకు కూడా మహోన్నతికి ప్రతీకగా నిలుస్తోంది. ఈ ఆలయంలో 16, 18 రాతి స్తంభాలతో అద్భుత మండపాలు, చతురస్రాకార





నిర్మాణ శైలి. శిల్పాల్లో కనిపించే నిగూఢమైన నైపుణ్యం. ఈ నిర్మాణం కాకతీయుల కాలపు కళాత్మక ప్రతిభను ప్రతిబింబిస్తూ, చరిత్రను జీవంతంగా నిలబెడుతోంది. ప్రతి సంవత్సరం శ్రీరామనవమి సందర్భంగా ఈ ఆలయం భక్తులతో కిటకిటలాడుతుంది. 9 రోజుల పాటు నవాహ్నిక బ్రహ్మోత్సవాలు సీతారామ కళ్యాణం.. భద్రాచలం తరహాలో ఘనంగా అశ్వ, గజ, గరుడ, హనుమాన్, శేష వాహన సేవలు.. రథోత్సవం, ఏకాంత సేవ వంటికి జరుపుతారు. ఈ ఉత్సవాలకు భక్తులు భారీగా హాజరవుతారు.

**అన్నదాన కార్యక్రమాలు**

ఈ ఉత్సవాల సమయంలో దాతల సహకారంతో నిర్వహించే అన్నదానం ఈ ఆలయ ప్రత్యేకత. గ్రామస్థులు సమిష్టిగా భాగస్వామ్యం వహిస్తూ ప్రతి భక్తునికి సేవ చేయడం ఈ క్షేత్ర ఆధ్యాత్మికతను మరింత పెంచుతోంది. గత కొన్నేళ్లుగా గ్రామ ప్రజల సహకారంతో ఆలయ పునర్నిర్మాణ పనులు చేపట్టడం ద్వారా ఆలయం మరింత శోభాయమానంగా మారింది.


### ఒంటిమిట్ట అసలు కథ ఇది..

శ్రీరాముడు ఎక్కడ ఉంటే అక్కడ హనుమంతుడు ఉంటాడన్నది జగమెరిగిన సత్యం. కానీ, కడప జిల్లాలోని ఒంటిమిట్ట కోదండరామ స్వామి ఆలయంలో మాత్రం సీతారామలక్ష్మణులు ఉన్నా, వారి పక్కన ఆంజనేయుడు కనిపించడు. దేశంలో మరెక్కడా లేని విధంగా ఈ వింత ఇక్కడ ఎందుకు ఉంది? దీని వెనుక ఉన్న పురాణ గాథలు ఏమిటి? అన్నది ప్రతి ఒక్కరినీ ఆశ్చర్యపరిచే అంశం. ఒంటిమిట్ట కేవలం ఒక గుడి మాత్రమే కాదు, అది ఒక శిల్పకళా ప్రదర్శనశాల. విజయనగర చక్రవర్తుల కాలంలో నిర్మితమైన ఈ ఆలయం 'ఏకశిలా నగరం'గా పిలవబడుతోంది. ఇక్కడ ఒకే శిలపై సీత, రామ, లక్ష్మణుల విగ్రహాలు చెక్కబడి ఉండటం విశేషం. అయితే, రామాయణ మహాకావ్యంలో కీలకమైన హనుమంతుడి పాత్ర ఇక్కడ ఎందుకు లోపించిందో తెలుసుకోవాలంటే మనం త్రేతాయుగపు కాల గమనంలోకి వెళ్లాల్సిందే.

**1. కిష్కింధకు ముందు కథ:** పురాణాల ప్రకారం, శ్రీరాముడు అరణ్యవాసంలో ఉన్నప్పుడు సీతమ్మను వెతుకుతూ దక్షిణాపథానికి వచ్చిన సమయం అది. ఇంకా ఆయనకు హనుమంతుడితో పరిచయం ఏర్పడలేదు. అంటే, రామాయణంలోని 'కిష్కింధ కాండ' కంటే ముందు జరిగిన ఘట్టానికి ఈ ఆలయం ప్రతీక. అందుకే ఇక్కడ కేవలం సీతారామలక్ష్మణులు మాత్రమే కొలువై ఉన్నారు. హనుమంతుడితో స్నేహం కలగకముందు రాముడు ఎలా ఉన్నాడో, ఇక్కడ అలాగే దర్శనమిస్తాడు.

**2. ఏకశిలపై ముగ్గురు మూర్తులు:** సాధారణంగా ఆలయాల్లో విగ్రహాలను విడివిడిగా ప్రతిష్ఠిస్తారు. కానీ ఒంటిమిట్టలో సీత, రామ, లక్ష్మణుల విగ్రహాలు ఒకే శిలపై చెక్కబడి ఉంటాయి. అందుకే దీనిని ఏకశిలా క్షేత్రం అంటారు. విగ్రహాల కింద హనుమంతుడు లేకపోవడం అనేది ఈ ఆలయ ప్రాచీనతకు, ఆ ఘట్టం యొక్క విశిష్టతకు నిదర్శనం.

**3. భక్త పోతన పరవశం:** మహాకవి బమ్మెర పోతన తన 'శ్రీమదాంధ్ర భాగవతం' ఇక్కడే రాసి, స్వామివారికి అంకితం ఇచ్చారని





ప్రతీతి. "రామభద్రుని కంటే దైవము లేదని" నమ్మిన పోతన, ఈ క్షేత్రంలోని స్వామివారి అందానికి ముగ్ధుడై తన కావ్యాన్ని ఇక్కడే పూర్తి చేశారు. ఫ్రెంచ్ యాత్రికుడు టావెర్నియర్ సైతం 1652లో ఈ ఆలయాన్ని సందర్శించి, "భారతదేశంలో ఉన్న అత్యంత సుందరమైన ఆలయాలలో ఇది ఒకటి" అని తన గ్రంథంలో రాశారు.

**4. చంద్రుడి కోరిక – వెన్నెల కల్యాణం:** మరో ఆసక్తికరమైన విషయం ఏమిటంటే, ఇక్కడ శ్రీరామనవమి రోజు కల్యాణం జరగదు. చైత్ర శుద్ధ పౌర్ణమి నాడే కల్యాణం జరుగుతుంది. రాముడు జన్మించింది సూర్యవంశంలో కాబట్టి, సూర్యుడు వెలుతురులో కల్యాణం చూడాలని అందరూ భావిస్తారు. కానీ, తన వంశంలో పుట్టిన రాముడి కల్యాణాన్ని తాను కూడా చూడాలని చంద్రుడు కోరగా.. ఆయన కోరిక మేరకు నిండు పౌర్ణమి నాటి వెన్నెల వెలుగుల్లో ఇక్కడ కల్యాణం జరిపిస్తారని పురాణాలు చెబుతున్నాయి. ఒంటిమిట్ట రామాలయం కేవలం ఒక మతపరమైన క్షేత్రం మాత్రమే కాదు, అది భారతీయ సంస్కృతికి, చరిత్రకు సజీవ సాక్ష్యం. హనుమంతుడు లేని ఈ విలక్షణ రామాలయం, రామాయణంలోని ఒక అరుదైన ఘట్టాన్ని మన కళ్లముందు ఉంచుతుంది. ఈ వేసవిలో వెన్నెల వెలుగుల కల్యాణాన్ని వీక్షించడం ప్రతి ఒక్కరి జీవితంలో ఒక మధుర జ్ఞాపకం.

# విశ్వం వాయిస్

అవినీతిపై- అక్షరసమరం...



కాకినాడ తూర్పు గోదావరి
డా బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ

బుధవారం, 20 మే, 2026


www.viswamvoice.com

## వైసిపి ప్రభుత్వ హయాంలో పెట్రోల్, డీజిల్ ధరలు

# ఏడుసార్లు పెంచారు


### పెట్రోల్ ధరలు పెంపు అంశం కేంద్ర పరిధిలోనిది : రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్ ఎమ్మెల్యే వేగుళ్ళ



**మండపేట టౌన్, విశ్వంవాయిస్ న్యూస్ :** పెట్రోల్ ధరలు పెంపు అంశం కేంద్ర పరిధిలోనిదనీ రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్ మండపేట ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు అన్నారు. మండపేట టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీజేపీనీ వైసిపి ఎందుకు ప్రశ్నించదనీ నిలదీశారు. నిరసన ప్లే కార్డులో మోదీ ఫోటో వేసే ధైర్యం లేదా అంటూ ప్రశ్నించారు.కేంద్రం అంటే జగన్‌కు భయమని పేర్కొన్నారు. పెట్రోల్ డీజిల్ ధరలు పెంపుపై వైసిపి రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన నిర్వహించిన విషయం విధితమేనన్నారు. కాగా ఈ అంశం రాష్ట్ర ప్రభుత్వం పరిధిలో ఉందా కేంద్ర ప్రభుత్వ పరిధిలో ఉందో వైసీపీ నాయకులు సమాధానం చెప్పాలని నిలదీశారు. ఈ నేపథ్యంలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఫోటోను వీరు చేపట్టిన నిరసన ప్లే కార్డులలో ఎక్కడ ముద్రించలేదని తెలిపారు. చంద్రబాబు లోకేష్ ల ఫోటోలతో నిరసన తెలియజేసిన ప్లే కార్డులను ఆయన మీడియాకు చూపించారు. కేంద్ర ప్రభుత్వాన్ని ఈ వైసీపీ నాయకులు ఎందుకు ప్రశ్నించడం లేదని నిలదీశారు. దీనిపై మాజీ ముఖ్యమంత్రి జగన్ తో సహా రాష్ట్రంలోని వైసీపీ నేతలు అందరూ సమాధానం చెప్పాల్సిందేనని పేర్కొన్నారు. గల్ఫ్ సంక్షోభంతో కేంద్ర ప్రభుత్వం డీజిల్ పెట్రోల్ ధరలు పెంచిందని వివరించారు. గత వైసిపి ప్రభుత్వ హయాంలో పెట్రోల్ డీజిల్ ధరలు దాదాపు ఏడుసార్లు పెంచారని అప్పుడు రాష్ట్ర ప్రభుత్వం పన్నులు ఏ మేరకు తగ్గించుకున్నారో వివరాలు వెల్లడి చేయాలని సవాల్ చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ మంత్రి నారా లోకేష్ లు ఎవరిని మోసం చేయలేదని స్పష్టం చేశారు. చంద్రబాబు మోసం చేశారంటూ వైసీపీ నాయకులు విమర్శించడానికి ఆయన తీవ్రంగా ఖండించారు. చంద్రబాబు నాయకత్వంలో ఈ రాష్ట్రానికి రూ 23 లక్షల కోట్ల రూపాయలు వివిధ దేశాలు రాష్ట్రాల నుండి పెట్టుబడులు వచ్చాయని పేర్కొన్నారు. పెట్టుబడులను ఈ రాష్ట్రానికి తీసుకువచ్చి దేశంలోనే ఆంధ్రప్రదేశ్ ను అగ్రగామిగా నిలిపిన విషయాన్ని గుర్తు చేశారు. 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చారని ఈ మేరకు ఉద్యోగ కల్పనలో రికార్డు సృష్టిస్తున్నారని పేర్కొన్నారు. ఇప్పటి వరకు ఎన్టీఆర్ భరోసా పెన్షన్లను రికార్డు స్థాయిలో 64 లక్షల మందికి రూ 63 వేల కోట్ల రూపాయలను అందజేసినట్లు వివరించారు. ఇచ్చిన హామీ మేరకు ఎన్నికల్లో గెలుపొందిన వెంటనే పెంచిన పెన్షన్లు ఇచ్చిన ఘనత నారా చంద్రబాబు నాయుడుకు దక్కుతుందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇచ్చిన హామీ మేరకు నాలుగు కోట్ల సిలిండర్లను పంపిణీ చేశామని చెప్పారు. స్త్రీ శక్తి పథకం ద్వారా మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించామని పేర్కొన్నారు. 63.61 కోట్ల ప్రయాణాలు మే ఆరు వరకు చేశారన్నారు. గత టిడిపి హయాంలో ఐదు రూపాయలకే పేదవారికి అన్నం పెట్టే వారని 2019లో వైసీపీ అధికారం చేపట్టిన అనంతరం దీనిని రద్దు చేసిందని విమర్శించారు. తాము తిరిగి అధికారంలోకి వచ్చిన తరువాత అన్న క్యాంటీన్లను పున ప్రారంభించినట్లు వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా 269 కేంద్రాల ద్వారాఅన్నా క్యాంటీన్ లు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 9 కోట్ల భోజనాలు వీటి ద్వారా చేశారని చెప్పారు. 46 లక్షల మంది రైతులకు రూ 8980 కోట్లు ఇచ్చారని పేర్కొన్నారు. ఇవన్నీ కనిపించడం లేదా అని ఆయన ప్రశ్నించారు. ధాన్యం కొనుగోలు కేంద్రం ద్వారా 24 గంటల్లో ఎన్ని దాన్యం తెచ్చుకుంటే అన్ని ధాన్యానికి 24 గంటల్లో సొమ్ములు అందజేస్తున్నారని చెప్పారు. కొందరు రైతులకు అయితే 6 గంటలలోనే ధాన్యం అమ్మిన సొమ్ములు వారికి జమవుతున్న విషయాన్ని గుర్తు చేశారు. మత్స్యకారులు 1,25,000 మందికి ఏడాదికి రూ 20,000 అందజేస్తున్నట్లు తెలిపారు. బిసి, ఎస్ సి సంక్షేమ పథకాలు అమలు వివరించారు.రైతులకు తీవ్ర ఇబ్బంది పెట్టిన ల్యాండ్ టైటిల్ యాక్ట్ ను రద్దు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. మైనార్టీ సంక్షేమానికి చేసిన చేసిన కృషి వివరించారు. అలాగే పాస్టర్ల, ఇమామ్ మౌజాన్‌లను ప్రభుత్వం ఆదుకున్నట్లూ చెప్పారు. బహుజనులకు అందజేస్తున్న సహాయాన్ని గుర్తు చేశారు. ఎస్సీ ఎస్టీ వర్గాలకు అందజేస్తున్న పథకాలు వివరించారు. పోలవరం ప్రాజెక్టును వైసీపీ నాయకులు పక్కన పెట్టేస్తే తమ ప్రభుత్వం పూర్తి చేసిందని ఈ ఏడాది జులైలోనే దీన్ని పూర్తి చేసి జాతికి అంకితం చేస్తామని చెప్పారు. అమరావతి రాజధానిని అత్యాధునిక వసతులతో నిర్మిస్తున్న విషయాన్ని గుర్తు చేశారు. విశాఖ రైల్వే జోన్ సాధించిన విషయం ప్రతిపక్ష వైసిపి మర్చిపోయిందని ఎద్దేవా చేశారు.గత వైసిపి ప్రభుత్వం చేసిన రూ పది లక్షల కోట్ల అప్పుకు వడ్డీ రూ 66 వేల కోట్లు అవుతుందని అయినప్పటికీ అభివృద్ధి కార్యక్రమాలు ఎక్కడ ఆపకుండా నిరంతరం రాష్ట్ర అభివృద్ధికి తమ ప్రభుత్వం కృషి చేస్తుందని పేర్కొన్నారు. తమ ప్రభుత్వం ఇచ్చిన హామీలన్నిటిని కచ్చితంగా అమలు చేస్తుందని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు. ఈ సమావేశంలో జిల్లా గ్రంధాలయ సంస్థ మాజీ చైర్మన్ నల్లమిల్లి వీరెడ్డి, మాదిగ కార్పొరేషన్ డైరెక్టర్ మందపల్లి చంద్రశేఖర్ (దొరబాబు), టిడిపి నాయకులు సిరంగి ఈశ్వర్, శెట్టి రవి,సాధనల చక్రపాణి, గుండు తాతరాజు, జక్కల నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

## కాపులను అణగదొక్కాలని చూస్తే ఖబడ్దార్..

**– ముద్దాల తిరుపతిరావు హెచ్చరిక**



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** కాపులను, కాపు నాయకులను రాజకీయంగా అణగదొక్కాలని చూసే పార్టీల మనుగడ సాగనివ్వబోమని ఆంధ్రప్రదేశ్ స్టేట్ కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్, యువకాపునాడు రాష్ట్ర అధ్యక్షులు ముద్దాల తిరుపతిరావు తీవ్రస్థాయి లో హెచ్చరించారు. గుంటూరు జిల్లా వట్టిచెరుకూరు మండలం వల్లూరులో కాపు యువతపై జరిగిన దాడిని ఆయన తీవ్రంగా ఖండిస్తూ మంగళవారం సంచలన ప్రకటన విడుదల చేశారు. కాపు సామాజికవర్గం ఆర్థికంగా, రాజకీయంగా ఎదుగుతుంటే ఓర్వలేక కొన్ని రాజకీయ శక్తులు కుట్రలకు పాల్పడుతున్నాయని ముద్దాల మండిపడ్డారు. కాపు యువతపై అక్రమ కేసులు బనాయిస్తూ భయాందోళనలు సృష్టించాలని చూస్తే సహించబోమన్నారు. వల్లూరులో కాపులపై దాడులకు పాల్పడిన వారిని వెంటనే అరెస్ట్ చేసి, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాజకీయ పార్టీలు ఎన్నికల సమయంలో మాత్రమే కాపులను గుర్తు చేసుకుంటున్నాయని, అధికారంలోకి వచ్చిన తర్వాత పక్కన పెడుతున్నాయని ఆయన విమర్శించారు."కాపులను కేవలం ఓటు బ్యాంకుగా ఉపయోగించుకునే రోజులు ముగిసే దశకు వచ్చాయి. అవసరమైతే సీటు మార్చే శక్తి కూడా కాపు సమాజానికి ఉంది" అని వ్యాఖ్యానించారు. అమరజీవి వంగవీటి మోహనరంగా, జక్కంపూడి రామ్మోహన్‌రావుల ఉద్యమ స్ఫూర్తి నేటికీ కాపు యువతలో రగులుతూనే ఉందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా కాపు సంఘాలన్నీ ఒకే తాటిపైకి వచ్చాయని, యువత "ఒకే మాట– ఒకే బాట"గా ముందుకు సాగుతోందని తెలిపారు. కాపులపై ఎలాంటి దాడులు జరిగినా తిప్పికొట్టేందుకు సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. గత ప్రభుత్వంలో అమలైన 'కాపు నేస్తం' పథకం ప్రస్తుతం ఎందుకు నిలిచిపోయిందని ఆయన ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం తక్షణమే స్పందించి కాపుల సంక్షేమానికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రతి మండలంలో ఒక "కాపు కళ్యాణ మండపం" నిర్మించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర రాజకీయాలను ప్రభావితం చేసే అతిపెద్ద సామాజిక శక్తి కాపు కులమేనని ముద్దాల తిరుపతిరావు పేర్కొన్నారు. "మాకు కాపు కాయడం మాత్రమే కాదు.. అవసరమైతే శాసించడం కూడా తెలుసు. ఇతర కులాలన్నింటినీ అన్నదమ్ముల్లా భావిస్తాం. అయితే మా ప్రేమను చేతకానితనంగా భావించి అణగదొక్కాలని చూస్తే సహించేది లేదు"అని ఆయన హెచ్చరించారు.

## వార్డుల పునర్విభజనలో స్పష్టత లేదు

### ప్రజలకు పూర్తిగా అవగాహన పరిచే వరకు ఈ ప్రక్రియ నిలిపివేయాలని వైసిపి డిమాండ్



**మండపేట టౌన్, విశ్వంవాయిస్ న్యూస్ :** మండపేట వార్డుల పునర్విభజనలో స్పష్టత లేదనీ మండపేట పట్టణ వైసిపి కన్వీనర్ పిల్లి శ్రీనివాస్, మాజీ కౌన్సిలర్ పోతంశెట్టి ప్రసాద్, పట్టణ వైసిపి బూత్ కన్వీనర్ సూరంపూడి సత్యప్రసాద్‌లు పేర్కొన్నారు. వీటిపైచాలా అభ్యంతరాలు ఉన్నాయన్నారు. వార్డు మ్యాప్, ఓటర్ల జాబితా ఇవ్వాలన్నారు. ప్రజలకు పూర్తిగా అవగాహన చేయాలన్నారు. అప్పటి వరకు ఈ ప్రక్రియ నిలిపివేయాలనీ వైసిపి నాయకులు డిమాండ్ చేశారు.మండపేట మున్సిపాలిటీ వార్డుల పునర్విభజనపై వైఎస్సార్‌సీపీ నాయకులు ఆగ్రహం వ్యక్తంచేశారు. 30 నుండి 36 వార్డుల పెంపు కోసం క్షేత్రస్థాయి పరిశీలనకు అధికారుల బృందం వైసిపి బృందం తో కలిసి వివరాలు హద్దులు చూపించాలని పేర్కొన్నారు. మండపేట మున్సిపాలిటీ పరిధిలోని 30 వార్డులను 36 వార్డులుగా పునర్విభజన చేస్తూ మున్సిపల్ కార్యాలయం విడుదల చేసిన ప్రాథమిక నోటిఫికేషన్ పై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. కొత్త వార్డుల సరిహద్దులు, భౌగోళిక విస్తీర్ణం పోలింగ్ బూత్‌ల విభజనపై స్పష్టత లేదని విమర్శించారు. ప్రజలకు పూర్తి అవగాహన లేకుండా ప్రక్రియ ముందుకు వెళ్తోందని ఆరోపించారు. ఈ నేపథ్యంలో వైఎస్సార్‌సీపీ తరఫున ప్రత్యేక స్క్రూటినీ కమిటీ ని ఏర్పాటు చేసి నట్లు తెలిపారు. క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టాలని నిర్ణయించిందన్నారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ టీవీ రంగారావు కు వినతి పత్రాన్ని అందజేశారు. వైసిపి కమిటీ సభ్యులు క్షేత్రస్థాయి పర్యటన చేసినప్పుడు, మున్సిపల్ సర్వేయర్లు,అధికారుల బృందాన్ని కేటాయించాలన్నారు. వార్డు సరిహద్దులను స్పష్టంగా చూపించాలన్నారు. 36 వార్డుల భౌగోళిక మ్యాపులు ( వార్డు లే అవుట్ చిత్రాలు), సరిహద్దుల వివరణలు, బూత్‌ల వారీగా ఓటర్ల విభజన డాక్యుమెంట్లను అధికారికంగా అందజేయాలన్నారు.ఆంధ్రప్రదేశ్ మున్సిపాలిటీల చట్టం 1965, డెలిమిటేషన్ రూల్స్ రాజ్యాంగ 74వ సవరణ ఆర్టికల్ 243 ఎస్ & 243ఆర్ ప్రకారం పారదర్శకంగా, ప్రజాస్వామ్యబద్ధంగా ప్రక్రియ జరగాలని స్పష్టం చేశారు. జనాభా నిష్పత్తి, భౌగోళిక సాన్నిహిత్యం ఆధారంగా వార్డులు ఏర్పాటు కావాలని గుర్తు చేశారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా, పూర్తి సమాచారం అందించి అభ్యంతరాలు స్వీకరించాలని వైఎస్సార్‌సీపీ నాయకులు మున్సిపల్ కమిషనర్ టీవీ రంగారావు ను కోరారు. ఈ విషయంపై మున్సిపల్ కమిషనర్ తగిన చర్యలు తీసుకుంటానన్నారు. దీనిపై పూర్తి వివరాలు ప్రజలకు తెలియచేసే వరకు ఈ ప్రతిపాదనని ఆపాలని వైసీపీ నేతలు డిమాండ్ చేశారు.

## ఇసుక మాఫియాపై గనుల శాఖ దాడులు

### ఓడలరేవులో ఐదు ట్రాక్టర్లు, ఒక లారీ స్వాధీనం

### అల్లవరం మండలంలో అక్రమ ఇసుక రవాణాపై కఠిన చర్యలు



**అమలాపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** మే 18 సోమవారం అల్లవరం మండలంలో ఇసుక మాఫియాపై ఒక వ్యక్తి ఆవేదనను పి.ఆర్ న్యూస్‌లో పోస్టు చేయడం జరిగింది. దీనిపై జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా గనులు, భూగర్భ శాఖ అధికారులు చర్యలు చేపట్టారు. ముమ్మిడివరం నుండి అధికారి బి.అశోక్ కుమార్ బృందం మంగళవారం తెల్లవారుజామున మూడు గంటల సమయంలో అల్లవరం మండలం ఓడలరేవు గ్రామంలో బొండు ఇసుక తరలిస్తున్న ఐదు ట్రాక్టర్లు, ఒక లారీని స్వాధీనం చేసుకుని అల్లవరం పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు. అలాగే నాలుగు రోజుల క్రితం కొమరగిరిపట్నం ప్రాంతంలో ఒక ప్రోక్లైనర్, రెండు లారీలను స్వాధీనం చేసుకుని వాటికి రూ.2,50,000 జరిమానా విధించినట్లు వెల్లడించారు.

### రామచంద్రపురం మున్సిపాలిటీలో

## "1 నిమిషం 4 డబ్బాలు" స్వచ్ఛత అవగాహన కార్యక్రమం ప్రారంభం



**రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** రామచంద్రపురం పురపాలక సంఘం పరిధిలో మంగళవారం నాడు మున్సిపల్ కమిషనర్ కెవివిఆర్ రాజు ఆధ్వర్యంలో స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ ఆదేశాల మేరకు "1 నిమిషం - 4 డబ్బాలు" కార్యక్రమం ఘన వ్యర్థాల నిర్వహణలో భాగంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రజలు తమ ఇళ్ల వద్దే చెత్తను నాలుగు రకాలుగా విభజించి (సోర్స్ సెగ్రిగేషన్) పారిశుధ్య కార్మికులకు అందించాలని కమిషనర్ ఆదేశించారు. తడిచెత్తను గ్రీన్ (పచ్చని) డబ్బాలో పొడిచెత్తను బ్లూ (నీలి) డబ్బాలో శానిటరీ వ్యర్థాలను రెడ్ (ఎరుపు) డబ్బాలో మరియు ప్రత్యేకమైన చెత్తను బ్లాక్ (నలుపు) రంగు డబ్బాలో ఉంచి పారిశుధ్య సిబ్బందికి అందజేయాల్సి ఉంటుంది. ఈ అవగాహన కార్యక్రమం మున్సిపాలిటీ పరిధిలోని మొత్తం 28 వార్డులలో వరుసగా 7 రోజుల పాటు కొనసాగుతుంది. ప్రతిరోజూ ఉదయం 7:00 గంటల నుండి మధ్యాహ్నం 12:00 గంటల వరకు వార్డ్ సచివాలయ సెక్రటరీలు, ఆర్‌పిల సహాయంతో ఇంటింటికీ తిరుగుతూ బ్యానర్లు, పాంప్లెట్ల ద్వారా ప్రజల్లో చైతన్యం తీసుకొస్తున్నారు. ఇందుకోసం ప్రత్యేక సమావేశాలను కూడా ఏర్పాటు చేస్తున్నారు. పట్టణ ప్రజలందరూ ఈ కార్యక్రమానికి సహకరించి చెత్తను వేరుచేసి అందించడం ద్వారా స్వచ్ఛ సర్వేక్షన్ ర్యాంకింగ్స్‌లో మన రామచంద్రపురం పట్టణానికి ఉత్తమమైన ర్యాంకు వచ్చేలా కృషి చేయాలని మున్సిపల్ కమిషనర్ కెవివిఆర్ రాజు కోరారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ తో పాటు శానిటరీ ఇన్‌స్పెక్టర్ డేవిడ్ రాజు, శానిటేషన్ & ఎన్విరాన్మెంట్ సెక్రెటరీలు, మరియు డ్వాక్రా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

### పార్టీలు చేస్తున్న ధర్నాలు, విమర్శలు పూర్తిగా రాజకీయ ప్రయోజనాల కోసమే తప్ప

## ప్రజల పట్ల ఉన్న నిజమైన చిత్తశుద్ధికాదు

### టీడీపీ నాయకులు బొక్కా ప్రసాద్

**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రపంచవ్యాప్తంగా పెరిగిన పెట్రోల్ ధరలు వైసీపీ– కాంగ్రెస్ పార్టీలకు కనిపించకపోవడం హాస్యాస్పదం కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని ఓర్వలేక ఎద్దుల బండ్లు,గుర్రం బండ్లు ఎక్కుతున్న వైసీపీ – కాంగ్రెస్ నేతలు కొత్తపేట నియోజకవర్గ టీడీపీ యువనాయకులు: బొక్కా ప్రసాద్ ఆంధ్రప్రదేశ్‌లో పెట్రోల్, డీజిల్ ధరల పెంపుపై వైసీపీతో పాటు కాంగ్రెస్ పార్టీలు చేస్తున్న ధర్నాలు, విమర్శలు పూర్తిగా రాజకీయ ప్రయోజనాల కోసమే తప్ప ప్రజల పట్ల ఉన్న నిజమైన చిత్తశుద్ధి కాదని టీడీపీ యువనాయకులు బొక్కా ప్రసాద్ విమర్శించారు. పెట్రోల్, డీజిల్ ధరలు రాష్ట్ర ప్రభుత్వాలు ఇష్టం వచ్చినట్లు నిర్ణయించే అంశం కాదని, అంతర్జాతీయ మార్కెట్‌లో క్రూడ్ ఆయిల్ ధరలు, డాలర్ మారకం విలువలు, ముఖ్యంగా ప్రపంచ దేశాల మధ్య జరుగుతున్న యుద్ధాల ప్రభావం వల్లే ఇంధన ధరల్లో మార్పులు వస్తాయని తెలిపారు. ప్రస్తుతం రష్యా – ఉక్రెయిన్ యుద్ధం, మధ్యప్రాచ్య దేశాల్లో ఉద్రిక్త పరిస్థితులు, అంతర్జాతీయ రవాణా వ్యయాల పెరుగుదల వంటి కారణాలతో ప్రపంచవ్యాప్తంగా ఇంధన ధరలు పెరిగాయని, ఇది కేవలం భారతదేశ సమస్య కాదు... పూర్తిగా గ్లోబల్ ఇష్యూ అని పేర్కొన్నారు. ప్రపంచంలోని అనేక దేశాల్లో ప్రస్తుతం పెట్రోల్ ధరలు భారతదేశం కంటే ఎక్కువగానే ఉన్నాయని తెలిపారు.నెదర్లాండ్స్ –రు 260/లీటర్ అమెరికా –రు 205/లీటర్ ఇంగ్లాండ్ – రు 205/లీటర్ థాయిలాండ్ –రు 140/లీటర్ జపాన్ –రు 128/లీటర్ గల్ఫ్ దేశాలు –రు 93/లీటర్ అలాంటి పరిస్థితుల్లో కూడా అక్కడి ప్రతిపక్ష పార్టీలు ప్రజలను తప్పుదారి పట్టించే రాజకీయాలు చేయడం లేదని అన్నారు. కానీ రాష్ట్రంలో మాత్రం వైసీపీ, కాంగ్రెస్ పార్టీలు కలిసి ప్రజల్లో అపోహలు సృష్టించే ప్రయత్నం చేస్తున్నాయని మండిపడ్డారు.వైసీపీ అధికారంలో ఉన్న సమయంలో పెట్రోల్, డీజిల్‌పై భారీ పన్నులు వేసి ప్రజలపై భారం మోపిన విషయాన్ని ప్రజలు మర్చిపోలేదన్నారు. అప్పట్లో ధరలు పెరిగినప్పుడు నోరు మెదపని నాయకులు, ఇప్పుడు రాజకీయ లబ్ధి కోసం ధర్నాల పేరుతో నాటకాలు ఆడటం హాస్యాస్పదమని ఎద్దేవా చేశారు.అలాగే దేశంలో ఎన్నో సంవత్సరాలు అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ హయాంలో కూడా ఇంధన ధరలు ఎన్నోసార్లు పెరిగాయని, అప్పట్లో ప్రజలపై పడిన భారాన్ని ఇప్పుడు మర్చిపోయి రాజకీయ డ్రామాలు చేయడం విడ్డూరమన్నారు. ప్రపంచ పరిస్థితుల ప్రభావంతో ఏర్పడిన తాత్కాలిక ఇంధన ధరల పెరుగుదలపై ప్రజలకు నిజాలు చెప్పాల్సింది పోయి, వైసీపీ – కాంగ్రెస్ పార్టీలు కలిసి ప్రజల్లో భయాందోళనలు సృష్టించడం బాధ్యతారాహిత్యమని తెలిపారు.వైసీపీ నాయకులు ఎద్దుల బండ్లు, గుర్రం బండ్లు ఎక్కి చేస్తున్న నిరసనలు ప్రజలను ఆకట్టుకునే పాత రాజకీయ స్టంట్లేనని, ఇప్పుడు ప్రజలు పూర్తి అవగాహనతో ఉన్నారని, వాస్తవాలు ఏమిటో బాగా తెలుసుకుంటున్నారని టీడీపీ యువనాయకులు బొక్కా ప్రసాద్ స్పష్టం చేశారు.

## ప్లాస్టిక్ వ్యర్థాల నిర్మూలనకు 'స్వచ్ఛ రథం'

### మంత్రి వాసంశెట్టి సుభాష్ చేతుల మీదుగా "స్వచ్ఛ రథం" ప్రారంభం




**రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** కాజులూరు మండలంలో వివిధ గ్రామాలలో ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరించి ప్రజలకు నిత్యావసర సరుకులు అందించే లక్ష్యంతో ప్రవేశపెట్టిన 'స్వచ్ఛ రథం' కార్యక్రమాన్ని మంగళవారం రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, కూటమి పార్టీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం జెండా ఊపి ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి సుభాష్ మాట్లాడుతూ గ్రామాల్లో ప్లాస్టిక్ వ్యర్థాలు, కవర్లు, బాటిళ్లు వంటి చెత్తను రోడ్లపై, డ్రైనేజీల్లో పడేయడం వల్ల అపరిశుభ్ర వాతావరణం ఏర్పడుతోందన్నారు. ప్రజలు తడి చెత్తతో కలపకుండా ప్లాస్టిక్ వ్యర్థాలను విడిగా సేకరించి 'స్వచ్ఛ రథం'కు అందించాలని పిలుపునిచ్చారు. అలాగే పాత ఇనుము, అట్టపెట్టెలు వంటి పనికిరాని వస్తువులను కూడా స్వచ్ఛ రథానికి అందిస్తే వాటి విలువకు అనుగుణంగా ధర నిర్ణయించి, సమానమైన నిత్యావసర సరుకులు లేదా నగదు రూపంలో ప్రజలకు అందజేయడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యమని మంత్రి వివరించారు. పర్యావరణ పరిరక్షణతో పాటు గ్రామాలలో పరిశుభ్రత పెంపొందించడంలో ఈ కార్యక్రమం కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాజులూరు మండల పరిషత్ అభివృద్ధి అధికారి జె.రాంబాబు, డిప్యూటీ ఎంపీడీవో ఎం.సత్యనారాయణ మూర్తి, మండల పరిషత్ కార్యాలయ పరిపాలనా అధికారి ఆర్. పద్మలత, మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది, వివిధ గ్రామ సచివాలయాల కార్యదర్శులు, క్లాప్ మిత్రులు తదితరులు పాల్గొన్నారు.

## డ్రైవర్ సుబ్రహ్మణ్యానికి నివాళులర్పించిన ఎమ్మెల్యే బండారు



**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** వైసీపీ నేత చేతిలో హత్యకు గురైన డ్రైవర్ వీధి సుబ్రహ్మణ్యంకు నివాళిగా పలివెలలో కొవ్వొత్తుల ర్యాలీ వైసిపి పాలనలో దళితులపై అనేక అకృత్యాలు జరిగాయని, జగన్మోహన్ రెడ్డి నేరస్తులను కాపాడుతున్నారని ఎమ్మెల్యే విమర్శించారు వైసీపీ పాలనలో దళితులపై అనేక అకృత్యాలు జరిగాయని ఆవేదన వ్యక్తం చేశారు. వైసీపీ ఎమ్మెల్సీ అనంతబాబు చేతిలో హత్యకు గురైన అతని డ్రైవర్ వీధి సుబ్రహ్మణ్యంకు నివాళిగా కొత్తపేట ఎస్సీ సెల్ అధ్యక్షులు నల్లా రమణ ఆధ్వర్యంలో మంగళవారం పలివెల పెదపేటలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, కొత్తపేట మార్కెట్ కమిటీ చైర్మన్ పల్లి మంగాదేవి భీమారావు తదితరులు పాల్గొన్నారు. ఎమ్మెల్యే బండారు ముందుగా రాజ్యాంగ నిర్మాత డా.బి.ఆర్.అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. అనంతరం వీధి సుబ్రహ్మణ్యం చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సుబ్రమణ్యం హత్య జరిగి నేటికీ నాలుగేళ్లు గడిచాయని, నాటి వైకాపా పాలనలో దళితులపై అనేక అకృత్యాలు జరిగాయన్నారు. సుబ్రమణ్యంను హత్య చేసి, డోర్ డెలివరీ చేసిన ఎమ్మెల్సీ అనంతబాబును వైకాపా అధినేత జగన్ కాపాడుతున్నారని విమర్శించారు. వైసిపి హయాంలో వీధి సుబ్రహ్మణ్యం హత్య, డాక్టర్ సుధాకర్ మరణానికి కారణమయ్యేలా వేధింపులు జరిగాయన్నారు. అంబేద్కర్ విదేశీ విద్య తదితర అనేక సంక్షేమ పథకాలను సైతం రద్దు చేయడం జరిగిందన్నారు. కూటమి అధికారంలోకి వచ్చాక తిరిగి సంక్షేమ పథకాల్ని అమలు చేస్తున్నామన్నారు. అనంతరం కొవ్వొత్తులను వెలిగించి ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు.



# దళితులపై దౌర్జన్యాలకు వైసీపీ పాలనే నిదర్శనం : ఎమ్మెల్యే ఆనందరావు



**అమలాపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** వైసీపీ పాలనలో దళిత సామాజిక వర్గాలపై జరిగిన అరాచకాలు, అణచివేత మరియు వ్యవస్థాగత అన్యాయాలపై అమలాపురం పట్టణం హౌసింగ్ బోర్డు కాలనీలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం ప్రెస్‌మీట్ నిర్వహించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు పాల్గొని, వైసీపీ హయాంలో ఎస్సీలపై జరిగిన ప్రధాన దౌర్జన్యాలను తీవ్రంగా ఖండించారు. గత ప్రభుత్వ హయాంలో దళిత యువత భద్రత, శ్రమకు దక్కాల్సిన గౌరవం పూర్తిగా లోపించాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. వైకాపా పాలకులు రాజకీయ అధికారంతో ఎలా దుర్వినియోగానికి పాల్పడ్డారో, జవాబుదారీతనం లేకుండా ఎలా వ్యవహరించారో చెప్పడానికి వీధి సుబ్రహ్మణ్యం, డాక్టర్ సుధాకర్ ఘటనలే సజీవ సాక్ష్యాలని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆనందరావు మాట్లాడుతూ, గత వైసీపీ ఎమ్మెల్సీ వద్ద మాజీ డ్రైవర్‌గా పనిచేసిన దళిత యువకుడు వీధి సుబ్రహ్మణ్యాన్ని, సదరు ఎమ్మెల్సీతో తలెత్తిన వివాదం కారణంగా దారుణంగా హత్య చేశారనే ఆరోపణలు ఉన్నాయని గుర్తుచేశారు. బాధితుడి మృతదేహాన్ని తీసుకొచ్చి వారి ఇంటి వద్దే పడేసి, మొదట్లో దీనిని ఒక రోడ్డు ప్రమాదంగా నమ్మించేందుకు కుట్రపూరిత ప్రయత్నం చేశారని మండిపడ్డారు. అయితే తీవ్రంగా కొట్టడం వల్లే ఆయన మరణించాడని దర్యాప్తులో తేలిందని, రాజకీయ అండతో జరిగిన ఈ దారుణాన్ని ప్రజలందరూ గమనించాలని కోరారు. అలాగే కరోనా విపత్కర సమయంలో ప్రజల ప్రాణాల కోసం పీపీఈ కిట్ల కొరతపై ఆందోళన వ్యక్తం చేసినందుకు ఎస్సీ మాల సామాజిక వర్గానికి చెందిన ప్రభుత్వ అనస్థీషియా వైద్యుడు డాక్టర్ సుధాకర్‌ను దారుణంగా వేధించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయనను సస్పెండ్ చేయడమే కాకుండా, బహిరంగంగా అరెస్టు చేసి అవమానించారని అన్నారు. వైసీపీ పాలనలో ప్రశ్నించే గొంతుకలను ఎలా అణిచివేశారో, దళిత వృత్తి నిపుణులను ఎలా లక్ష్యంగా చేసుకున్నారో చెప్పడానికి డాక్టర్ సుధాకర్ ఒక ప్రతీకగా మిగిలిపోయారని పేర్కొన్నారు. ఈ దౌర్జన్యాలు, వ్యవస్థాగత అన్యాయాలపై దళిత యువజన సంఘాలు, ఆరోగ్య నిపుణులు, స్థానిక వర్గాలలో అవగాహన కల్పించేందుకు నేటి నుండి మే 19, 20, 21 తేదీలలో నియోజకవర్గవ్యాప్తంగా, ముఖ్యంగా ఎస్సీ కాలనీలలో సంస్మరణ కార్యక్రమాలు, సామూహిక సమావేశాలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఇందులో భాగంగా కాలనీ స్థాయిలో కొవ్వొత్తుల ప్రదర్శనలు, స్మృతి చిహ్నాల ఏర్పాటు మరియు డాక్టర్ సుధాకర్ జ్ఞాపకార్థం ఉచిత ఆరోగ్య శిబిరాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. దళిత వ్యక్తులు, వృత్తిపరమైన నిపుణులు మరియు ఆర్థికంగా వెనుకబడిన వర్గాలపై జరిగిన బెదిరింపులు, దౌర్జన్యాలకు వ్యతిరేకంగా దళిత హక్కుల సంఘాలు, స్థానిక యువత మరియు ప్రజలందరూ ఐక్యంగా నిలబడాలని ఎమ్మెల్యే ఆనందరావు పిలుపునిచ్చారు. చట్టం ముందు అందరూ సమానులేనని, బాధితులకు ఆత్మగౌరవం, న్యాయం జరిగే వరకు తమ పోరాటం ఆగేది లేదని స్పష్టం చేశారు. ఈ ప్రెస్‌మీట్‌లో నియోజకవర్గ ప్రజాప్రతినిధులు, ఎస్సీ విభాగం నాయకులు, దళిత యువజన సంఘాల ప్రతినిధులు, స్థానిక నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# దేశ భవిష్యత్తుకు జనగణన కీలకం

**డిజిటల్ జనగణన దేశ వికాసానికి నాంది : డిఆర్ఓ వి.సుబ్బారావు**



**అమలాపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** దేశ భవిష్యత్తు ప్రణాళికలు, అభివృద్ధి అధ్యయనాలకు జనగణన అత్యంత కీలకమని, డిజిటల్ జనగణన దేశ వికాసానికి నాంది పలుకుతుందని డిఆర్ఓ వి.సుబ్బారావు తెలిపారు. మంగళ వారం రాష్ట్ర జనగణన సంచాలకులు జే.నివాస్ అమరావతి నుంచి వివిధ జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి గృహ గణన పురోగతిపై జిల్లాల వారీగా సమీక్షించి అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ అనంతరం డిఆర్ఓ మాట్లాడుతూ, తొలి దశలో భాగంగా మే 1వ తేదీ నుంచి ప్రారంభమైన ఇళ్ల జాబితా, గృహ గణన, హౌస్ లిస్టింగ్ మరియు హౌసింగ్ సెన్సస్ ప్రక్రియ ముమ్మరంగా సాగుతోందన్నారు. మే 1 నుంచి 30 వరకు నెల రోజుల పాటు సాగనున్న ఈ బృహత్తర కార్యక్రమం దేశ చరిత్రలోనే తొలిసారిగా పూర్తిస్థాయి డిజిటల్ పద్ధతిలో మొబైల్ అప్లికేషన్ ద్వారా అత్యంత పారదర్శకంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లా వారీ సమీక్షల్లో భాగంగా సంచాలకులు కీలక ఆదేశాలు, సూచనలు జారీ చేశారన్నారు. జిల్లా వ్యాప్తంగా నియమించబడిన ఎన్యూమరేటర్లలో 80 శాతం పైగా గ్రామ, వార్డు సచివాలయ సిబ్బందే ఉన్నారన్నారు. డిజిటల్ యాప్ ద్వారా వేగంగా వివరాలను నమోదు చేస్తున్నారని తెలిపారు. మొదటి మూడు రోజులు ఏరియా మ్యాపింగ్ పూర్తి చేసి, ప్రస్తుతం ప్రతి ఇంటిని జియో ట్యాగింగ్ చేస్తూ వసతుల వివరాలను డిజిటల్ రూపంలో సేకరిస్తున్నారన్నారు. స్వీయ గణన ప్రక్రియలో భాగంగా ఏప్రిల్ 16 నుంచి 30 వరకు ఆన్‌లైన్ ద్వారా ప్రజలు స్వయంగా నమోదు చేసుకున్న వివరాలను ఎన్యూమరేటర్లు క్షేత్రస్థాయిలో వేగంగా ధృవీకరిస్తున్నారన్నారు. రాష్ట్రంలో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా 79.47 శాతంతో గృహ గణన ప్రక్రియలో ఏడో స్థానంలో నిలిచిందని తెలిపారు. డేటా భద్రతపై ప్రజలు ఎలాంటి వదంతులను నమ్మవద్దని సూచించారు. జనగణన చట్టం–1948 ప్రకారం ప్రజలు అందించే వ్యక్తిగత వివరాలు అత్యంత రహస్యంగా ఉంచబడతాయని చెప్పారు. ఈ సమాచారాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ ఇతర సంస్థలతో పంచుకోవడం జరగదన్నారు. ఆధార్, బ్యాంక్ ఖాతాలు, ఆస్తి పత్రాలు, ఆదాయ వివరాలు వంటి సున్నితమైన సమాచారాన్ని ఈ సర్వేలో సేకరించడం లేదని స్పష్టం చేశారు. ప్రజలు ఎలాంటి భయాందోళనలు చెందకుండా ఎన్యూమరేటర్లకు పూర్తిగా సహకరించాలని కోరారు. ఈ గణనను సంక్షేమ పథకాలతో ముడిపెట్టరని, భవిష్యత్తు ప్రణాళికలు, మౌలిక వసతులు, విద్యుత్, తాగునీరు, గృహాల కల్పన వంటి అవసరాల కోసం మాత్రమే ఈ సమాచారాన్ని సేకరిస్తున్నామని తెలిపారు. ప్రస్తుతం అందుతున్న ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ఎలాంటి ప్రభావం ఉండదని స్పష్టం చేశారు. సమాజంలోని అట్టడుగు వర్గాలు, గిరిజన ప్రాంతాలు, నిరాశ్రయులు, ట్రాన్స్‌జెండర్ సముదాయాల వివరాలు కూడా ఎలాంటి లోపం లేకుండా నమోదు చేయాలని ప్రత్యేక ఆదేశాలు ఇచ్చినట్లు తెలిపారు. మే 30తో గృహ గణన ముగియనున్న నేపథ్యంలో రాబోయే రోజుల్లో ప్రక్రియను మరింత వేగవంతం చేసి, ఎలాంటి తప్పులు లేకుండా వంద శాతం ఖచ్చితత్వంతో పూర్తి చేయాలని జిల్లా స్థాయి అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ విధులకు ఆటంకం కలిగించినా, ఉద్దేశపూర్వకంగా తప్పుడు సమాచారం ఇచ్చినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అర్థగణాంక అధికారి ఎం. మురళీకృష్ణ, జనగణన జిల్లా ఇన్‌చార్జి అధికారి తరుణ్, సాంకేతిక బృందం సభ్యులు, సెక్షన్ సూపరింటెండెంట్లు నాగలక్ష్మమ్మ, ఉప తహసీల్దార్ శివరాజ్ తదితరులు పాల్గొన్నారు.

**మత్స్యకారుల ఖాతాల్లో**

# రూ. 24 కోట్ల వేట నిషేధ భృతి

**కోనసీమలో 12 వేల మందికి రూ.20 వేల చొప్పున భృతి పంపిణీ : ఎమ్మెల్యే ఆనందరావు**



**అమలాపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** కూటమి ప్రభుత్వంలో మత్స్యకారుల సంక్షేమానికి పెద్దపీట: అమలాపురం గోదావరి భవన్‌లో లబ్ధిదారులకు రూ.24.032 కోట్ల నిధులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే ఆనందరావు మత్స్యకారులకు ఇన్సూరెన్స్, సబ్సిడీపై బోట్లు, వలలు అందిస్తాం: సీఎం చంద్రబాబు, మంత్రి అచ్చెన్నాయుడు నేతృత్వంలో అండగా ఉంటామన్న ఎమ్మెల్యే ఆనందరావు డా. బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా కేంద్రం అమలాపురం కలెక్టరేట్‌లోని గోదావరి భవన్ వేదికగా మత్స్యశాఖ ఆధ్వర్యంలో "మత్స్యకారుల సేవలో" కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. సముద్రంలో వేట సాగిస్తూ జీవనం సాగించే మత్స్యకారులకు వేట నిషేధ కాలంలో ప్రభుత్వం అందించే "వేట నిషేధ భృతి"ని స్థానిక శాసనసభ్యుడు అయితాబత్తుల ఆనందరావు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఎమ్మెల్యే ఆనందరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం మత్స్యకారుల సంక్షేమానికి, వారి అభ్యున్నతికి పూర్తిస్థాయిలో కట్టుబడి ఉందన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మత్స్యశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు నేతృత్వంలో రాష్ట్ర ప్రభుత్వం మత్స్యకారుల ప్రయోజనాలే లక్ష్యంగా పనిచేస్తోందని పేర్కొన్నారు. సముద్రంలో వేట నిషేధ కాలంలో మత్స్యకార కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొనకుండా ఉండేందుకు డా. బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లావ్యాప్తంగా అర్హులైన 12,016 మంది లబ్ధిదారులకు ఒక్కొక్కరికి రూ. 20,000 చొప్పున మొత్తం రూ. 24.032 కోట్లను నేరుగా వారి ఖాతాల్లో జమ చేసినట్లు వెల్లడించారు. మత్స్యకారుల భద్రత, ఉపాధిని మరింత మెరుగుపరిచేందుకు కూటమి ప్రభుత్వం ద్వారా ఇన్సూరెన్స్ సౌకర్యంతో పాటు సబ్సిడీపై బోట్లు, వలలను అందజేస్తామని ఎమ్మెల్యే తెలిపారు. గత ప్రభుత్వాల నిర్లక్ష్యానికి భిన్నంగా మత్స్యకారుల శ్రమను గుర్తిస్తున్న ప్రభుత్వం ఇదేనని పేర్కొంటూ, అమలాపురం నియోజకవర్గంలోని మత్స్యకార సోదరులందరికీ తాను ఎల్లప్పుడూ అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టరేట్ ఉన్నతాధికారులు, మత్స్యశాఖ ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు, మత్స్యకార సంఘాల నాయకులు, లబ్ధిదారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

**అగ్నిప్రమాదంలో నష్టపోయిన కౌలు రైతుకు**

# మంత్రి వాసంశెట్టి సుభాష్ ఆర్థిక సాయం



**కే.గంగవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం నియోజక వర్గం కె.గంగవరం మండలం తాళ్లపోడు గ్రామంలో ఇటీవల జరిగిన అగ్నిప్రమాద బాధిత రైతును రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పరామర్శించి అండగా నిలిచారు. ఈ ప్రమాదంలో పంటపొలాల్లో ధాన్యం కాలిపోయి భారీ నష్టం సంభవించిన విషయం తెలుసుకున్న ఆయన బాధిత కౌలు రైతు దొమ్మేటి సత్యనారాయణకు వ్యక్తిగతంగా రూ. 20,000 ఆర్థిక సహాయాన్ని చెక్కు రూపంలో అందజేశారు. ఈ అగ్నిప్రమాదంలో సత్యనారాయణకు చెందిన సుమారు 15 బస్తాల ధాన్యం పూర్తిగా కాలిపోగా విత్తనాల నాగేశ్వరరావు, దొమ్మేటి సత్యనారాయణలకు చెందిన రెండు నీరు తోడుకొనే మోటార్లు కూడా అగ్నికి ఆహుతయ్యాయి. వీటితో పాటు పంటపొలాల్లో మిషన్‌తో కట్టించుకున్న గడ్డి కట్టలు కూడా పూర్తిగా బూడిదయ్యాయి. ఈ నేపథ్యంలో ప్రమాదంలో కాలిపోయిన నీటి మోటార్ల విషయమై మంత్రి సుభాష్ వెంటనే వ్యవసాయ శాఖ అధికారులతో మాట్లాడారు. రైతులకు సబ్సిడీపై కొత్త మోటార్లు మంజూరు అయ్యేలా తగిన చర్యలు తీసుకుంటానని ఆయన హామీ ఇచ్చారు. తీవ్ర నష్టాల్లో ఉన్న సమయంలో మంత్రి సుభాష్ స్వయంగా వచ్చి పరామర్శించి ఆర్థిక సహాయం అందించడం పట్ల బాధిత రైతులు, గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ కృతజ్ఞతలు తెలిపారు. మంత్రి చూపిన మానవత్వం, రైతుల పట్ల ఆయనకున్న బాధ్యతాభావం అభినందనీయమని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కె.గంగవరం మండల తహసిల్దార్ శ్రీరామ ప్రసాద్, ఆర్ ఐ వెంకట్రావు, మండల టీడీపీ అధ్యక్షులు మేడిశెట్టి రవి కుమార్, నియోజకవర్గ రైతు అధ్యక్షులు బలుసు శివప్రసాద్, రవ్వా భూషణం, మండల వ్యవసాయ అధికారి సద్గురు మూర్తితో పాటు పలువురు అధికారులు సొసైటీ అధ్యక్షులు మరియు నాయకులు పాల్గొన్నారు.

# బీజేపీ జిల్లా పదాధికారుల అత్యవసర సమావేశం



**అమలాపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** భారతీయ జనతా పార్టీ డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా శాఖ ఆధ్వర్యంలో జిల్లా పదాధికారుల అత్యవసర సమావేశం మంగళవారం అమలాపురంలోని జిల్లా పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. కార్యక్రమానికి జిల్లా అధ్యక్షుడు అడబాల సత్యనారాయణ అధ్యక్షత వహించగా, రాష్ట్ర అధికార ప్రతినిధి నల్లా పవన్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మే 23, 24 తేదీలలో కిమ్స్ హాస్పిటల్ ఆవరణలో జరగనున్న జిల్లా ప్రశిక్షణ మహా అభియాన్ కార్యక్రమానికి సంబంధించి వసతులు, నగర అలంకరణలు, భోజన సదుపాయాలు తదితర ఏర్పాట్లపై సమావేశంలో చర్చించారు. జిల్లా అధ్యక్షుడు అడబాల సత్యనారాయణ మాట్లాడుతూ వ్యవస్థల ఇన్‌చార్జీలు తమకు కేటాయించిన బాధ్యతలపై ప్రబంధకులతో నిరంతరం ఫోన్ ద్వారా సంప్రదింపులు జరిపి, ప్రతి ఒక్కరూ సమయానికి ఏర్పాట్లలో నిమగ్నమయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. రాష్ట్ర అధికార ప్రతినిధి నల్లా పవన్ కుమార్ మాట్లాడుతూ, ఏడు నియోజకవర్గాల నుంచి ఆహ్వానం అందుకున్న వారందరూ నూటికి నూరు శాతం హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో తమనంపూడి రామకృష్ణారెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి అరిగెల నాని, జిల్లా ఆఫీస్ ఇన్‌చార్జి డి.వి.ఎస్. రాజు, ఉపాధ్యక్షురాలు చిలకమర్రి కస్తూరి, జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి వెంకటేశ్వరరావు, జిల్లా ప్రధాన కార్యదర్శులు కొప్పనాతి దత్తాత్రేయ, సలాది వీరబాబు, జిల్లా కార్యదర్శి కొప్పిశెట్టి అనంతలక్ష్మి, మహిళా మోర్చా అధ్యక్షురాలు యెల్లాన శకుంతల తదితర కార్యకర్తలు పాల్గొన్నారు.

# అనారోగ్యంతో బాధపడుతున్న వ్యక్తికి రూ.10 వేలు ఆర్థిక సహాయం



**కె.గంగవరం, విశ్వ వాయిస్ న్యూస్ :** రామచంద్రపురం నియోజకవర్గం కె.గంగవరం మండలం పేకేరు గ్రామం భీమ్‌నగర్‌కు చెందిన పిట్టా అప్పారావు ఇటీవల అనారోగ్యంతో శస్త్రచికిత్స చేయించుకుని ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు. ఈ విషయం స్థానిక నాయకుల ద్వారా తెలుసుకున్న రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ మానవత్వంతో స్పందించి రూ.10,000 ఆర్థిక సహాయాన్ని అందించారు. మంత్రి సుభాష్ తరఫున గంగవరం మండల టిడిపి అధ్యక్షులు మేడిశెట్టి రవికుమార్, నియోజకవర్గ రైతు అధ్యక్షులు బలుసు శివప్రసాద్, పార్టీ సీనియర్ నాయకులు రవ్వా భూషణం తదితరులు బాధితుడు పిట్టా అప్పారావు ఇంటికి వెళ్లి చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రజలకు ఎలాంటి కష్టం వచ్చినా మంత్రి సుభాష్ అండగా నిలుస్తూ సేవా కార్యక్రమాలు కొనసాగిస్తున్నారని తెలిపారు. అనారోగ్యంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న సమయంలో మంత్రి స్పందించి సహాయం అందించడం పట్ల అప్పారావు కుటుంబ సభ్యులు, స్థానిక ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

**పెట్రోల్, డీజిల్ ధరల పెంపుపై**

# వైసీపీ నిరసనలు హాస్యాస్పదం

**రోడ్లు వెయ్యకుండా రోడ్డు టాక్స్ పేరుతో సెస్ వసూలు చేసిన ఘనత జగన్‌ది : ఎమ్మెల్యే బండారు**




**రావులపాలెం, విశ్వం వాయిస్ న్యూస్ :** పెట్రోల్, డీజిల్ ధరల పెంపుపై నిరసనల పేరుతో వైసిపి నాయకులు రిక్షాలు తొక్కి ధర్నాలు చేయడం హాస్యాస్పదంగా ఉందని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు వ్యాఖ్యానించారు. మంగళవారం రావులపాలెం క్యాంప్ కార్యాలయంలో ఆయన ఈ అంశంపై మీడియాతో మాట్లాడారు. 2019 నుంచి 24 వరకు జగన్ పాలనలో డీజిల్ రేట్లు 22 నుంచి 27 శాతానికి, పెట్రోల్ రేట్లు 31 నుంచి 35 శాతానికి పెరిగాయన్నారు. వైసీపీ పాలన ఐదేళ్లలో ఒక్క లీటర్ పెట్రోల్ ధర 2019 తో పోలిస్తే 41 రూపాయలు పెరిగిందన్నారు. అప్పట్లో కేంద్ర ప్రభుత్వం పెంచిన ధరలతో పాటు వైసిపి ప్రభుత్వం సైతం సెస్ పేరుతో పెట్రోల్ ధరల భారాన్ని ప్రజలపై వేసిందన్నారు. ఈ సందర్భంగా అప్పట్లో తెలుగుదేశం పార్టీ నిరసన తెలియజేస్తే అప్పటి మంత్రి కొడాలి నాని ఏకవచనంతో మాట్లాడుతూ.. పెట్రోల్, డీజిల్ ధరలు పెంపుపై నిరసనలు తెలియజేస్తే వెళ్ళి కేంద్రం వద్ద చేయాలి కానీ రాష్ట్రంలో చేస్తారా? అంటూ దుర్భాషలాడిన వీడియోలు ఇప్పుడు హల్చల్ చేస్తున్నాయన్నారు. ఇప్పుడు పెరిగిన ధరలు ఎవరు పెంచారో వైసీపీ నాయకులు గమనించకుండానే రిక్షాలు తొక్కడం సరైనదేనా? అని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఈ రెండేళ్లలో ఒక్క రూపాయి కూడా పెట్రోల్ ధర గాని డీజిల్ ధర కాని పెంచలేదన్నారు. వైసిపి ప్రభుత్వ హయాంలో దేశంలోనే అత్యధికంగా పెట్రోల్,డీజిల్ రేట్లు మన రాష్ట్రంలో పెరిగాయన్నారు. ఒక్క రోడ్డు కూడా నిర్మించకుండా, గుంతలయినా పూడ్చకుండా రోడ్ డెవలప్మెంట్ సెస్ పేరుతో పెట్రోల్, డీజిల్ పై పన్నులు వేసిన ఘనత జగన్మోహన్ రెడ్డికి దక్కుతుందన్నారు. పక్క రాష్ట్రాలతో పోల్చితే అప్పట్లో మన రాష్ట్రంలోనే లీటరుకు రూ.5నుంచి రూ.10 వరకు ధరలు అధికంగా ఉండేవన్నారు. అటువంటిది ఇప్పుడు డ్రామాలు చేయడం ప్రజలు గమనిస్తున్నారన్నారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా ఇంధన ధరలు ఎందుకు పెరిగాయో ప్రజలు అర్థం చేసుకున్నారన్నారు. పశ్చిమాసియాలో ఇరాన్, ఇజ్రాయిల్, అమెరికా మధ్య జరిగిన యుద్ధం కారణంగా అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధరలు పెరగడంతో పెట్రోల్, డీజిల్ ధరలు పెరిగాయన్నారు. ప్రతిపక్షంగా ఏదో తమ ఉనికి కాపాడుకోవడం కోసం ఇక్కడి నాయకులు హడావుడి చేస్తున్నారన్నారు. ఈ అంశాలన్నీ ప్రజలు పరిశీలిస్తున్నారన్నారు. ఇప్పటికైనా వైసీపీ నాయకులు డ్రామాలు కట్టి పెట్టాలన్నారు. లేకుంటే వారు మరింతగా ప్రజల్లో పలచన అయ్యే అవకాశం ఉందన్నారు.

**పోటాపోటీగా రికార్డులు తిరగరాస్తూ సాగుతున్న**

# జాతీయ స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలు

**5వ రోజు సాయంత్రం విజేతలకు బహుమతులు అందజేసిన ప్రముఖులు**




**అమలాపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** అమలాపురంలోని సత్యనారాయణ గార్డెన్స్‌లో ఎంపీ జి.ఎం.హరీష్ బాలయోగి ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ హెల్త్ అండ్ ఫిట్నెస్ క్లబ్ అసోసియేషన్ సంయుక్త నిర్వహణలో జరుగుతున్న 15వ జాతీయ స్థాయి సబ్ జూనియర్, జూనియర్ మెన్ అండ్ ఉమెన్స్ క్లాసిక్ పవర్ లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్‌లు ఉత్సాహభరితంగా కొనసాగుతున్నాయి. దేశంలోని 29 రాష్ట్రాల నుంచి వందలాది మంది పవర్ లిఫ్టింగ్ క్రీడాకారులు పాల్గొని తమ ప్రతిభను చాటుతున్నారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ చెల్లి అశోక్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పవర్ లిఫ్టింగ్ అనేది కేవలం బరువులు ఎత్తే క్రీడ మాత్రమే కాకుండా క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, పట్టుదల, మానసిక ధైర్యానికి ప్రతీక అని పేర్కొన్నారు. అనంతరం 93 కేజీల మెన్, 105 కేజీల మెన్ జూనియర్, సబ్ జూనియర్ విభాగాలు, అలాగే 69 కేజీలు, 76 కేజీల ఉమెన్స్ జూనియర్, సబ్ జూనియర్ విభాగాల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ చిట్టూరి శ్రీనివాసరావు, జిల్లా తెలుగు యువత ఉపాధ్యక్షుడు మద్దాల రాజా, స్టేట్ టీఎన్ఎస్ఎఫ్ సెక్రటరీ నక్క సునీల్, స్టేట్ తెలుగుదేశం పార్టీ ఎస్సీ సెల్ అధికార ప్రతినిధి గడ్డం సింహాసింహ, తెలుగుదేశం సీనియర్ నాయకుడు చిల్లా పురుషోత్తం, హెచ్ఆర్డీ మెంబర్ నేదునూరి వీర్రాజు, మండల పార్టీ అధ్యక్షుడు బోనం బాబు, జిల్లా తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షుడు మొల్లేటి శ్రీను, తెలుగుదేశం పార్టీ లీగల్ సెల్ ప్రెసిడెంట్ బడుగు జోగేష్, జిల్లా ఎస్సీ సెల్ అధికార ప్రతినిధి చిట్టుగుల కిషోర్, తాడి నరసింహారావు, వెలగట్ల జగదీష్, ఆశెట్టి ఆదిబాబు, గారపాటి చంద్రశేఖర్, దొమ్మేటి వెంకటరమణ, పప్పుల శ్రీరామ్ మూర్తి పాల్గొన్నారు. పోటీల విజేతల వివరాలను ఆర్గనైజింగ్ సెక్రటరీ కంకిపాటి వెంకటేశ్వరరావు వెల్లడించారు.

# రామచంద్రాపురం పాత తహసిల్దార్ కార్యాలయాన్ని పరిశీలించిన జేసీ



**రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** రామచంద్రాపురంలో అదనపు సీనియర్ సివిల్ జడ్జి కోర్టు ఏర్పాటుకు సంబంధించి పాత తహసిల్దార్ కార్యాలయాన్ని జిల్లా జాయింట్ కలెక్టర్ వైఖోమ్ నైడియా దేవి ఐ.ఏ.ఎస్ మంగళవారం సాయంత్రం పరిశీలించారు. రామచంద్రాపురంలో నూతనంగా అదనపు సీనియర్ సివిల్ జడ్జి కోర్టు మంజూరైన నేపథ్యంలో కక్షిదారుల సౌకర్యార్థం ప్రస్తుత కోర్టుల ప్రాంగణంలోనే ఉన్న పాత తహసిల్దార్ కార్యాలయంలో ఈ కొత్త కోర్టును ఏర్పాటు చేయడానికి అనుమతి ఇవ్వాలని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కోటిపల్లి లావరాజు ఆధ్వర్యంలో న్యాయవాదులు జిల్లా జడ్జి గంధం సునీతను కోరారు. ఈ విజ్ఞప్తి మేరకు జాయింట్ కలెక్టర్ మిద్యా దేవి పాత కార్యాలయాన్ని స్వయంగా పరిశీలించి, దీనిపై తక్షణమే రిపోర్టు పంపాలని మండల సర్వేయర్‌ను ఆదేశించారు. ఈ సందర్భంగా కోర్టు ఏర్పాటుకు అనుమతి ఇవ్వాలని బార్ అసోసియేషన్ ప్రతినిధులు న్యాయవాదులతో కలిసి జాయింట్ కలెక్టర్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో ఏ. సరళావతి, తహసిల్దార్ మృత్యుంజయరావు మరియు పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

# ద్రాక్షారామం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సందర్శన



**ద్రాక్షారామం, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ద్రాక్షారామంను జిల్లా మలేరియా అధికారి డాక్టర్ కె.ఎన్. శ్రీనివాస్ గారు విజిట్ చేసినారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జ్వరం సంబంధిత కేసులకు మలేరియా, డెంగ్యూ రక్త పరీక్షలు తప్పనిసరిగా నిర్వహించాలని ఇందుకోసం లేబరేటరీ నందు టెస్టింగ్ కిట్లు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంచుకోవాలని అధికారులను ఆదేశించారు. గత సంవత్సరంలో డెంగ్యూ వ్యాధి నమోదైన ప్రాంతాలను ప్రత్యేకంగా గుర్తించి అక్కడ యాంటీ లార్వల్ ఆపరేషన్లు నిర్వహించాలని సూచించారు. అన్ని సచివాలయాల పరిధిలోనూ విధిగా 'ఫ్రైడే డ్రై డే' కార్యక్రమాన్ని నిర్వహించాలని, ప్రజలు తమ ఇంటి పరిసరాలలో నీటి నిల్వలు లేకుండా చూసుకునేలా అవగాహన కల్పించడంతో పాటు దోమలు పుట్టకుండా మరియు కుట్టకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. హాస్టళ్లలో దోమల సీజన్ (ముఖ్యంగా వర్షాకాలం) ప్రారంభం కావడానికి ముందుగానే స్ప్రేయింగ్ చేయడం అనేది జాతీయ కీటక జనిత వ్యాధి నియంత్రణ కార్యక్రమం యొక్క అత్యంత కీలకమైన నిబంధన అని గుర్తుచేశారు. ఈ సంవత్సరం కూడా రామచంద్రపురం మండలంలోని హాస్టల్స్ లోనూ గురుకుల పాఠశాలల్లోనూ పిల్లలు చేరడానికి ముందుగానే ఇండోర్ స్ప్రేయింగ్ చేయించాలని అలాగే విద్యార్థులు హాస్టల్లో చేరకముందే అక్కడ పరిసర ప్రాంతాలలో యాంటీ లార్వల్ ఆపరేషన్లు చేపట్టాలని స్పష్టం చేశారు. అనంతరం ఆయన లేబరేటరీను సందర్శించి పరీక్షల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రత్న సుధ, డాక్టర్ సందీప్ నాయుడు, డివిజనల్ సూపర్వైజర్ జి. కమల్ శేషు, సూపర్వైజర్లు శ్రీనివాస్, వరలక్ష్మి, ల్యాబ్ టెక్నీషియన్, హెల్త్ అసిస్టెంట్లు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

# స్వర్ణకారుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా : మంత్రి వాసంశెట్టి సుభాష్



**రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రజల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా తాము ప్రజా దర్బార్ నిర్వహిస్తున్నామని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పేర్కొన్నారు. రామచంద్రపురంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార విభాగం (ప్రజా దర్బార్)లో ఆయన పాల్గొని, ప్రజల నుండి 40 అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా రామచంద్రపురం పట్టణ స్వర్ణకారుల సంఘం నాయకులు మంత్రిని కలిసి తమ వృత్తిపరమైన సమస్యలపై ఒక వినతిపత్రాన్ని అందజేశారు. స్వర్ణకారుల ఉపాధి, జీవనోపాధి, ప్రభుత్వ పథకాల అమలు బ్యాంకు రుణాల మంజూరు కార్మిక సంక్షేమ బోర్డు ద్వారా అందే ప్రయోజనాలు వంటి పలు అంశాలను వారు మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యంగా స్వర్ణకారులకు ప్రత్యేక గుర్తింపు కార్డులు మంజూరు చేయడం కార్మిక సంక్షేమ పథకాలను విస్తృతంగా అమలు చేయడం దుకాణాల విస్తరణకు రుణ సదుపాయాలు కల్పించడం, యువ స్వర్ణకారుల కోసం ప్రత్యేక శిక్షణా కేంద్రాలను ఏర్పాటు చేయడంతో పాటు ఈఎస్ఐ, బీమా వంటి సామాజిక భద్రతా సౌకర్యాలు కల్పించాలని వినతిపత్రంలో కోరారు. అలాగే స్వర్ణకారుల కుటుంబాలకు విద్య, వైద్యం, గృహ నిర్మాణ రంగాల్లో ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని విజ్ఞప్తి చేశారు. స్వర్ణకారుల సమస్యలపై మంత్రి సానుకూలంగా స్పందిస్తూ సంప్రదాయ వృత్తులను కాపాడేందుకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. వారి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి పూర్తి స్థాయిలో కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అలాగే ప్రజా దర్బార్‌లో వచ్చిన ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి త్వరితగతిన పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రామచంద్రపురం పట్టణ స్వర్ణకార సంఘం నాయకులు చింతాడ శ్రీనివాస్, తాళాబత్తుల మురళి కృష్ణ, దార్ల శ్రీనివాస్, పొడగట్లపల్లి శ్రీను, త్రిపురారి సుబ్రహ్మణ్యం, కోరుకొండ అచ్యుత రామాచారి, కూటమి పార్టీ నాయకులు కట్టా నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మరిన్ని వార్తా విశేషాలకై... www.viswamvoice.com



# 'మత్స్యకార సేవ' ద్వారా సహాయం పంపిణీ

## కాకినాడ జిల్లాలో 24,930 మందికి 20 వేల చొప్పున 49.86 కోట్లు బ్యాంకు ఖాతాలలో జమ



**కాకినాడ కలెక్టరేట్, విశ్వం వాయిస్ న్యూస్ :** మత్స్యకార సేవా కార్యక్రమం ద్వారా వరుసగా రెండో ఏడాది కాకినాడ జిల్లాలో 24,930 మంది మత్స్యకారులకు వేట నిషేధ భృతి నిమిత్తం 49 కోట్ల 86వేల మేర లబ్ధి చేకూరిందని జిల్లా కలెక్టర్ ఎంఎన్ హారేంధిర ప్రసాద్ పేర్కొన్నారు. 2026-27 సంవత్సానికి మత్స్యకారులకు వేట నిషేధ కాలంలో జీవన భృతి కొరకు రాష్ట్ర ప్రభుత్వం 20 వేల చొప్పున అందించే ఆర్థిక సహాయ పంపిణీని మంగళవారం నెల్లూరు జిల్లా తుమ్మల పెంటలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు ఆన్లైన్ ద్వారా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలలో నేరుగా జమ చేసారు. ఈ కార్యక్రమంలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కాకినాడ కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ ఎంఎన్ హారేంధిర ప్రసాద్, ఎమ్మెల్సీలు కర్రి పద్మశ్రీ, పేరాబత్తుల రాజశేఖరం, డీసీసీబీ చైర్మన్ తుమ్మల రామస్వామి, కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు (కొండబాబు), మత్స్యకార నాయకులు, మత్స్యశాఖ అధికారులతో కలిసి పాల్గొన్నారు. అనంతరం కాకినాడ జిల్లాలో మత్స్యకార సేవాలో కార్యక్రమం కింద అర్హులైన 24, 930 లబ్ధిదారులకు 49.86 కోట్లు మెగా చెక్కును పంపిణీ చేశారు. అలాగే సీవీడ్ కల్టివేషన్ పైలట్ ప్రాజెక్టుకు ఎంపికైన తొండంగి మండలం దానవాయిపేటకు చెందిన యజ్జల లక్ష్మి, యు.కొత్తపల్లి మండలానికి చెందిన చింతకాయల పోలేశ్వరిలకు అనుమతి లేఖలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ హారేంధిర ప్రసాద్ మాట్లాడుతూ మత్స్యకార సేవలో కార్యక్రమం ద్వారా కాకినాడ జిల్లాలో 24,930 మంది మత్స్యకారులకు రూ.49.86 కోట్ల వేట నిషేధ భృతి కింద లబ్ధి చేకూరినందుకు జిల్లా మత్స్యకారుల తరపున రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్లకు ఆయన ధన్యవాదాలు తెలియజేశారు. 2026-27 సంవత్సరంలో జిల్లాలో 4,578 బోట్లకు 91.48 కింద ప్రభుత్వం రూ.8.23 కోట్లు మంజూరు చేసిందన్నారు. ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ మాట్లాడుతూ వేట నిషేధ కాలం రెండు నెలలపాటు మత్స్యకారులు ఎవరు సముద్రంలో వేటకు వెళ్లవద్దని ఆమె సూచించారు. నిషేధ భృతి కింద రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న రూ.20 వేలను మత్స్యకారులు దుబారా చేయకుండా కుటుంబ అవసరాలు, పిల్లల భవిష్యత్తుకు ఉపయోగించుకోవాలని ఎమ్మెల్సీ తెలిపారు. మరో ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖరం మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మత్స్యకారులకు వేట నిషేధి కాలంలో అందిస్తున్న నిషేధ భృతి కింద అందిస్తున్న రూ.20 వేలు ఆర్థిక సహాయం కొంత ఉపశమనం మాత్రమేనని అన్నారు. ప్రాణాలకు తెగించి నిత్యం సముద్రంపై వేటాడుతూ స్వచ్ఛమైన సముద్ర ఉత్పత్తులు ప్రజలకు అందిస్తున్న మత్స్యకారులకు కూటమి ప్రభుత్వం పక్క గృహాలు, వలలు, ఐస్ బాక్సులు, ఇతర ఉపకరణాలుతో పాటు మెకానైజడ్ బోట్లు, ద్విచక్ర వాహనాలు వంటివి రాయితీపై అందిస్తుందని, ఈ అవకాశాలను మత్స్యకారులు సద్విని చేసుకోవాలని ఆయన తెలిపారు. డీసీసీబీ చైర్మన్ తుమ్మల రామస్వామి మాట్లాడుతూ కాకినాడ జిల్లాలో మొత్తం 119 కిలోమీటర్ల కోస్తా తీర ప్రాంతంలో 23 లాండింగ్ సెంటర్లలో 51 మత్స్యకార గ్రామాల్లో ప్రజలు జీవనోపాధి పొందుతున్నారన్నారు. కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వేట నిషేధ కాలంలో జీవనోపాధి కోల్పోయిన మత్స్యకారులను ఆదుకునే లక్ష్యంతో మత్స్యకార సేవలో కార్యక్రమం కింద నిషేధ భృత్తిని అందించడంతో రాష్ట్రమంతట పండుగ వాతావరణ నెలకొందన్నారు. నిర్మాణ దశలో ఉన్న ఫిషింగ్ హార్బర్ పనులు వేగవంతం చేసి సకాలంలో అందుబాటులోకి వచ్చేలా అధికారులు ప్రత్యేక కృషి చేయాలన్నారు. అదేవిధంగా కుంభాభిషేకం మిని హార్బర్, కుంభాభిషేకం బ్రిడ్జి పనులపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. భవిష్యత్తులో మత్స్యకారులకు సమస్యలను పరిష్కారించేందుకు కూటమి ప్రభుత్వం ప్రత్యేకంగా కృషి చేస్తున్నట్లు ఈ సందర్భంగా ఎమ్మెల్యే కొండబాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీ మత్స్యకార కోపరేటివ్ ఫెడరేషన్ వైస్ చైర్మన్ బలసాడి రంగారావు, అగ్నికులక్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ పి రాజు, కుమారస్వామి, అప్పసడ డైరెక్టర్ వంక కొండబాబు, ఫిషింగ్ బోట్స్ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సంగాని నాగేశ్వరరావు, తుమ్మల రమేష్, ఒమ్మి బాలాజీ, జిల్లా మత్స్య శాఖ అధికారి కే కృష్ణారావు, డిఆర్డిఏ పిడి జి.శ్రీనివాస్, ఎడీఎఫ్ ఎం.లావణ్య, ఎఫ్డీవోలు గోపి, రామకృష్ణ, అనురాధ, నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

# సచివాలయం పునర్నిర్మాణ ప్రారంభోత్సవం



**కాకినాడ రూరల్, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ రూరల్ మండలం వలసపాకల గ్రామంలో సుమారు 6 లక్షల రూపాయలు పంచాయతీ నిధులతో పునః నిర్మాణం చేసిన సచివాలయం -2 ను కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ గ్రామస్తులు, కుటమి నాయకులు, మండల అధికారుల సమక్షంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన రాష్ట్ర సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ వాళ్ళిద్దరి సహకారంతో ఈరోజు వలసపాకలలో పునః నిర్మాణం చేసిన సచివాలయం -2 ను ప్రారంభంచేసుకున్నామని, మౌలిక వసతుల కల్పించాలి అనే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం పని చేస్తోంది అని.. ఈ వలస పాకల గ్రామానికి మా కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత సుమారుగా 2 కోట్ల 7 లక్షలు రూపాయలతో 22 సీసీ రోడ్లు నిర్మించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమినాయకులు చిక్కాల రామచంద్ర రావు, నూరుకుర్తి వెంకటేశ్వర రావు, రంభాల వెంకటేశ్వర రావు, చిలుకూరి రామ్ కుమార్, నందిపాటి అనంతలక్ష్మి త్రిమూర్తులు, జీని శ్రీనివాస్, శిరంగు శ్రీనివాస్, కేసుబోయిన ఏడుకొండలు, వల్లూరి రాజా, తాటికాయలవీరబాబు, రాందేవు సీతయ్య దొర, గింజాల శ్రీనివాస్, మాదారపు తాతాజీ, మాలతి, మండల అధికారులు, సచివాలయ సిబ్బంది, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

# శంఖవరంలో 'కిషోరి వికాసం' సమ్మర్ క్యాంపెయిన్



**శంఖవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ జిల్లా మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ సి.హెచ్.లక్ష్మి ఆదేశాల మేరకు ప్రత్తిపాడు నియోజకవర్గం లోని శంఖవరం ఐసిడిఎస్ ప్రాజెక్ట్ సీడీపీఓ. పర్వత వెంకటలక్ష్మి ఆధ్వర్యంలో శంఖవరంలోని ఎస్సీ కాలనీ రామాలయంలో "కిషోరి వికాసం" సమ్మర్ క్యాంపెయిన్ను మంగళవారం నిర్వహించారు. జిల్లా బాలల పరిరక్షణ విభాగం సంరక్షణ అధికారిణి జె.విజయ, సెక్టార్ సూపర్వైజర్ బి.వెంకటరజని సంయుక్తంగా కౌమార బాలికలు, కౌమార బాలురకు వేర్వేరుగా అవగాహనా కార్యక్రమాలను నిర్వహించారు. 11-18 సంవత్సరాల వయస్సు కౌమార బాల, బాలికలకు సరైన మార్గదర్శకత్వం అందించడం, వారి ఆత్మ విశ్వాసాన్ని పెంపొందించడం, సమాజంలో బాధ్యతాయుత పౌరులుగా ఎదగడానికి అవగాహన కల్పించడం ద్వారా వారికి ప్రభుత్వ పరంగా సహాయ పడటం ప్రధాన లక్ష్యంతో జిల్లా మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో "కిషోరి వికాసం" వేసవి సమావేశాలను మే 1 నుండి జూన్ 10వ తేదీ వరకూ నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ సమావేశాల్లో ఆరోగ్యం, పోషణ, వ్యక్తిత్వ వికాసం, విద్య ప్రాముఖ్యత, లైంగిక, ప్రజనన ఆరోగ్యం, బాల్య వివాహాల నివారణ, బాలల సంరక్షణ వంటి అంశాలపై వార్డులు, గ్రామ స్థాయిల్లో ప్రత్యేక అవగాహనా కార్యక్రమాలను చేపడతా అన్నారు. కిషోరి దశలో బాలికలకు సరైన మార్గదర్శకత్వం, ఆరోగ్య పరిరక్షణ, విద్య, నైపుణ్యాల అభివృద్ధి ఎంతో అవసరమని తెలిపారు. ఈ దశలో సమగ్ర అభివృద్ధి సాధిస్తే భవిష్యత్తులో వారు ఆత్మవిశ్వాసంతో సమాజంలో ముందుకు సాగడానికి ఈ సమావేశాల ద్వారా తర్ఫీదు ఇస్తామని పేర్కొన్నారు. నేటి సెషన్-6లో భాగంగా ఉచిత నిర్బంధ విద్యాహక్కు చట్టం, కార్మిక చట్టం, బాల్య వివాహ నిరోధక చట్టం - 2006, గృహ హింస నిరోధక చట్టం, వరకట్న నిషేధ చట్టం వంటి బాలల చట్టాలపై కౌమార బాలికలు, బాలురకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

# శంఖవరం వీఆర్వో సీతారాంపై రెండోసారి కొనసాగిన విచారణ...!

## ఫిర్యాదీలు, వీఆర్వో వాంగ్మూలాలు నమోదు - అక్రమ ఇంటి నిర్మాణాన్ని పరిశీలించిన కలెక్టరుకు సమర్పణకు విచారణకు నివేదిక - విచారణకు విలేకరికి అనుమతి నిరాకరణ



**శంఖవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** భేతాళ కథలోని పట్టు వీడని విక్రమార్కుడిలా కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గంలోని మండల కేంద్రం శంఖవరంలోని వివిధ ప్రభుత్వ శాఖల్లోని అవినీతిని వెలికి తీసేందుకు సామాజిక స్వయం సేవా కర్త మేకల కృష్ణ చేస్తున్న అలుపెరుగని పోరాటం జీవనది నిరంతర ప్రవాహంలా కొనసాగుతూనే ఉంది. ఒక్కో సారి ఒక్కో ప్రభుత్వ శాఖపై.. ఒక సారి... అంతకుపైబడి... విచారణలు ఒకదాని వెంట మరొకటి కొనసాగుతూనే ఉన్నాయి. వీటిలో ఏ ఒక్కటీ ఇంకా ఓ కొలిక్కి రాలేదు. ఈ క్రమంలో శంఖవరం వీఆర్వో తిరుమలనీడి సీతారామ్ పై మేకల కృష్ణ, బొమ్మిడి సత్యనారాయణ, పర్వత రామకృష్ణ, బొర్రా వెంకట సత్యనారాయణ, రేలంగి వీరవెంకట సత్యనారాయణ సంయుక్తంగా 20.04.2026 న శంఖవరం తహశీల్దారుకు సమర్పించిన ఫిర్యాదు మేరకు ఏప్రిల్ 25 శనివారం శంఖవరం తాహసిల్దార్ కార్యాలయంలో మధ్యాహ్నం 2-3.30 గంటల మధ్య జిల్లా స్పెషల్ డిప్యూటీ కలెక్టరు జి.రత్నకుమారి విచారించారు. దీనికి కొనసాగింపుగా మంగళవారం ఉదయం 11.30 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకూ విచారించారు. తొలుత తాహసిల్దార్ కార్యాలయంలో ఫిర్యాదు దారులు, ఆరోపణలను ఎదుర్కొంటున్న వీఆర్వో సీతారాంను విడి విడిగా విచారించి వారి వాంగ్మూలాలను నమోదు చేశారు. అనంతరం సాయంత్రం వైష్ణవ మాన్యం కాలనీలో విచారణను కొనసాగించారు. శంఖవరం శ్రీ సీతారామస్వామి ఆలయ దేవస్థానంనకు చెందిన వైష్ణవ మాన్యం కాలనీ సర్వే నెంబరు 8/2 లోని నివేశన స్థల పట్టాదారుల్లో ఒకరైన, 412 నెంబరు పట్టా పొందిన, బిసి. సామాజిక (మంగలి) వర్గానికి చెందిన అల్లూరి సత్తిబాబు భార్య సుబ్బలక్ష్మిని తన భూమిని నుంచి 8 సంవత్సరాల క్రితమే ప్రభుత్వ ఉద్యోగ అధికారంతో భయపెట్టి వెళ్ల గొట్టి, ఆ స్థలంలో వీఆర్వో తిరుమలనీడి సీతారామ్ తన తల్లి ఆదిలక్ష్మి పేరున ఇంటిని అక్రమంగా నిర్మించారన్న అభియోగం మేరకు ఆ ఇంటిని జిల్లా స్పెషల్ డిప్యూటీ కలెక్టరు పరిశీలించారు. ఈ ఇంటి స్థలం జగనన్న ఇండ్ల కాలనీ పథకంలో మంజూరు కాకపోయి నప్పటికీ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ హయాంలో ఆ ఇంటికి ఓ ఉప సర్పంచ్ దన్నుతో పంచాయతీలో ఇంటి పన్నును సృష్టించి, ఆపై రెవిన్యూశాఖ నుంచి నివేశన స్థల పట్టాను పొంది, గృహ నిర్మాణ పథకంలో ఇంటిని నిర్మించి, దానిని వన్ టైం సెటిల్మెంట్ (ఓటిఎస్) పథకంలో రిజిస్ట్రేషన్ చేయించి, గృహ నిర్మాణ పథకం రుణాన్ని మాఫీ చేయించుకున్నారన్న విషయాలను కూడా విచారణ అధికారిణి దృష్టికి తీసుకొచ్చారు. ఇదే కాలనీలో నివేశన స్థల పట్టాదారులను వారి స్థలాల నుంచి వెళ్ళగొట్టేందుకు వారి పాకలు, పందిళ్ళను నేరుగా వీఆర్వో సీతారాం పలు మార్లు పీకేసారన్న ఆరోపణలకు సంబంధించి 14 మంది బాధితుల్లో అందుబాటులో ఉన్న 8 మందినీ జిల్లా స్పెషల్ డిప్యూటీ కలెక్టరు జి.రత్నకుమారి విచారించి వారి వాంగ్మూలాలను నమోదు చేశారు. తాహసిల్దార్ కార్యాలయంలోని విచారణలో బాధితుల పక్షాన నేరుగా పాల్గొనేందుకు విలేఖరి జక్కల నాగసత్యనారాయణకు తొలుత అనుమతి నిరాకరించి నప్పటికీ చివరిలో మాత్రం అనుమతి ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నివేదికను జిల్లా కలెక్టర్ కు సమర్పిస్తామని వెల్లడించారు.

# కాకినాడలో గోమాతలు మృతి మిస్సింగ్‌పై బిజెపి నేతలు ఆరా



**కాకినాడ రూరల్, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ రూరల్ రమణయ్యపేటలో ఉన్న ప్రభుత్వ జంతు హింస నివారణ సంఘం ఆధ్వర్యంలో ఉన్నటువంటి మూగ జీవాలు ప్రతిరోజు మృతి చెందుతున్నట్లు మరియు కొన్ని మిస్సింగ్ అవుతున్నట్లు గ్రహించిన కాకినాడ బిజెపి నాయకులు , హిందువుల సంఘం నాయకులు ఆ ప్రదేశానికి వచ్చి ఎందుకు ఆవులు మృతి చెందుతున్నాయి అని అడగగా మెయింటినెన్స్ చేసే టీం మేనేజింగ్ మరియు వర్కర్స్ చెప్పే సమాధానం ఎక్కువగా ఆవులు ఉండటం వలన ఒకదానికి ఒకటి గుద్దుకుని చనిపోతున్నట్లు వివరణ ఇచ్చారు. అయితే గతంలో 250 ఆవులు ఉన్నట్లు గుర్తించారు. ప్రస్తుతం 150 ఆవులు మాత్రమే ఉన్నట్టు గుర్తించారు. ఈ విషయంలో కాకినాడ ప్రభుత్వ అధికారులు చాలా లోతుగా విశ్లేషణ చేసి హిందువులు దైవంగా భావించి పూజించే గోమాతలను రక్షించవలసిందిగా, వేసవి ఎండలలో పశువులకు కావలసిన నీరును వాటికి అందించవలసిందిగా, పశుగ్రాసమైన గడ్డి ఉత్పత్తులను ఎప్పటికప్పుడు వాటి ఆహారంగా అందించాలని కోరారు. వాటికి నీడ నిమిత్తం షెడ్లను ఏర్పాటు చేశారని అయితే గోవుల సంరక్షణకు ఉన్నటువంటి షాపుల ద్వారా వచ్చే ఆదాయం ఏమవుతుందని నిలదీశారు. ప్రస్తుతానికి షాపుల ద్వారా ఎటువంటి ఆదాయం వస్తాలేదని, ప్రభుత్వం ఎందుకు వాళ్ల దగ్గర నుండి రెంట్ వసూలు చేయలేకపోతున్నారని నిలదీశారు. ఈ విషయంలో ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. మా నాయకుల తరఫున ప్రభుత్వానికి ఒక నివేదిక అందిస్తామని తెలిపారు. ఈ విచారణ నిమిత్తం జిల్లా బిజెపి పార్టీ మాజీ అధ్యక్షులు చిలుకూరి రామ్ కుమార్, రంబాల వెంకటేశ్వరరావు, పితాని లీల, పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

# మాతృమూర్తి వర్ధంతికి ప్రతి సంవత్సరం అన్నదానం ఏర్పాటు



**కాకినాడ రూరల్, విశ్వం వాయిస్ న్యూస్ :** సేవా కార్యక్రమాలకు పెట్టింది పేరు అయినా అన్నపాల ఆంజనేయులు రెడ్డి మాతృమూర్తి అప్పల నరసమ్మ వర్ధంతి సందర్భంగా సుమారు 150 మందికి అన్నదానం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న పలువురు ఆయనను అభినందించారు. ఎవరి దగ్గర రూపాయి తీసుకోకుండా తన సొంత ఖర్చులతో ప్రతి సంవత్సరం సుమారు 26 సంవత్సరాల నుండి వేసవికాలంలో మజ్జిగ చలివేంద్రాలను ఏర్పాటు, మంచినీటి చలివేంద్రాలను, పక్షులకు ప్రత్యేకంగా ఆహార ధాన్యాలను, ముఖ్యంగా పేద విద్యార్థులకు తగిన సహాయ సహకారాలు అందిస్తారని పలువురు తెలిపారు.

## అగ్రికల్చర్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ ఫండ్ పథకం కింద

# గొడౌన్ల నిర్మాణాలను పూర్తి చేయాలి

## అధికారులను ఆదేశించిన జిల్లా కలెక్టర్



**కాకినాడ కలెక్టరేట్, విశ్వం వాయిస్ న్యూస్ :** అగ్రికల్చర్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ ఫండ్ పథకం క్రింద జిల్లాలో ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల ద్వారా చేపట్టిన గొడౌన్ల నిర్మాణాలను వచ్చే జూలై మాసాంతంలోపు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఎం. ఎన్. హరీంధిర ప్రసాద్ అధికారులను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం కలెక్టరేట్ కోర్టు హాలులో ఆయన, జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్ తో కలిసి సహకార, మార్కెటింగ్, డ్వామా, జిల్లా పరిషత్, పపంచాయితీరాజ్, ట్రాన్స్కో, ఆర్డబ్ల్యూఎస్ అధికారులతో సమావేశం నిర్వహించి, ఏఐఎఫ్ పథకం క్రింద గొడౌన్ల నిర్మాణ ప్రగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల ద్వారా ఒక్కక్కటి 40 లక్షలు అంచనాతో 23 గొడౌన్ల నిర్మాణం చేపట్టగా, ఇప్పటి వరకూ 3 నిర్మాణాలు పూర్తయ్యాయని, మరో 14 నిర్మాణాలు వివిధ దశలో ఉన్నాయన్నారు. పురోగతిలో ఉన్న గొడౌన్లు జూలై నెలాఖరులోగా పూర్తి చేసి వినియోగం లోకి తేవాలన్నారు. పూర్తయిన గొడౌన్లకు జిల్లా పరిషత్ నిధులతో విద్యుత్, త్రాగనీటి వసతులు కల్పించాలని జడ్పీ సిఈఓ కు సూచించి, ఇందుకు అవసరమైన అంచనాలనూ సిద్ధం చేయాలని ట్రాన్స్కో, ఆర్డబ్ల్యూఎస్ అధికారులను ఆదేశించారు. అలాగే డ్వామా ద్వారా ఉపాధి హామీ పథకం ద్వారా అవసరమైన గొడౌన్లకు అప్రోచ్ రోడ్లు అభివృద్ధి చేయాలని సూచించి, పనుల అంచనాలను సిద్ధం చేయాలని పంచాయితీరాజ్ అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా సహకార అధికారి బి. శ్రీనివాసరెడ్డి, జడ్పీ సి ఈ ఓ వివివిఎస్ లక్ష్మణరావు, డ్వామా పిడి ఎస్. మధుసూధన్, మార్కెటింగ్, పంచాయితీరాజ్, ట్రాన్స్కో, ఆర్డబ్ల్యూఎస్, పాక్ సొసైటీల ప్రతినిధులు పాల్గొన్నారు.

# దళితుల ఆత్మ గౌరవాన్ని దెబ్బతీసిన వైసీపీ పాలన

## వీధి సుబ్రహ్మణ్యం సంస్మరణలో మండిపడ్డ ఎమ్మెల్యే కొండబాబు



**కాకినాడ సిటీ, విశ్వం వాయిస్ న్యూస్ :** దళితుల మేనమామ అంటూ ప్రచారం చేసుకున్న వైసీపీ ప్రభుత్వం, వాస్తవానికి దళిత సమాజాన్ని రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగించుకుందని, దళితుల సంక్షేమం పేరుతో వచ్చిన నిధులను ఇతర అవసరాలకు మళ్లించడం ద్వారా ఎస్సీ, ఎస్టీ వర్గాల భవిష్యత్తును దెబ్బతీశారని, దళిత డ్రైవర్ సుబ్రహ్మణ్యంను చంపి డోర్ డెలివరీ చేసిన నిందితుడు అనంతబాబుపై కఠిన చర్యలు తీసుకోకుండా, నేరస్తుడిగా అభియోగాలు మోపుతున్న నిందితుడ్ని జగన్ రెడ్డి వెంటేసుకుని తిరుగుతున్నాడని, జగన్ రెడ్డి పాలనలో దళితులపై రెచ్చిపోయి దాడులకు దిగబడనారని కాకినాడ సిటీ శాసనసభ్యులు వనమాడి కొండబాబు పేర్కొన్నారు. వైసిపి ఎమ్మెల్సీ చేతిలో హత్యకు గురై డోర్ డెలివరీ కాబడిన వీధి సుబ్రహ్మణ్యం వర్ధంతి సందర్భంగా ఎస్సీ సెల్ ఆధ్వర్యంలో రేచర్ల పేట, అంబేద్కర్ గ్లోబ్ సెంటర్ నందు నిర్వహించిన సంస్మరణం కార్యక్రమంలో శాసనసభ్యులు వనమడి కొండబాబు పాల్గొని వీధి సుబ్రహ్మణ్యం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కొండబాబు మాట్లాడుతూ జగన్ రెడ్డి గత వైసిపి పాలనలో నా ఎస్సీలు, నా ఎస్టీలు, అంటూ నమ్మించి దళితుల గొంతుకోసారిని, జగన్ ప్రభుత్వ హయాంలో దళితులను ఎంతగా ఊచకోత కోశారో డ్రైవర్ వీధి సుబ్రహ్మణ్యం, దళిత డాక్టర్ సుధాకర్, హత్యలే ఉదాహరణని, జగన్ రెడ్డి తన ఐదేళ్ల పాలనలో ఎస్సీ సబ్ ప్లాన్ నిధులు, ఎస్టీ సబ్ ప్లాన్ నిధులను దారి మళ్లించి దళితులకు అన్యాయం చేశారని, దీంతో లక్షలాదిమంది దళిత సోదరులు కోట్లాది రూపాయల బ్యాంకు సబ్సిడీ లోన్లు కోల్పోయారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ కొల్లాబత్తుల అప్పారావు, నగర ఎస్సీ సెల్ అధ్యక్షులు అంబటి చిన్న మాట్లాడుతూ స్వయం ఉపాధి, చిన్న వ్యాపారాలు, యువత ఆర్థిక స్థిరత్వానికి కీలకమైన పథకాలు వైసీపీ హయాంలో నిలిచిపోయాయని, గత వైసిపి ప్రభుత్వం దళిత సంక్షేమాన్ని కేవలం నినాదాలకే పరిమితం చేసిందని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఎస్సీ కార్పొరేషన్ ద్వారా ఉపాధి, రుణాలు, శిక్షణ కార్యక్రమాలకు మళ్లీ ఊతమిస్తున్నాయని, దళిత యువతలో ఆత్మవిశ్వాసం పెంపొందించే కూటమి ప్రభుత్వం చర్యలు చేపడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నగర ఎస్సీ సెల్ అధ్యక్షులు అంబటి సత్యనారాయణ (చిన్న), ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ కొల్లాబత్తుల అప్పారావు, సికోటి అప్పలకొండ, పలివెల రవి అనంత కుమార్, బంగారు సత్యనారాయణ, పోలిపల్లి జగన్, ఏడిద శ్రీను, బత్తిన ఉమా, పెదపూడి కుమార్, బొడ్డుపల్లి నాని, మూడే రాజబాబు, ముర్తండ నాగేశ్వరరావు, నాగేంద్ర కుమార్, నగర అధ్యక్షులు మల్లిపూడి వీరు, గదుల సాయిబాబా, ఎం ఏ తాజుద్దీన్, తదితరులు పాల్గొన్నారు.



# ప్రైవేట్ ఆసుపత్రుల బకాయిల కోసం రూ. 919 కోట్లు విడుదల చేశాం : సత్యకుమార్

**నిధులను నేరుగా ఆసుపత్రుల ఖాతాల్లోకి జమ చేశామన్న సత్యకుమార్**
**785 ప్రైవేట్ ఆసుపత్రులకు నిధులు అందాయని విడుదల**
**ఇప్పటి వరకు మొత్తం రూ. 5,556 కోట్లు విడుదల చేశామని వెల్లడి**

**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్‌లో ఆరోగ్య సేవల బలోపేతం దిశగా కూటమి ప్రభుత్వం మరో కీలక అడుగు వేసింది. ఎన్టీఆర్ వైద్య సేవా ట్రస్టు అనుబంధ ప్రైవేట్ ఆసుపత్రుల బకాయిల కోసం ప్రభుత్వం రూ. 919.13 కోట్లను విడుదల చేసినట్లు వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ఒక ప్రకటనలో వెల్లడించారు. ట్రై-పార్టీ బిల్ డిస్కౌంటింగ్ విధానంలో భాగంగా ఈ నిధులను నేరుగా ఆసుపత్రుల ఖాతాల్లోకి జమ చేసినట్లు ఆయన వివరించారు. ఏపీ సెంటర్ ఫర్ ఫైనాన్షియల్ సిస్టమ్స్ వెబ్ పోర్టల్ ద్వారా దరఖాస్తు చేసుకున్న 785 ప్రైవేట్ ఆసుపత్రులకు ఈ నిధులు అందాయని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటివరకు ప్రైవేట్ ఆసుపత్రులకు మొత్తం రూ. 5,556 కోట్లను చెల్లించామని, బకాయిల చెల్లింపుల హామీకి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి సత్యకుమార్ యాదవ్ పునరుద్ఘాటించారు. దీనికి సంబంధించిన నివేదికను ట్రస్టు సీఈఓ చక్రధరబాబు మంత్రికి అందజేశారు.



# డ్రైవర్ సుబ్రహ్మణ్యం కుటుంబానికి న్యాయం జరిగే వరకు పోరాటం

**టీడీపీ ఎస్.సి సెల్ నివాళి - సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ ఆదేశాలమేరకు..**

**దళితులకు జరుగుతున్న అన్యాయాల పట్ల అంబేద్కర్ విగ్రహం వద్ద ఆవేదన - టీడీపీ తూర్పుగోదావరి జిల్లా ప్రధాన కార్యదర్శి కాశి నవీన్ కుమార్**

**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఎమ్మెల్సీ అనంతబాబు తన దళిత డ్రైవర్ వీధి సుబ్రహ్మణ్యంను దారుణంగా హత్య చేసి మృతదేహాన్ని డోర్ డెలివరీ చేసిన అమానుష ఘటనకు నేటితో నాలుగు సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా 13వ వార్డు ఇంచార్జ్ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షురాలు కప్పల వెలుగు కుమారి, రాజమండ్రి పట్టణ ఎస్సీ సెల్ దళిత విభాగం అధ్యక్షులు చాపల చిన్నరాజు పర్యవేక్షణలో స్థానిక పదమూడవ వార్డు అంబేద్కర్ నగర్ లో నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా తెలుగుదేశం పార్టీ తూర్పుగోదావరి జిల్లా ప్రధాన కార్యదర్శి కాశి నవీన్ కుమార్ పాల్గొని టిడిపి దళిత నాయకులతో కలిసి డ్రైవర్ సుబ్రహ్మణ్యం కి నివాళులర్పించారు. అనంతరం డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహం వద్ద దళితులపై జరుగుతున్న దాడులు, అన్యాయాలు మరియు అమానుష ఘటనలపై తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికార దర్పంతో ఒక దళిత యువకుడిని ఎమ్మెల్సీ అనంతబాబు హత్య చేసి, మృతదేహాన్ని






హతుడి ఇంటికే తీసుకెళ్లి పడేయడం రాష్ట్ర రాజకీయ చరిత్రలో మానవత్వాన్ని తలదించుకునే ఘటనగా నిలిచిందన్నారు. బాధిత కుటుంబానికి పూర్తి స్థాయిలో న్యాయం జరగాలని, దోషులకు కఠిన శిక్ష పడే వరకు ప్రజాస్వామ్యబద్ధంగా పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. జగన్ పాలనలో దళితులపై దాడులు, హత్యలు, అవమానాలు తప్ప, దళిత సంక్షేమం కోసం చేసింది ఏమీ లేదని తీవ్రంగా విమర్శించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధ్యక్షతన కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక దళితుల ఆత్మగౌరవాన్ని కాపాడే విధంగా పాలన సాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో బొర్రా చిన్ని, బంగారం, నాగేశ్వరావు, ఏలూరు దేవి, ప్రసాద్, ఎర్రంశెట్టి రాజకుమార్, నీలాపు వెంకటేశ్వరరావు, రాయి అప్పన్న బాబు, వార్డు ప్రెసిడెంట్ నగర బోయిన రామకృష్ణ, పతివాడ సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

---

కూతుర్ని హతమార్చిన

## కసాయి తండ్రి అరెస్టు

**సిఐ సత్యనారాయణమూర్తి**

**మద్యం మత్తులో కుటుంబాలను నాశనం చేసుకోవద్దు**



**కోరుకొండ, విశ్వం వాయిస్ న్యూస్ :** భార్య కాపురానికి రావడం లేదన్న కోపంతో మద్యానికి బానిసై పిల్లల్ని కంటికి కాపాడవలసిన తండ్రి ఆరుబయట ఆడుకుంటున్న నాలుగేళ్ల చిన్నారి లహరిని ఉద్దేశపూర్వకంగా బావిలో పడేసి హతమార్చిన కసాయి తండ్రిని అరెస్టు చేసినట్లు కోరుకొండ సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎస్‌వివి సత్యనారాయణమూర్తి తెలిపారు. మంగళవారం ఆయన కోరుకొండ పోలీస్ స్టేషన్లో పాత్రికేయులతో మాట్లాడుతూ గాదరాడ గ్రామానికి చెందిన రామవరపు రాజు, నీలిమ ప్రేమించి వివాహం చేసుకున్నారు. ఇటీవల రాజు భార్య మీద అనుమానంతో గొడవలు పడడంతో నీలిమ ఇద్దరు పిల్లలతో భర్తకు దూరంగా బాబాయి ఇంటికి పాలచర్లలో ఉంటుందన్నారు. భర్త రాజు పెద్దల సమక్షంలో పిల్లలను చక్కగా చూసుకుంటానని పెద్దలను నమ్మించి ఇద్దరు పిల్లలను తనతో గాదరాడ తీసుకు వచ్చాడన్నారు. అయితే భార్య కాపురానికి రాకపోవడంతో కోపంతో మద్యం సేవించి ఈనెల 14వ తేదీ రాత్రి 7గంటలకు ఆరుబయట ఆడుకుంటున్న నాలుగేళ్ల చిన్నారి లహరిని ఉద్దేశపూర్వకంగా బావిలో పడవేయడని దీంతో లహరి మృతి చెందిందన్నారు. భార్య నీలిమ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేసి, ఉన్నతాధికారుల ఆదేశాలతో మంగళవారం రాజును అరెస్టు చేసి కోర్టుకు తరలిస్తున్నా మన్నారు. చాలామంది మద్యం, చెడు వ్యసనాలకు బానిసై తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారన్నారు. ఇకనైనా చెడు వ్యసనాలు మాని మంచి పౌరులుగా జీవించాలన్నారు.ఈ కార్యక్రమంలో స్టేషన్ హౌస్ ఆఫీసర్ చిలకమర్తి వెంకట రమేష్, సిబ్బంది పాల్గొన్నారు.

అత్యవసర సమయంలో అందించే

## ప్రథమ చికిత్సపై రెడ్ క్రాస్ శిక్షణ



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఎప్పుడైన ఎక్కడైనా అత్యవసర సమయాలలో ఎవరికైనా ఆపద వచ్చినప్పుడు అందించే ప్రథమ చికిత్సపై ఇండియన్ రెడ్ క్రాస్ తూర్పుగోదావరి జిల్లా ఛైర్మన్ డాక్టర్ జి.తరుణ్ సూచనలతో మంగళవారం స్థానిక రెడ్ క్రాస్ భవనం లో శిక్షణ ఇవ్వడం జరిగింది. ఈ ప్రథమచికిత్స శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా వైస్ ఛైర్మన్ డాక్టర్ కామిరెడ్డి వెంకట రమణ,జిల్లా కోశాధికారి డాక్టర్ జీ మహాలక్ష్మి లు మాట్లాడుతూ రెడ్ క్రాస్ సంస్థ అంతర్జాతీయంగా చేస్తున్న సేవలను తెలిపారు. ఎవరికైనా ఏదైనా అపాయం జరిగినప్పుడు నిపుణుల వైద్యం అందేవరకు తాత్కాలికంగా అందించే చికిత్సే ప్రథమ చికిత్స అని, ప్రతి ఒక్కరూ ఈ శిక్షణను పొందాలని, మనం ఎవరికైనా ప్రథమ చికిత్స చేసి కాపాడాలంటే శిక్షణ పొందిన వారి వల్లనే మేలు జరుగుతుందని అన్నారు.ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ జిల్లా మేనేజింగ్ కమిటీ సభ్యులు పీఎంపీ జిల్లా అధ్యక్షులు బళ్ల శ్రీనివాసరావు, బోను రామకృష్ణ, ఫస్ట్ ఎయిడ్ ట్రైనర్ కే.ధర్మారావు, జి.గోపాలకృష్ణ, రాంబాబు, పద్మలతో పాటు సభ్యులు పాల్గొన్నారు. శిక్షణ అనంతరం పాల్గొన్న వారందరికీ సర్టిఫికెట్లు అందజేశారు.

## వ్యక్తిగత గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలి

**హౌసింగ్ అధికారులతో ఎమ్మెల్యే వేగుళ్ళ సమీక్ష**



**మండపేట టౌన్, విశ్వంవాయిస్ న్యూస్ :** మండపేట నియోజకవర్గం వ్యాప్తంగా ప్రభుత్వ వ్యక్తిగత గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలని రాష్ట్ర అంచనాల కమిటీ ఛైర్మన్ మండపేట ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు అన్నారు. మండపేట పురపాలక సంఘ కార్యాలయంలో ఎమ్మెల్యే చాంబర్ లో రాష్ట్ర అంచనాల కమిటీ ఛైర్మన్, ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు తూర్పుగోదావరి జిల్లా హౌసింగ్ ప్రొజెక్ట్ డైరెక్టర్ నాతి బుజ్జి, రాజమహేంద్రవరం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రాజ్‌కుమార్, మున్సిపల్ కమీషనర్ టి.వి.రంగారావు, హౌసింగ్ డిప్యూటీ ఇంజనీర్ వెంకటరెడ్డి, ఎ.ఇలు కాంట్రాక్టర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మండపేట నియోజకవర్గంలోకి హౌసింగ్ సమస్యలపై అధికారులతో చర్చించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వేములపల్లి లే అవుట్‌లో స్థలాలు కేటాయించిన లబ్ధిదారులతో రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు 2026 ఆగష్టు 15 నాటికి గృహ ప్రవేశాలు చేయించాలన్నారు. అలాగే మండపేట నియోజకవర్గానికి ప్రభుత్వం వారు ఇచ్చిన టార్గెట్ 2,500 గృహాలు నిర్మాణాలు పూర్తి చేయడానికి కార్యాచరణ రూపొందించి, గ్రామాలలో మండపేట పట్టణం లోని స్వర్ణ వార్డు సచివాలయలు లో ఆయా లబ్దిదారులతో సమావేశం ఏర్పాటు చేసి వెంటనే పనులు మొదలుపెట్టించి నిర్మాణాలు పూర్తి చేయించాలని సంబంధిత అధికారులకు కాంట్రాక్టర్లను ఎమ్మెల్యే ఆదేశించారు.

---

ప్రభుత్వ పాఠశాలల్లోనే

## పిల్లలకు బంగారు భవిష్యత్తు

**- దారా యేసురత్నం**



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** నారా లోకేష్ నాయకత్వంలో విద్యారంగానికి కొత్త దిశ లభిం చిందని రత్నం ఆర్గనైజేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు, జగ్గంపేట నియోజకవర్గ సమన్వయ కమిటీ సభ్యులు, కాకినాడ జిల్లా తెలుగుదేశం పార్టీ ఎస్సీ సెల్ కార్యనిర్వహణ కార్యదర్శి దారా యేసురత్నం పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలలోనే పిల్లలను చదివించి వారి భవిష్యత్తును సురక్షితంగా తీర్చిదిద్దాలని దారా యేసురత్నం అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు చోటుచేసుకున్నాయని తెలిపారు. ప్రతి ప్రభుత్వ పాఠశాలలో ప్రతిభావంతులైన ఉపాధ్యాయులతో క్రమశిక్షణ, నాణ్యమైన విద్య అందించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారని చెప్పారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ విద్యా వ్యవస్థలో సమూల మార్పులు చేపట్టారని పేర్కొన్నారు. విద్య ద్వారానే ఉన్నత భవిష్యత్తు సాధ్యమవుతుందని, ఆ లక్ష్యంతో ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేస్తున్నారని అన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ప్రోత్సాహంతో విద్యాశాఖ మరింత సమర్థంగా పనిచేస్తోందని తెలిపారు. ఈ ఏడాది పదో తరగతి ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు మెరుగైన ఉత్తీర్ణత సాధించడం దీనికి నిదర్శనమని అన్నారు. అలాగే ప్రభుత్వ వసతి గృహాల్లో మౌలిక వసతులు, నాణ్యమైన ఆహారం, మెరుగైన వసతి కల్పిస్తున్నారని చెప్పారు. తల్లిదండ్రులు తమ పిల్లల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వ వసతి గృహాల్లో చేర్పించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## నారా లోకేష్‌ని కలిసిన గుడా మాజీ చైర్మన్ గన్ని కృష్ణ

**- స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ప్రాధాన్యత సంతరించుకున్న భేటీ**



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** తెలుగుదేశం పార్టీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌ను మంగళవారం అమరావతిలో గుడా మాజీ చైర్మన్, గన్ని కృష్ణ మర్యాదపూర్వకంగా కలిశారు. జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఎంపికయినా లోకేష్‌ను గన్ని అభినం దించి శుభాకాంక్షలు తెలియజేసారు. పూల బొకే, దండల బదులు నోట్ బుక్స్ అందజేశారు. అలాగే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్యా ఫలితాలు సాధించడం తోపాటు ప్రభుత్వ పాఠశాలలో మౌలిక సదుపాయాలను కల్పిస్తూ పాఠశాల వైపు తల్లిదండ్రుల ఆలోచనలను మళ్లించిన లోకేష్ పనితీరును ఆయన అభినందించారు.త్వరలో స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్ నేపథ్యంలో ఈ భేటీ ప్రాధాన్యతను సంతరించుకుంది.రాజమండ్రి కార్పొరేషన్ ఎన్నికలు త్వరలో జరగనున్న నేపథ్యంలో వీరి ఇరువురి మధ్య జరిగిన సంభాషణ పై తెలుగుదేశం పార్టీ శ్రేణులు, నగర ప్రజలు ఆసక్తిగా ఉన్నారు. రాజమహేంద్రవరంలో రాజకీయ పరిస్థితులు,అవకాశాలను ఈ సందర్భంగా లోకేష్‌కు గన్ని కృష్ణ వివరించారు. దీనిపై సానుకూలంగా స్పందించిన లోకేష్ త్వరలో నూటికి నూరుశాతం స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తామని స్పష్టం చేశారు.పార్టీ ఆవిర్భావం నుండి సుశిక్షితులైన కార్యకర్తగా గన్ని కృష్ణ అందిస్తున్న సేవలను ఈ సందర్భంగా లోకేష్ ప్రస్తావించారు. పార్టీ విజయం, పటిష్టత, అభివృద్ధి, సంక్షేమం లక్ష్యంగా పార్టీని ముందుకు నడిపిస్తున్న నాయకత్వానికి తప్పనిసరిగా గుర్తింపు ఉంటుందని లోకేష్ అన్నారు.

---

ఇసుక కాంట్రాక్టర్లతో

## ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ సమీక్ష సమావేశం



**సీతానగరం, విశ్వం వాయిస్ న్యూస్ :** రాజా నగరం నియోజకవర్గం సీతానగరం మండలం మండల తహసీల్దార్ వారి కార్యాలయంలో నియోజక వర్గంలో గల ఇసుక కాంట్రాక్టర్లతో తహసీల్దార్ అంకం శ్రీనివాసరావుతో కలిసి రాజానగరం నియో జకవర్గ శాసనసభ్యులు బత్తుల బలరామకృష్ణ సమీక్ష సమావేశం జరిపారు. ఈ సమావేశంలో ఇసుక కాంట్రాక్టర్లకు ఎమ్మెల్యే బత్తుల బలరామ కృష్ణ పలు సూచనలు, సలహాలు, హెచ్చరికలు ఇవ్వడం జరిగింది.ప్రభుత్వం నిర్దేశించిన విధంగా ఇసుక తవ్వకాలు జరిపి వాహనాలకు లోడ్ చేసేటప్పుడు పరిమితికి మించి లోడ్ చేయకూడదని లోడ్ పూర్తి అయిన తర్వాత వాహనంపై పూర్తిగా కవర్ (టార్పాల్) తో మూసివేసి రోడ్ల వెంబడి ప్రయాణిం చేటప్పుడు ముఖ్యంగా జనావాసాల మధ్య అధిక స్పీడ్ ఉండకూడదని వాహనాల సామర్థ్యం ఎప్పటికప్పుడు చెక్ చేసుకోవాలని సరైన అనుమతులు వెంట ఉండేలా ప్రయాణించాలని సూచించారు. అలానే ఓవర్ లోడ్, హై స్పీడ్ , వాహనానికి తార్పాల్ లేకుండా ప్రయాణం చేస్తే కఠిన చర్యలు తీసుకొంటామని స్పష్టమైన హెచ్చరిక జారీ చేసారు. రోడ్ల వెంబడి జారిన ఇసుకను కాంట్రాక్టర్లే రెండు రోజుల్లో శుభ్రపరచాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఇసుక కాంట్రాక్టర్లతో పాటు ప్రభుత్వ అధికారులు, జనసేన, తెలుగుదేశం, బిజెపి పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రభుత్వం నిర్ణయం మాతృమూర్తులకు మచ్చతెచ్చారు

**దళిత నాయకుడు బద్దే జార్జి ఆంటోని నిరసన**




**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** పిల్లల్ని కంటే డబ్బిస్తామని పాలకులు చెప్పడం మాతృమూర్తులను అవమానించడమేనని దళిత నాయకుడు బద్దే జార్జి ఆంటోని విమర్శించారు.మహిళలు నలుగురు పిల్లలకు జన్మనివ్వాలనడం అవసరమా అని ఆయన ప్రశ్నించారు.మన పెద్దలు పిల్లల్ని కనడాన్ని దైవ ప్రసాదంగా భావిస్తారు తప్ప యాంత్రికంగా కాదని ఆయన పేర్కొన్నారు. ప్రోత్సాహం పేరుతో మూడో బిడ్డకు ఒక రేటు నాలుగో బిడ్డకు మరో రేటు అని ప్రకటించి మహిళలను మనమే అవమానించడం సరికాదని,ఈ విషయంలో ప్రజాప్రతినిధులు పునరాలోచన చేయాలని జార్జి ఆంటోని కోరారు. జననాలను డబ్బుతో కొలవడం,అదీకూడా కొందరికే ఆపాదించాలని కొందరు కోరడం సరైన విధానం కాదని, ఇది మాతృమూర్తులకు మచ్చ తేవడమేనని తాను భావిస్తున్నట్లు జార్జి ఆంటోని ఒక ప్రకటనలో తెలిపారు.

## ఎంపీడీవో ఆధ్వర్యంలో ఉచిత కుట్టు శిక్షణకు ఎంపికైన వారికి పరీక్ష నిర్వహణ



**సీతానగరం, విశ్వం వాయిస్ న్యూస్ :** తూర్పుగోదావరి జిల్లా సీతానగరం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో రాష్ట్ర వెనుకబడిన తరగతుల ఆర్థిక సంస్థ ఆధ్వర్యంలో ఎంపీడీవో అధ్యక్షతన మహిళలకు ఉచిత కుట్టు శిక్షణ ద్వారా ఎంపికైన వారికి పరీక్ష నిర్వహించారు.శిక్షణ పొందిన వారికి పివిఆర్ స్కిల్ సెంట్రల్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ద్వారా ఎగ్జామినర్ స్వర్ణలత, బీసీ కార్పొరేషన్ ఏఈఓకే ఆర్.విజయ, జిల్లా కోఆర్డినేటర్ వివి నరసింహస్వామి ఆధ్వర్యంలో పరీక్ష నిర్వహించడం జరిగింది. అతి త్వరలోనే మహిళలకు సర్టిఫికెట్ మరియు ఉచిత కుట్టుమిషన్ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు.

## కాటవరం గ్రామంలో ముంపు భూముల ఐదవ దశ రీ సర్వే



**సీతానగరం, విశ్వం వాయిస్ న్యూస్ :** తూర్పుగోదావరి జిల్లా సీతానగరం మండలం కాటవరం గ్రామంలో ఐదవ దశ రీ సర్వేలో భాగంగా గ్రౌండ్ ట్రూటింగ్ ప్రక్రియ రెండు సర్వే టీములతో జరుగుచున్నది. కావున కాటవరం గ్రామంలోని రైతులు ఎవరైతే కూనవరం,మునగాల, బుచ్చింపేట సరిహద్దుగ్రామ రైతులందరూ ముంపు భూముల యొక్క సర్వే ది20/05/26 నుండి 26/05/26 వరకు అనగా వారం రోజులు మాత్రమే జరుగును. తదుపరి సదరు ప్రక్రియ జరుగు అవకాశం లేనందున కాటవరం గ్రామములోని సదరు ముంపు భూములు గల రైతులందరూ 2 సర్వే టీములను సంప్రదించి పూర్తి వివరాలు అందజేసి మీ ముంపు భూములకు సర్వే చేయించుకోవాల్సిందిగా సీతానగరం తహసిల్దార్ ఎ.శ్రీనివాస్ తెలియజేశారు.

## పోలవరం జల విద్యుత్ ప్రాజెక్టులో మరో మైలురాయి



**సీతానగరం, విశ్వం వాయిస్ న్యూస్ :** పోలవరం జల విద్యుత్ కేంద్రం నిర్మాణంలో మంగళవారం మరో కీలక అడుగు పడింది. విద్యుత్ ఉత్పత్తికి అవసరమైన భారీ కెప్లాన్ టర్బైన్ ప్రాజెక్టు ప్రాంతానికి తరలివస్తుంది. సీతానగరం మండలం పురుషోత్తపట్నం మీదుగా ఈ టర్బైన్ పోలవరం చేరుకోనుంది. ఏపీ జెన్కో ఆధ్వర్యంలో ఇక్కడ 960 మెగావాట్ల సామర్థ్యంతో 12 యూనిట్ల విద్యుత్ కేంద్రాన్ని నిర్మిస్తున్నారు. ఇక్కడి పనులు మరింత వేగవంతం కానున్నాయి.

---

# వీధి కుక్కల నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు

**12 వేలకుపైగా కుక్కలకు వ్యాక్సినేషన్ పూర్తి - నగర ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచన - ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్**

**క్వారీ సెంటర్‌లో ఎబిసి సెంటర్ తనిఖీ - వీధి కుక్కల స్టెరిలైజేషన్‌పై సమీక్ష - ప్రత్యేక టోల్ ఫ్రీ నంబర్ ఏర్పాటు**

**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** నగరంలో వీధి కుక్కల నియంత్రణ, ప్రజల భద్రత లక్ష్యంగా ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు చేపడుతోందని రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం క్వారీ సెంటర్‌లోని ఎబిసి (యానిమల్ బర్త్ కంట్రోల్) సెంటర్‌ను ఆయన స్వయంగా పరిశీలించి అక్కడ జరుగుతున్న స్టెరిలైజేషన్, యాంటీ రేబిస్ వ్యాక్సినేషన్ కార్యక్రమాలపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ నగర ప్రజల భద్రత కోసం ముందస్తు ప్రణాళికలతో ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. నగరంలోని వీధి కుక్కలకు శాస్త్రీయ విధానంలో స్టెరిలైజేషన్ ఆపరేషన్లు నిర్వహిస్తూ, రేబిస్ వ్యాధి వ్యాప్తిని అరికట్టేందుకు యాంటీ రేబిస్ వ్యాక్సినేషన్ అందిస్తున్నామని తెలిపారు. గతంలో గుంటూరులో చిన్నారిపై జరిగిన దాడి ఘటన తర్వాత కూటమి ప్రభుత్వం అప్రమత్తమై రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక చర్యలు చేపట్టిందన్నారు. అదే తరహాలో రాజమహేంద్రవరం నగరంలో కూడా ప్రత్యేక ప్రణాళికతో కార్యక్రమాలను అమలు చేస్తున్నామని చెప్పారు. 2024 జూన్ 1 నుంచి ఇప్పటివరకు నగరపాలక సంస్థ పరిధిలో మొత్తం 25,865 వీధి కుక్కలను గుర్తించగా, అందులో 12,126 కుక్కలకు ఇప్పటికే స్టెరిలైజేషన్, వ్యాక్సినేషన్ పూర్తి చేసినట్లు వెల్లడించారు. ఇంకా మిగిలిన 3,739 కుక్కలకు త్వరితగతిన వ్యాక్సినేషన్ పూర్తి చేయాలని అధికారులను



ఆదేశించినట్లు తెలిపారు. ఈనెల 1 నుంచి నగరంలోని అన్ని వార్డుల్లో 10 వేల డోసులతో ప్రత్యేక యాంటీ రేబిస్ వ్యాక్సినేషన్ డ్రైవ్ కొనసాగుతోందన్నారు. ఇటీవల విశాఖపట్నంలో కూడా కుక్కల దాడి ఘటన వెలుగులోకి రావడంతో ముందస్తు జాగ్రత్తలను మరింత బలోపేతం చేశామని ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు పేర్కొన్నారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను వెంటనే స్వీకరించి స్పందించేందుకు ప్రత్యేక టోల్ ఫ్రీ నంబర్ ఏర్పాటు చేయడంతో పాటు, వాటి పర్యవేక్షణ కోసం ప్రత్యేక సూపర్వైజర్‌ను కూడా నియమించినట్లు తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాతే సి ఎస్ ఆర్ నిధులతో పశువైద్య ఆసుపత్రికి ఆధునిక పరికరాలు అందించామని చెప్పారు. “నాయకుడు సమస్య వచ్చిన తర్వాత స్పందించేవాడు కాదు... సమస్య రాకముందే నివారించే చర్యలు తీసుకునేవాడే నిజమైన నాయకుడు” అని ఎమ్మెల్యే వాసు పేర్కొన్నారు. నగర ప్రజల భద్రత విషయంలో ప్రభుత్వం ఎప్పుడూ అప్రమత్తంగా ఉంటుందని స్పష్టం చేశారు. వేసవి తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో మూగజీవాలు, ముఖ్యంగా వీధి కుక్కలు అసహజంగా ప్రవర్తించే అవకాశ ముందని హెచ్చరించారు. పిల్లలు కుక్కలను రెచ్చగొట్టకుండా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. నగరంలో ఎక్కడైనా వీధి కుక్కల సమస్య తీవ్రంగా ఉంటే వెంటనే టోల్ ఫ్రీ నంబర్ 70939 21991కు సమాచారం అందించాలని, అధికారులు తక్షణ చర్యలు తీసుకుంటారని తెలిపారు. నాయకులు మజ్జి రాంబాబు, కొయ్యల రమణ, అగురు ధన్ రాజ్, దుత్తరపు గంగా ధర్, కేబుల్ మురళి, బేసరి చిన్ని, కానేటి ప్రభు, మోతా నాగలక్ష్మి, నగర పాలక సంస్థ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# ప్రతిసారీ మగాడిదే తప్పు అనుకోవద్దు..

## జయం రవికి మద్దతుగా టాలీవుడ్ హీరోయిన్



కోలీవుడ్ స్టార్ హీరో జయం రవి, ఆయన భార్య ఆర్తిల విడాకుల వివాదం ప్రస్తుతం సినిమా ఇండస్ట్రీలో తీవ్ర దుమారం రేపుతోంది. ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకోవడం, కౌంటర్లు ఇచ్చుకోవడంతో ప్రస్తుతం కోలీవుడ్ లో జయం రవి- ఆర్తిల పేరు పేరు మార్మోగుతోంది. కోలీవుడ్ స్టార్ హీరో రవి మోహన్ ( జయం రవి ), ఆయన భార్య ఆర్తి రవిల విడాకుల వ్యవహారం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ముఖ్యంగా ఇటీవల ప్రెస్ మీట్‌లో జయం రవి మాట్లాడుతూ భార్య ఆర్తి, ఆమె కుటుంబ సభ్యులపై సంచలన ఆరోపణలు చేశాడు. పెళ్లయిన నాటి నుంచి తాను తీవ్ర అవమానాలు ఎదుర్కొన్నానని వాపోయారు. తనపై 'చేతబడి' కూడా చేయడంతో రక్తం కక్కుకున్నానని, మానసిక క్షోభతో ఆత్మహత్యకు యత్నించానని అందరి ముందు కన్నీరు పెట్టుకున్నారు. అయితే దీనికి భార్య ఆర్తి కౌంటర్ ఇచ్చింది. ఆ తర్వాత ఈ విడాకుల వివాదంలోకి ఖుష్బూ కూడా ఎంటరయ్యింది. మొత్తానికి ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకుంటూ, దుమ్మెత్తిపోసుకుంటూ కోలీవుడ్ లో హాట్ టాపిక్ గా మారారు రవి- ఆర్తి జంట. తాజాగా ఈ విషయంలో జయం రవికి బహిరంగంగా మద్దతు పలికింది ఒకప్పటి టాలీవుడ్ హీరోయిన్ మీరా చోప్రా. ఈ మేరకు రవి వెర్షన్ కూడా అందరూ వినాలని ఆమె ఎక్స్ (ట్విట్టర్) వేదికగా ఒక పోస్ట్ పెట్టింది. 'నాకు నటుడు జయం రవి చాలా బాగా తెలుసు. అతను ఎంతో సున్నితమైన, మంచి వ్యక్తి. ప్రతిసారీ తప్పు మగవాడిదే కానక్కర్లేదు. ఈ రోజుల్లో కొంతమంది మహిళలు తమకు అనుకూలంగా ఉన్న చట్టాలను, వ్యవస్థను దుర్వినియోగం చేస్తున్నారు. సమాజం ఎప్పుడూ ఒక పక్షాన్నే వినకూడదు. మగవారి వెర్షన్‌ను కూడా ప్రపంచం వినాలి. రవిని చూస్తుంటే బాధగా ఉంది. అతనికి ఖచ్చితంగా న్యాయం జరుగుతుందని, నిజం గెలుస్తుందని ఆశిస్తున్నాను' అని ఎక్స్ లో రాసుకొచ్చింది మీరా చోప్రా. ప్రస్తుతం ఈ ట్వీట్ నెట్టింట వైరల్ గా మారింది. గ్లోబల్ బ్యూటీ ప్రియాంక చోప్రాకు కజిన్ సిస్టర్ అయిన మీరా చోప్రా తెలుగు అభిమానులకు కూడా సుపరిచితమే. పవన్ కల్యాణ్ బంగారం, వాన తదితర సినిమాల్లో హీరోయిన్ గా చేసింది అందాల తార.

## టీమిండియా క్రికెటర్‌తో

# కోర్టు హీరోయిన్ ప్రేమాయణం!

గతేడాది వచ్చిన కోర్ట్ సినిమాతో ఓవర్ నైట్ స్టార్‌గా మారిపోయింది శ్రీదేవి అప్పాల. అంతుకు ముందు సోషల్ మీడియా రీల్స్ తో బాగా ఫేమస్ అయిన ఆమె ఈ సినిమాలో తన క్యూట్ ఎక్స్ ప్రెషన్స్ తో యూత్ ను కట్టిపడేసింది. కోర్టు సినిమాతో అందరి దృష్టిని ఆకర్షించింది యంగ్ హీరోయిన్ శ్రీదేవి అప్పాల. ఇందులో జాబిలి పాత్రలో ఆమె అందం, అభినయానికి అందరూ ఫిదా అయ్యారు. ముఖ్యంగా శ్రీదేవి క్యూట్ ఎక్స్ ప్రెషన్స్ కు యూత్ పడిపోయారు. సినిమా కూడా సూపర్ హిట్ గా నిలిచింది. ఏకంగా రూ. 50 కోట్లకు పైగా కలెక్షన్లు రాబట్టడంతో శ్రీదేవి క్రేజ్ అమాంతం పెరిగిపోయింది. అందుకు తగ్గట్టుగానే ఇటీవలే బ్యాండ్ మేళం అంటూ మరో యూత్ ఫుల్ లవ్ స్టోరీతో మన ముందుకొచ్చిందీ అందాల తార. ఇందులోనూ కోర్టు మూవీ హీరో హర్ష్ రోషన్ తోనే కలిసి స్క్రీన్ షేర్ చేసుకుందీ అందాల తార. అయితే ఈ సినిమా పెద్దగా ఆడలేదు. కానీ శ్రీదేవికి మాత్రం మంచి పేరు తీసుకొచ్చింది. ఇప్పుడీ అందాల తార తెలుగుతో పాటు తమిళ, మలయాళ సినిమాల్లో హీరోయిన్ గా నటిస్తోంది. అందులో 'హైకు'అనే ఓ క్రేజీ ప్రాజెక్టు కూడా ఉంది. తమిళ, మలయాళ భాషల్లో తెరకెక్కుతోన్న ఈ సినిమాలో హీరోగా ఏగన్ నటిస్తున్నాడు. అలాగే , 'మిన్నల్ మురళి' ఫేమ్ ఫెమినా జార్జ్ మరో కీలక పాత్రలో కనిపించనుంది. . విజన్ సినిమా హౌస్ బ్యానర్‌పై డాక్టర్ అరుళనందు, మాథ్యూ అరుళనందు సంయుక్తంగా ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ప్రస్తుతం షూటింగ్ దశలో ఉన్న ఈ సినిమా త్వరలోనే ప్రేక్షకుల ముందుకు రానుంది. సినిమాల సంగతి పక్కన పెడితే తన వ్యక్తిగత జీవితంతోనూ వార్తల్లో నిలుస్తోంది శ్రీదేవి. గతంలో తనతో కలిసి నటించిన హర్ష్ రోషన్ తో ప్రేమలో ఉందని ప్రచారం జరిగింది. అయితే అవన్నీ పుకార్లనని కొట్టి పారేసింది శ్రీదేవి. ఇప్పుడు ఓ టీమిండియా యంగ్ క్రికెటర్ తో శ్రీదేవి ప్రేమలో ఉందంటూ కొన్ని వార్తలు వైరల్ అవుతున్నాయి. ప్రస్తుతం ఐపీఎల్ లో అదరగొడుతోన్న ఓ యంగ్ సెన్సేషన్ తో శ్రీదేవి పేరును ముడిపెడుతూ కొన్ని పోస్టులు నెట్టింట వైరలవుతున్నాయి. అయితే ఇవన్నీ వట్టి రూమర్లేనని తెలుస్తోంది. కొందరు నెటిజన్లు కావాలని ఈ రూమర్స్ ను క్రియేట్ చేశారని తెలుస్తోంది.



# ఇదేందిది.. ప్లేఆఫ్స్‌కు చెన్నై టీం.. టాప్ 4 కోసం పెద్ద ప్లాన్ చేశారుగా..!



సన్‌రైజర్స్ హైదరాబాద్ చేతిలో ఎదురైన ఘోర పరాజయం ఐదుసార్లు ఛాంపియన్ చెన్నై సూపర్ కింగ్స్ ప్లేఆఫ్స్ ఆశలను తీవ్రంగా దెబ్బతీసింది. లీగ్ దశ ముగింపునకు వస్తున్న తరుణంలో, అభిమానుల గుండెల్లో రైళ్లు పరిగెత్తిస్తున్న చెన్నై జట్టు ఆఖరి నాలుగు స్థానాల్లో నిలవాలంటే ఎలాంటి అద్భుతాలు జరగాలో ఇప్పుడు చూద్దాం. సొంత మైదానమైన చెపాక్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో జరిగిన మ్యాచ్ చెన్నై సూపర్ కింగ్స్‌కు అత్యంత కీలకంగా మారింది. ఈ మ్యాచ్‌లో గెలిచి ఉంటే ప్లేఆఫ్స్ రేసులో చెన్నై ముందంజలో ఉండేది. కానీ, హైదరాబాద్ ఐదు వికెట్ల తేడాతో విజయం సాధించి నేరుగా ప్లేఆఫ్స్ బెర్త్ ఖాయం చేసుకుంది. ఈ ఓటమితో చెన్నై జట్టు 13 మ్యాచ్‌లలో 6 విజయాలతో 12 పాయింట్లతో ఆరో స్థానానికి పడిపోయింది. ప్రస్తుతం రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, గుజరాత్ టైటాన్స్, సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్లు ఇప్పటికే నాకౌట్ చేరగా, ఆఖరి స్థానం కోసం చెన్నై పోరాడుతోంది.

**గుజరాత్‌తో జరిగే ఆఖరి మ్యాచ్ చావో రేవో..!**

చెన్నై సూపర్ కింగ్స్ లీగ్ దశలో తన చివరి మ్యాచ్‌ను మే 21న అహ్మదాబాద్ వేదికగా గుజరాత్ టైటాన్స్‌తో ఆడనుంది. ఈ మ్యాచ్ చెన్నై జట్టుకు జీవన్మరణ సమస్యగా మారింది. ఇందులో ఓడిపోతే ఎలాంటి సమీకరణాలతో సంబంధం లేకుండా చెన్నై టోర్నీ నుంచి పూర్తిగా నిష్క్రమిస్తుంది. ఒకవేళ గుజరాత్‌పై భారీ విజయం సాధిస్తేనే చెన్నై గరిష్టంగా 14 పాయింట్లకు చేరుకుంటుంది. అయితే, కేవలం గెలుపు మాత్రమే సరిపోదు, నెట్ రన్ రేట్ కూడా మెరుగుపరుచుకోవాల్సి ఉంటుంది.

**ఇతర జట్ల ఓటములపైనే 'తలా' సేన ఆశలు..**

ప్రస్తుతం చెన్నై ప్లేఆఫ్స్ భాగ్యం పూర్తిగా వారి చేతుల్లో లేదు. గుజరాత్‌పై చెన్నై గెలిచిన తర్వాత కూడా ఈ కింది ఫలితాలు రావాల్సి ఉంటుంది:

రాజస్థాన్ రాయల్స్ రెండు మ్యాచ్‌ల్లోనూ ఓడిపోవాలి: ఇప్పటికే 12 పాయింట్లతో ఉన్న రాజస్థాన్, తన మిగిలిన రెండు మ్యాచ్‌లలో (లక్నో, ముంబైలపై) ఓడిపోవాలి.

పంజాబ్ కింగ్స్ ఓడిపోవాలి: 13 పాయింట్లతో నాలుగో స్థానంలో ఉన్న పంజాబ్ జట్టు లక్నో సూపర్ జయంట్స్‌తో జరిగే మ్యాచ్‌లో పరాజయం పాలుకావాలి.

కోల్‌కతా నైట్ రైడర్స్ సమీకరణాలు: కోల్‌కతా జట్టు ఢిల్లీని ఓడించి, ముంబై చేతిలో ఓడిపోవాలి.

ఈ అంచనాలన్నీ అనుకూలంగా జరిగితే, 14 పాయింట్లతో నిలిచే చెన్నై, ఢిల్లీ జట్ల మధ్య నెట్ రన్ రేట్ ఆధారంగా నాలుగో స్థానాన్ని నిర్ణయిస్తారు.

**రన్ రేట్ కీలకం కానున్న క్లైమాక్స్..**

ప్రస్తుతం 5 జట్లు ఒకే ఒక్క స్థానం కోసం పోటీ పడుతుండటంతో రన్ రేట్ అత్యంత ప్రాధాన్యత సంతరించుకుంది. చెన్నై నెట్ రన్ రేట్ ప్రస్తుతం స్వల్పంగా మైనస్‌లోకి వెళ్లినందున, గుజరాత్‌పై కేవలం గెలవడమే కాకుండా భారీ తేడాతో విజయం సాధించడం అత్యవసరం. కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ ఈ ఒత్తిడిని అధిగమించి జట్టును ఎలా నడిపిస్తాడనేది చూడాలి. చెన్నై సూపర్ కింగ్స్ ఆశలు ప్రస్తుతం సన్నని దారంపై వేలాడుతున్నాయి. అద్భుతాలు జరిగితే తప్ప 5సార్లు విజేతగా నిలిచిన ఈ జట్టు టాప్-4 లో అడుగుపెట్టడం అసాధ్యంగా కనిపిస్తోంది. కోట్లాది మంది అభిమానులు తమ ప్రియతమ జట్టు కోసం, ఎంఎస్ ధోనీని మరోసారి నాకౌట్ మ్యాచ్‌ల్లో చూడటం కోసం ప్రార్థనలు చేస్తున్నారు. మరి మే 21 నాటి పోరులో చెన్నై ఎలాంటి ప్రదర్శన ఇస్తుందో వేచి చూడాలి.

# క్వాలిఫైయర్-1లో ఆర్సీబీ..

## బెంగళూరును ఢీ కొట్టే టీం ఏదో తెలుసా?




డిఫెండింగ్ ఛాంపియన్ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు అభిమానుల కలలు నిజం చేస్తూ ఐపీఎల్ 2026 సీజన్‌లో అందరికంటే ముందే క్వాలిఫైయర్-1కు అర్హత సాధించింది. పాయింట్ల పట్టికలో అగ్రస్థానాన్ని పటిష్టం చేసుకున్న బెంగళూరు జట్టు, ఫైనల్ బెర్త్ కోసం తలపడబోయే ఈ ప్రతిష్ఠాత్మక పోరు ఎప్పుడు, ఎక్కడ, ఏ జట్టుతో జరగనుందో ఇప్పుడు చూద్దాం. ఐపీఎల్ చరిత్రలోనే మున్నెన్నడూ లేని విధంగా, ఈసారి లీగ్ చరిత్రలో మొదటిసారి ఒక నాకౌట్ మ్యాచ్ హిమాచల్ ప్రదేశ్‌లోని అందమైన ధర్మశాల స్టేడియంలో జరగనుంది. సముద్ర మట్టానికి దాదాపు 1,457 మీటర్ల ఎత్తులో, మంచుతో కప్పబడిన దౌలాధర్ పర్వత శ్రేణుల మధ్య ఈ మ్యాచ్ జరగనుండటం విశేషం. మే 26వ తేదీ రాత్రి 7:30 గంటలకు ప్రారంభమయ్యే ఈ క్వాలిఫైయర్-1 పోరు కోసం క్రికెట్ ప్రపంచం మొత్తం ఎంతగానో ఎదురుచూస్తోంది. ప్రకృతి అందాల నడుమ సాగే ఈ మ్యాచ్ అభిమానులకు ఒక అద్భుతమైన అనుభూతిని ఇవ్వడం ఖాయం.

**ఆర్సీబీతో తలపడే ఆ బలమైన జట్టు ఏది..?**

లీగ్ దశ ముగిసే సమయానికి పాయింట్ల పట్టికలో మొదటి రెండు స్థానాల్లో నిలిచిన జట్లు ఈ క్వాలిఫైయర్-1 లో తలపడతాయి. ఇప్పటికే రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు మొదటి స్థానాన్ని దాదాపు ఖరారు చేసుకోగా, రెండో స్థానం కోసం గుజరాత్ టైటాన్స్, సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్ల మధ్య గట్టి పోటీ నడుస్తోంది. ప్రస్తుత సమీకరణాల ప్రకారం, పటిష్టమైన గుజరాత్ టైటాన్స్ జట్టు ఆర్సీబీతో తలపడే అవకాశాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. ఒకవేళ ఆఖరి లీగ్ మ్యాచ్‌ల్లో ఫలితాలు మారితే హైదరాబాద్ కూడా రేసులోకి వచ్చే అవకాశం ఉంది.

**ఫైనల్‌కు చేరే సువర్ణావకాశం ఎవరిది..?**

ఈ మ్యాచ్‌లో గెలిచిన జట్టు నేరుగా మే 31న అహ్మదాబాద్‌లో జరిగే గ్రాండ్ ఫైనల్‌కు అర్హత సాధిస్తుంది. అయితే, క్వాలిఫైయర్-1 లో ఓడిపోయిన జట్టుకు మరో అవకాశం ఉంటుంది. ఆ జట్టు మే 29న చండీగఢ్‌లో జరిగే క్వాలిఫైయర్-2 లో ఎలిమినేటర్ మ్యాచ్ విజేతతో తలపడాల్సి ఉంటుంది. వరుసగా రెండో ఏడాది కూడా ట్రోఫీని తమవద్దే ఉంచుకోవాలని భావిస్తున్న ఆర్సీబీకి, ఈ మ్యాచ్ అత్యంత కీలకంగా మారింది. విరాట్ కోహ్లీ, రజత్ పాటిదార్ ఫామ్‌లో ఉండటం జట్టుకు కొండంత బలాన్ని ఇస్తోంది.

**టికెట్ల వేటలో క్రికెట్ అభిమానులు..**

హిమగిరుల నేపథ్యంలో సాగే ఈ మహా సమరానికి సంబంధించిన టికెట్ల విక్రయాలు మే 20 నుంచి ప్రారంభం కానున్నాయి. అధికారిక భాగస్వామి ద్వారా ఈ టికెట్లు అందుబాటులోకి రానున్నాయి. తొలి రోజు రూపే క్రెడిట్ కార్డ్ వినియోగదారులకు ముందస్తు అవకాశం కల్పించగా, మే 21 నుంచి సాధారణ ప్రజలందరికీ టికెట్లు అందుబాటులో ఉంటాయి. ఆర్సీబీ ఆడే మ్యాచ్ కావడంతో కొన్ని నిమిషాల్లోనే టికెట్లు అమ్ముడైపోతాయని నిర్వాహకులు భావిస్తున్నారు. గతేడాది విజేతగా నిలిచిన రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, ఈసారి కూడా అదే జోరును కొనసాగిస్తూ క్వాలిఫైయర్-1 కు చేరడం అభిమానుల్లో ఉత్సాహాన్ని నింపింది. ధర్మశాల లాంటి అద్భుతమైన వేదికపై బెంగళూరు జట్టు తన విశ్వరూపం చూపిస్తుందా? లేదా ప్రత్యర్థి జట్టు షాక్ ఇస్తుందా? అనేది మే 26న తేలిపోనుంది. ఈ మ్యాచ్‌లో గెలిచి నేరుగా ఫైనల్‌కు దూసుకెళ్లాలని బెంగళూరు వ్యూహాలు రచిస్తోంది.




VISWAM VOICE Telugu Daily: Edited, Printed, Published and Owned by KHANDAVELLI SUNIL KUMAR, H.No:3-168, Pedda Brahmamgariveedi, Rayavaram, Rayavaram (M), East Godavari District, Andhra Pradesh. Pin:533346. Ph:092460 33999, 9238823333, 8099966647, Printed at Kumar Publication, H.No.9-125, Indiramma Colony, Rayavaram, Rayavaram(M), East Godavari District, Andhra Pradesh. Pin:533346, Editor: KHANDAVELLI SUNIL KUMAR. RNI No: APTEL 2017/73603(146158), viswamvoice@gmail.com